ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

ఆదివారం 17.08.2025 | సంపుటి : 12 సంచిక : 29 | పేజీలు : 12 వెల : రూ. 4/-

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



వరదలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు

# వానా.. వానా.. వల్లప్పా

## తడిసి ముద్దైన తెలంగాణ

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- వరంగల్,ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో దంచికొడుతున్న వానలు
- ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలకు అత్యంత భారీవర్ష సూచన
- శ్రీశైలం, సింగూరు, కొమురంభీం జలాశయాల గేట్లు ఎత్తివేత
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి



భద్రాచలం వద్ద స్నానఘట్టాలను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి నది

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలోని నాలుగు జిల్లాలకు భారత వాతావరణ విభాగం ఐఎండీ రెడ్అలెర్ట్ జారీ చేసింది. అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలో భారీవర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు.. వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఉద్యోగస్తులు వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. అవసరమైతే తప్ప జనాలను బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. జయశంకర్ భూపాల పల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు ఐఎండీ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మరో పద కొండు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసి.. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో 3రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇదిలావుంటే ఆదిలాబాద్ జిల్లాలో

మిగతా 2లో..

# మరింత అప్రమత్తత అవసరం

- ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలి
- వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉంది
- కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారం సేకరించాలి
- సహాయ బృందాలతో సమన్వయం చేసుకోవాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మ రింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదే శించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. జగిత్యాల మినహా 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని సీఎం తెలిపారు.

మిగతా 2లో..





## యుద్ధం ఆపడమే
# అత్యుత్తమం

## ముగిసిన ట్రంప్, పుతిన్ కీలక భేటీ

- మా సమావేశం ఫలప్రదమైంది
- భేటీలో అనేక అంశాలు చర్చకు వచ్చాయి
- తుది ఒప్పందం మాత్రం కుదరలేదు
- కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంది
- త్వరలో జెలెన్స్కీ, యురోపియన్ యూనియన్ నేతలతో మాట్లాడతా: ట్రంప్
- ఉక్రెయిన్తో రష్యా యుద్ధం ముగించేందుకు నిజాయతీగా ఉన్నా
- ఈ సమావేశం వివాదానికి ముగింపు పలకడానికి ప్రారంభ స్థానం
- ట్రంప్ అధికారంలో ఉండి ఉంటే ఉక్రెయిన్తో యుద్ధం వచ్చి ఉండేది కాదు: పుతిన్

### జెలెన్స్కీతో ట్రంప్ భేటీ!
రేపు సమావేశమయ్యే అవకాశం

### ట్రంప్-పుతిన్ భేటిని స్వాగతిస్తున్నాం : భారత్

### పుతిన్తో ట్రంప్ భేటీ భారత్కు కలిసొచ్చేనా?
రష్యా చమురును కొనుగోలు చేస్తున్న దేశాలపై సుంకాల విషయంలో పునరాలోచిస్తానన్న అమెరికా అధ్యక్షుడు

వివరాలు లోపలి పేజీల్లో..

వాషింగ్టన్(జనంసాక్షి): అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగిన కీలక భేటీ ముగిసింది. 2.30 గంటలకు పైనే వీరి సమావేశం జరిగింది. అయితే ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి ఎలాంటి ఒప్పందం కుదరకుండానే చర్చలు ముగిశాయి. అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్లో ఇరువురు నేతలు భేటీ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. సమావేశం ఫలప్రదమైందని పేర్కొన్నారు. భేటీలో అనేక అంశాలు చర్చకు వచ్చాయని తెలిపారు. ఈ చర్చల్లో ఎంతో పురోగతి ఉందన్నారు. అయితే కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని వెల్లడించారు. తుది ఒప్పందం మాత్రం కుదరలేదన్నారు. చాలా అంశాలను ఇద్దరం అంగీకరించామని, అయితే కొన్ని ఇంకా మిగిలే ఉన్నాయన్నారు. అన్ని విషయాలను పరిష్కరించుకొని అధికారికంగా అగ్రిమెంట్పై సంతకం చేసే వరకు ఒప్పందం జరగదన్నారు. త్వరలో తాను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, యురోపియన్ యూనియన్ నేతలతో మాట్లాడతానని ట్రంప్ తెలిపారు.

మిగతా 2లో..



# ఉద్యమకారులైతే వేల కోట్ల ఆస్తులు ఎలావచ్చాయి?

- అసలైన ఉద్యమకారులు తాము ఉద్యమకారులమని చెప్పుకోలే
- కొందరు గాలి ప్రణాళికలతో దేశాన్ని ఏలాలని చూశారు
- వ్యక్తిగత కక్షలకోసం రాజకీయాలు వాడుకునే స్థాయిలో లేను
- అందెశ్రీ హసిత భాష్పాలు పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఉద్యమంలో ఆనాటి నుంచినేటి వరకు అసలైన ఉద్యమకారులు ఎవరు కూడా తాము ఉద్యమకారుణ్ణి అని చెప్పుకోలేదని, కొద్ది మంది ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకి టీవీలు, పేపర్లు, వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో తనకు అర్థం కావడం లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొం దరు గాలికి అనుకూలంగా ప్రణాళికలు వేసుకుని, దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో తెలంగాణ పేరు, పేగు బంధాన్ని తెంచుకున్నారని పరోక్షంగా బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసిఆర్ను ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాను ఎవరిని కూడా శత్రువుగా చూడనని, తాను శత్రువుగా చూడాలంటే వాళ్లకు స్థాయి ఉండాలని అన్నారు. 2040 వరకు క్రియాశీలక

మిగతా 3లో..

# లాపతా ఓట్..

## రాహుల్ గాంధీ డాక్యుమెంట్

- నిమిషం నిడివితో ఎక్స్లో పోస్టు చేసిన కాంగ్రెస్ అగ్రనేత
- నేటినుంచి బీహార్లో ఓట్ అధికార్ యాత్ర



న్యూఢిల్లీ/పాట్నా(జనంసాక్షి): ఓట్ చోరీకి పాల్పడుతోందంటూ ఎన్నికల కమిషన్పై వరుస విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మరోసారి ఓట్ల చౌర్యంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హాస్యం, వ్యంగ్యం మేళవించిన స్పూఫ్ వీడియోను శనివారంనాడు సామాజిక మాధ్యమం ఎక్స్లో పోస్ట్ చేశారు. ఎన్నికల సంఘం బీహార్లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా, ప్రజల ఓటు-హక్కుపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా లోక్సభ ప్రతిపక్షనేత రాహుల్గాంధీ ఆదివారం 'ఓటు- అధికార్ యాత్ర'ను చేపట్టనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత అఖిలేష్ ప్రసాద్ సింగ్ తెలిపారు. ఆయన శనివారం పాట్నాలో జరిగిన మీడయా సమావేశంలో మాట్లాడుతూ.. బీహార్లో ఓటు- అధికార్ యాత్రను ససారం నుంచి రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు. ఈ యాత్ర బహుశా సెప్టెంబర్ 1న ముగియనుంది. ఈ యాత్ర ముగిసేవరకు రాహుల్ రాష్ట్రంలోనే ఉండనున్నారు. ఈ యాత్ర కోసం ముందుగానే అనుమతులు తీసుకున్నాము. ఈ యాత్ర రాష్ట్రంలోని 25 జిల్లాలను కవర్ చేస్తుంది. ఆగస్టు 20, 25, 31 తేదీల్లో యాత్రకు

మిగతా 2లో..

# ఓట్ల చోరీపై కదలిన ఈసీ

రాహుల్ విమర్శలపై మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించే అవకాశం





న్యూఢిల్లీ(జనంసాక్షి): రాహుల్ విమర్శలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధం అవుతోంది. కర్ణాటక, బిహార్ సహా దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష నేతలు ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విమర్శలకు చెక్ పెట్టేందుకు ఈసీ సిద్ధమైనట్లు- తెలుస్తోంది. ఓట్ల చోరీ ఆరోపణల వేళ.. ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు- సమాచారం. బిహార్లో రాహుల్ గాంధీ 'ఓటు- అధికార యాత్ర'ను ప్రారంభించనున్న రోజే ఈ సమావేశం ఏర్పాటుకు ముందుకు రావడం గమనార్హం. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే

మిగతా 2లో..

## పాక్ ఉగ్రవాదులతో
# లింకులు..

ఐబీ అదుపులో శ్రీసత్యసాయి జిల్లావాసి

ధర్మవరం(జనంసాక్షి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఐబీ అధికారులు, పోలీసులు తనిఖీలు చేశారు. కోట కాలనీలో నూర్ మహమ్మద్ను అదుపులోకి తీసుకున్నారు స్థానిక పోలీసులతో కలిసి ఐబీ అధికారులు అతడి ఇంటిని తనిఖీ చేశారు. అక్కడ అనుమానిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నూర్ మహమ్మద్ పాకిస్థాన్కు ఫోన్ కాల్స్ చేస్తూ అక్కడి ఉగ్రవాదులతో చాటింగ్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఐబీ అధికారులు అతడిని ప్రశ్నిస్తున్నారు.

# రాజగోపాల్ వ్యవహారం క్రమశిక్షణా కమిటీకి..

## ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటాం
టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్(జనంసాక్షి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం క్రమశిక్షణా కమిటీ చూసుకుంటుందని, ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటామని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని మునుగోడు నియోజక వర్గం అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా వివక్ష చూపిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పరిశీలించాలని క్రమశిక్షణ కమిటీని ఆదేశించామని, రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని తెలియజేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో త్వరలో స్పష్టత వస్తుందని, మార్వాడీలు మనలో ఒకరని, వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదని మహేశ్

మిగతా 2లో..

## కాళేశ్వరంను కూలేశ్వరం అన్నట్టే...
# పోలవరంను కూలవరం అనగలరా?



- అక్కడో నీతి..ఇక్కడో నీతా
- మేడిగడ్డకు ఎందుకు మరమ్మతులు చేయట్లేదు?
- బీజేపీ, కాంగ్రెస్ల తీరుపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా? అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. ఎన్నికల వేళ అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై విమర్శలు చేస్తున్నారు. 24 గంటల్లో భాజపా నేతలు ఎన్డీఎస్ఏను దించి భారత రాష్ట్ర సమితిపై బురదజల్లారు. కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్పై భాజపా నేతలు మౌనంగా ఉన్నారు. పోలవరం కాఫర్ డ్యామ్ రెండోసారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. మేడిగడ్డలో 2 పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్, భాజపా నేతలకు పోలవరాన్ని కూలవరం అనే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నంచారు. జాతీయ హోదా ఇచ్చి మరీ.. సాక్షాత్తూ ఎన్డీఏ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు 'పోలవరంను.. కూలవరం' అనే దమ్ము ధైర్యం ఉందా..? అని అడిగారు. తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..? అని ప్రశ్నించారు. ఏకంగా 10 అడుగుల వెడల్పు.. 7 నుంచి 8 అడుగుల లోతుకు కుంగిన పోలవరం

మిగతా 2లో..

# రాష్ట్రపతికి కోర్టులు గడువు విధించే అధికారం లేదు

కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉంది

సుప్రీం కోర్టుకు తన అభిప్రాయాన్ని తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ(జనంసాక్షి): శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువు లోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశించవచ్చా అనే అంశంపై అభిప్రాయాలు తెలియజేయాలని ఇటీవల సుప్రీం కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి పంపిన లిఖిత పూర్వక వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. అందులో రాష్ట్రపతి, గవర్నర్ల

మిగతా 9లో..



# అభ్యర్థి ఎవరైనా సరే జూబ్లీహిల్స్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- అందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలలి
- సమీక్ష సమావేశంలో మంత్రులు పొన్నం, తుమ్మల

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, అందుకు తగిన విధంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అభ్యర్థి ముఖ్యం కాదని, అది పార్టీ చూసుకుంటుందని అన్నారు. మనమంతా ఐక్యంగా పోరాడి కాంగ్రెస్ సత్తా చాటాలని అన్నారు. ఎన్నికలు

మిగతా 2లో..

# లాపతా ఓట్..

విరామం. సెప్టెంబర్ 1 పాట్నాలో జరిగే ర్యాలీతో ఈ యాత్ర ముగుస్తుంది. ఈ యాత్రలో బీహార్ అసెంబ్లీ ప్రతిపక్షనేత తేజస్వియాదవ్ పాల్గొంటారు. ఆర్‌జెడితోపాటు- ఇండియా బ్లాక్‌లోని ఇతర పార్టీలైన వామపక్ష పార్టీల నేతలు కూడా పాల్గొనున్నారని ఆయన అన్నారు.బిహార్ ఓటర్ల జాబితాలో లోపాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా 'లాపతా ఓటు-' అనే -టైటిల్‌తో వీడియోను ఎక్స్‌లో శనివారం విడుదల చేశారు. నిమిషం నిడివి ఉన్న ఆ వీడియోలో.. పోలీసు స్టేషన్‌లో ఓ వ్యక్తి తన ఓటు- చోరీ చేశారని, ఇంకా లక్షల ఓట్లు- చోరీ అయ్యాయని అధికారులకు ఫిర్యాదు చేస్తారు. పోలీసు సిబ్బంది చెక్ చేసి అందులో తమ ఓట్లు- కూడా గల్లంతుకావడంతో నిర్ఘాంతపోతారు. అలా ఆ వీడియా ముగుస్తుంది. దీనిని రాహుల్ తన అధికారిక ఎక్స్‌లో పోస్టు చేస్తూ.. ఓటర్లందరూ చైతన్యంతో ఓ ఉద్యమంలా ముందుకు సాగాలి. మీ ఓటు- చోరీ అయితే మీ ప్రాథమిక హక్కు చోరీ అయినట్లే అని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా మనమందరం ఉద్యమంగా పోరాడి మన హక్కులను కాపాడుకుందామన్నారు. ఓట్ల చోరీ అనేది 'దూ ఆర్ డై' సమస్యగా కాంగ్రెస్ పేర్కొంది. ఓట్లు- గల్లంతైన వారి కోసం ఓ వెబ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. అందులో పోల్ ప్యానెల్ నుంచి ఓట్ల గల్లంతుకు వ్యతిరేకంగా నమోదు చేసుకోవడానికి, అధికారుల నుంచి జవాబుదారీతనం కోరడానికి, డిజిటల్ ఓటరు జాబితాల డిమాండ్‌కు మద్దతు తెలియజేయడానికి ఆ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది.

# ఓట్ల చోరీపై కదలిన ఈసీ

సమయంలో తప్ప.. ఇతర అంశాలపై ఎన్నికల సంఘం అధికారికంగా విలేకరుల సమావేశం నిర్వహించడం చాలా అరుదు. ఆదివారం నిర్వహించనున్న మీడియా సమావేశం వెనుక అసలు కారణాన్ని వెల్లడించనప్పటికీ.. కొంతకాలంగా ఈసీపై వెల్లువెత్తుతున్న ఆరోపణలకు సంబంధించినదని అధికారులు తెలిపారు. ప్రతిపక్షాలు 'ఓటు- చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని ఈసీ ఇప్పటికే తప్పుపట్టింది. తప్పుడు కథనాలకు కారణమయ్యే ప్రచారాన్ని చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది.బిహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ, ఓట్ల చోరీపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్లు- చోరీకి గురయ్యాయని రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించారు. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్ల చోరీ జరిగిందన్నారు. ఈ ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరింది. లేనిపక్షంలో దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నడుమే కీలక సమావేశానికి సిద్ధమైనట్లు- తెలుస్తోంది.

# రాజగోపాల్ వ్యవహారం క్రమశిక్షణా కమిటీకి..

కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే తెలంగాణ ప్రాజెక్టుల గురించి టిడిపి ఆలోచించడం లేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం నుంచి టిడిపి బయటికి రావాలని అన్నారు. అద్దంకి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. తమ వాట కోసం.. తాము కొట్లాడితే మీకు వ్యతిరేకం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఆంధ్రా నీటి పంపకాల్లో బిజెపి నష్టం కలిగిస్తోందని అద్దంకి దయాకర్ విమర్శించారు.

# అభ్యర్థి ఎవరైనా సరే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్‌ఛార్జులు, ముఖ్య నేతలతో మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఎర్రగడ్డ డివిజన్‌లో నేతలంతా ఐక్యంగా పని చేయాలని, అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్ బూత్ కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు- చేసుకోవాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బూత్‌ల వారీగా డివిజన్‌లో ఉన్న 46 బూత్‌ల పరిధిలో సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే అది రాష్ట్ర అభివృద్ధికి సంకేతం అవుతుందన్నారు. తామంతా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత అజారుద్దీన్ సహా స్థానిక నేతలు పాల్గొన్నారు.

# సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుంటాం

**భారత పర్యటనలోని భేటీల్లో ఈ దిశగా కీలక పురోగతి లభిస్తుందని ఆశిస్తున్నాం: చైనా విదేశాంగ శాఖ ప్రకటన**

**బీజింగ్ (జనంసాక్షి):**తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్‌లో ఇరు దేశాల మధ్య ఘర్షణతో స్తంభించిన భారత్-చైనా దౌత్య సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పలు దౌత్య సంబంధాలపై ఇరుదేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఇందులో భాగంగా చైనా-భారత్ సరిహద్దు సమస్యలపై చర్చలు జరపడానికి చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్‌యి వచ్చే వారం భారత్‌కు రానున్నట్లు ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా వాంగ్ యి ఆగస్టు 18 నుంచి 20 వరకు భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ , విదేశాంగ మంత్రి జైశంకర్ సహా పలువురు మంత్రులతో సమావేశమవ్వనున్నట్లు సమాచారం.కొవిడ్ 19, గల్వాన్ సంఘర్షణల నేపథ్యంలో భారత్-చైనాల మధ్య పలు విభేదాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఇటీవల లద్దాఖ్ సరిహద్దులో బలగాల ఉపసంహరణ, గస్తీ పునఃప్రారంభం, నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ, కైలాస మానససరోవర్ యాత్ర పునఃప్రారంభం వంటి విషయాల్లో ఇరుదేశాలు పలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వాంగ్ యి పర్యటన కీలకంగా మారనున్నట్లు చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ భేటీలో ఇరుదేశాల మధ్య దౌత్య, వాణిజ్య సహకార సంబంధాలను పునరుద్ధరణకు కృషి చేస్తామని పేర్కొంది. ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ సైతం చైనాలో పర్యటించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ సైతం త్వరలో చైనా పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

# అవును.. సరోగసి పేరుతో మోసం చేశాను

**సృష్టి ఫెర్టిలిటీ కేసులో నేరాన్ని అంగీకరించిన డాక్టర్ నమ్రత**

**హైదరాబాద్(జనంసాక్షి):**సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితురాలు డాక్టర్ నమ్రత నేరాంగీకార పత్రంలో కీలక అంశాలు నమోదు చేశారు. నమ్రత నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. నేరాంగీకార పత్రంలోని వివరాల ప్రకారం.. విజయవాడ, సికింద్రాబాద్, విశాఖలో ఫెర్టిలిటీ సెంటర్లు నడిపారు. సరోగసి పేరుతో నమ్రత రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు వసూలు చేశారు. ఏజెంట్లను నియమించుకొని పిల్లలను కొనుగోలు చేశారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు డబ్బులు ఆశచూపి శిశువు విక్రయానికి ఒప్పందం చేసుకున్నారు. ప్రసవం తర్వాత బాలింతల నుంచి పిల్లల్ని కొనుగోలు చేశారు. ఆ పిల్లలను సరోగసి ద్వారా పుట్టిన వారిగా నమ్మించారు. పై విషయాలతో పాటు.. పలు పోలీసు స్టేషన్లలో తనపై కేసులు నమోదైనట్లు నమ్రత ఒప్పుకొన్నారు.

# వానా..వానా..వల్లప్పా





ప్రాంతం నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. 404.70 అడుగులకు నీటి మట్టం పెరిగింది. మహబూబాబాద్ జిల్లాలోని పాకాల కొత్తగూడం నుంచి గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం అటవీ ప్రాంతాల నుంచి జలాశయానికి 1,700 క్యూసెక్కుల చొప్పున నీరు చేరడంతో డ్యాం అధికారులు అప్రమత్తమయ్యారు. డ్యాం సామర్థ్యం 407 అడుగులు కాగా 404.70 అడుగులకు నీరు చేరడంతో లోతట్టు- ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. జలాశయం దిగువ ప్రాంతం లో ఉన్న లోతట్టు- గ్రామాల ప్రజలు వాగులు దాటొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

కుండపోతగా వర్షం కురుస్తున్నది. జిల్లాలోని పలు జిల్లాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపిలేకుండా వాన పడుతున్నది. దీంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తు న్నాయి. సిరికొండ మండలం లో చికమాగన్ వాగు ఉప్పొంగింది. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నార్నూర్, గాదిగూడ మండలాల్లో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలలో వర్షపునీరు చేరి జలమయమయ్యాయి. గాదిగూడ మండలంలోని ఖడ్కి, లోకారికే, అర్జుని, దాబా, మేడిగూడ, చిత్తగూడ, నార్నూర్‌లోని బాబేఝరి ప్రధాన రహదారులపై లో లేవల్ కల్వర్టులపై వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి ఉమ్మడి మండలంలోని జనం ఇండ్లకే పరిమితమయ్యారు. అత్యవసర సమయంలోనే బయటికి రావాలని, సమస్యలుంటే నేరుగా సంబంధిత శాఖ లేదా డయల్ 100కి సమాచారం అందించాలని నార్నూర్ సీఐ పేందూర్ ప్రభాకర్ తెలిపారు. ఉట్నూరు మండలం దంతనపల్లి వద్ద రోడ్డుపై చెట్లు- కూలిపడిపోయింది. దీంతో ఉట్నూరు నుంచి జన్నారం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా మెదక్ జిల్లాలో సింగూరు ప్రాజెక్ట్ కు భారీగా వరద చేరడంతో గేట్లు- ఎత్తారు. వరద తాకిడితో ఏడుపాయల వనదుర్గా అమ్మవారి దేవాలయాన్ని మూసేశారు.

మెదక్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయాన్ని పూజారులు, అధికారులు మూసివేశారు. సింగూరు ప్రాజెక్టు గేట్లు- ఎత్తడంతో అమ్మవారి ఆలయం వద్ద మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ఉధృతి తగ్గిన తర్వాత ఆలయాన్ని తెరుస్తామని అధికారులు తెలిపారు. అప్పటి వరకూ రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగుతాయని వెల్లడించారు. ఏటా భారీ వరద పో-టె-త్తడంతో అమ్మవారి ఆలయాన్ని ఇలా మూసివేస్తారు.

**భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి**

గోదావరి పరివాహకంలో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం(ఇఠశసశ-ఠశశెప) వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. నీటిమట్టం శు క్రవారం ఉదయం 6 గంటలకు 23.6 అడుగులకు చేరింది. 12 గంటలకు 25.4, 4గంటలకు 26.3అడుగులకు చేరగా.. రాత్రికి 28 అడుగుల వరకు చేరే అవకాశం ఉన్నట్టు- అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా భద్రాచలం గోదావరి స్నానఘట్టాలపై నుంచి నీరు ప్రవహిస్తోంది. భక్తులు, పర్యాటకులకు తెలిసేందుకు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు- చేశారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ

**ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీవర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు**

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్నాయి. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీవర్షానికి వాగులు పొంగి రోడ్డుపై ప్రవహిస్తుండటంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి.ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. మల్లపురం, సీతారాంపురం, కలిపాక వాగులు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని పెగడపల్లి, కేశపూర్ గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కాటారం-మేడారం రహదారిపై వాహనాల రాకపోకలు సాగడం లేదు. మేడారం సహ మండలంలోని 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

# మరింత అప్రమత్తత అవసరం

నిజా మాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని సీఎం తెలిపారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు- ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని.... పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు- చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటు-వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటు-లో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం,పశునష్టం చోటుచేసు కోకుండా జాగ్రత్తలు వహించాలని సీఎం తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

వర్ష నష్టాలు జరక్కుండా చూడండి:మంత్రి కోమటిరెడ్డి

తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనల వివరాలపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. 629 కిలో మీటర్లు రోడ్లు దెబ్బతిన్నట్లు- అధికారులు నివేదిక ఇచ్చినట్లు- చెప్పారు. రోడ్ల మరమ్మత్తులపై పనులు ప్రారంభించినట్లు- పేర్కొన్నారు. గత ప్రభుత్వం వేసిన నాణ్యతా రహిత రోడ్ల వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని ఆరోపించారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రోడ్ల డ్యామేజీపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

# కాళేశ్వరంను కూలేశ్వరం అన్నట్టే... పోలవరంను కూలవరం అనగలరా?

కాఫర్ డ్యామ్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఏపీలో యుద్ధప్రాతిపదికన రిపేర్ చేస్తుంటే.. తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ బ్యారేజీ వద్ద తట్టెడు సిమెంట్‌కు దిక్కులేకపోవడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి మూర్ఖత్వమే అని కేటీఆర్ మండిపడ్డారు. 2020లో పోలవరం డయాఫ్రం వాల్ రెండేండ్లకే కొట్టుకుపోయినా ఇప్పటికీ ఉలుకు లేదు, పలుకూ లేదు. మరోసారి ఏపీలో పోలవరం కాఫర్ డ్యామ్ గోదావరిపాలైనా, ఇటు- తెలంగాణలో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది మరణించినా ఇప్పటికీ ఎన్డీఎస్‌ఏ అడ్రస్ లేదు. పంజాబ్‌నే తలదన్నే స్థాయిలో తెలంగాణలో వ్యవసాయ విప్లవాన్ని సృష్టించి, దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రైతును తీర్చిదిద్దిన కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సాగిస్తున్న మూకుమ్మడి కుట్రలను కాలరాస్తాం.. తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. జై తెలంగాణ.. జై కాళేశ్వరం.. అని కేటీఆర్ నినదించారు.

# పాక్ ఉగ్రవాదులతో లింకులు..

నిందితుడు ధర్మవారం మార్కెట్ వీధిలోని టీస్టాల్‌లో పనిచేస్తున్నట్లు గుర్తించారు.

# దేశవ్యాప్తంగా దంచికొడుతున్న వానలు

**భారీ వర్షంతో ముంబై అతలాకుతలం**
**వరదలు ముంచెత్తడంతో జనం అవస్థలు**

**ముంబై(జనంసాక్షి):**భారీ వర్షాలు ముంబైని ముంచెత్తుతున్నాయి.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం వరదలు ముంబైని అతలాకుతలం చేశాయి. వీధులు, రోడ్లపై భారీ ఎత్తున వరద నీరు నిల్చిపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. విక్రోలీ పార్క్ సైట్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఇద్దరు చనిపోయారు.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. శనివారం భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మరోవైపు భారీ వర్షాలతో లాతోర్ జిల్లా వణికిపోతోంది. జిల్లాలో టెర్నా, మంజారా నదుల ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వరద ముంపు ఉన్నందున నది పరివాహక ప్రాంతంలో ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లాతూర్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఒఃఉ) రెడ్ అలర్ట్ జారీ జారీ చేసింది. శనివారం తెల్లవారుజామున 1 గంటల నుంచి4 గంటల మధ్య ముంబైలో అత్యంత భారీ వర్షపాతం నమోదైంది.పశ్చిమ ,తూర్పు శివారు ప్రాంతాలు అత్యధికంగా దెబ్బతిన్నాయి. పశ్చిమాన మరోల్ ఫైర్ స్టేషన్ లో 207 మిమీ,నారియల్వాడి స్కూల్, శాంటాక్రూజ్ 202 మిమీ వర్షపాతం నమోదు అయింది. తూర్పున ఠాగూర్ నగర్ స్కూల్, విఖ్రోలి 196 మిమీ , బిపి ఆఫీస్, విఖ్రోలి195 మిమీ లవర్షం కురిసింది.

# ఆర్‌ఎస్‌ఎస్ ఈ దేశానికి చాలా ప్రమాదకరం

**పిల్లల సిలబస్‌ను కూడా కాషాయీకరిస్తున్నారు**
**దేశ విభజనపై ఎన్‌సీఈఆర్‌టీ పాఠంపై కాంగ్రెస్ విమర్శలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ విభజన సమయంలోని భయానక పరిస్థితులను వివరిస్తూ..నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విద్యార్థుల కోసం ఓ ప్రత్యేక మాడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో 1947లో జరిగిన దేశ విభజనకు ఒక వ్యక్తి మాత్రమే కారణం కాదని..ఇందులో ముగ్గురి పాత్ర ఉందని పేర్కొంది. విభజనకు పట్టుబట్టిన ముస్లిం లీగ్ అగ్రనేత మహమ్మద్ అలీజిన్నా, దానికి అంగీకరించిన కాంగ్రెస్, అమలు చేసిన లార్డ్ లూయిస్ మౌంట్ బాటన్ అని తెలిపింది. ఈ విభజన వల్లే భారత్‌కు కశ్మీర్ సమస్యగా మారిందని..నాటి నుంచి కశ్మీర్‌ను పాక్ మార్గంగా చేసుకొని దేశంపై పలు ఒత్తిడులను తీసుకురావడానికి ఉపయోగించుకుంటోందని ఆరోపించింది. 1947లో జరిగిన భారత్ పాకిస్థాన్ విభజన సమయంలో ప్రజల బాధ, బాధితుల వేదనలను గుర్తు చేసుకుంటూ ఏటా ఆగస్టు 14న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'విభజన గాయాల స్మారక దినం' గురించి ప్రస్తావించారు.

# యుద్ధం ఆపడమే అత్యుత్తమం




మళ్లీ పుతిన్‌ను కలుస్తానని చెప్పగా, తదుపరి సమావేశం మాస్కోలో అని పుతిన్ పేర్కొన్నారు.పుతిన్ మాట్లాడుతూ.. అలాస్కా సమావేశం చాలా నిర్మాణాత్మకంగా జరిగిందన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించేందుకు తాను నిజాయతీగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశం వివాదానికి ముగింపు పలకడానికి ప్రారంభ స్థానంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. ట్రంప్‌తో తనకున్న సంబంధం వ్యాపారం లాంటిదని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాల విషయాలలో క్లిష్టకాలంలో అధ్యక్షుడు ట్రంప్‌తో మాస్కో మంచి సంబంధాలు ఏర్పరచుకుందని పుతిన్ వెల్లడించారు. ట్రంప్ అధికారంలో ఉండి ఉంటే ఉక్రెయిన్‌తో రష్యాకు యుద్ధం వచ్చి ఉండేది కాదని పుతిన్ మరో మారు పేర్కొన్నారు.ట్రంప్, పుతిన్ భేటీ అనంతరం సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. అలాస్కా సమావేశం వివరాలను వెల్లడించిన అనంతరం పుతిన్ ఇంగ్లీష్‌లో మాట్లాడుతూ తదుపరి భేటీ మాస్కోలో ఉంటుందని ప్రకటించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. ఆహ్వానం ఆసక్తికరంగా ఉందని, అది జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు.

**రేపు జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ**

వాషింగ్టన్(జనంసాక్షి):ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకడంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్ అలాస్కాలో ్ేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ భేటీ జరిగిన కొన్ని గంటలకే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ యూరోపియన్ నేతలతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలోనే సోమవారం జెలెన్‌స్కీ, ట్రంప్ వాషింగ్టన్‌లో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఈ విషయాన్ని వెల్లడించారు. అలాస్కాలో సమావేశం అనంతరం విమానంలో తిరుగు ప్రయాణం చేస్తూ.. ట్రంప్ ఈ కాల్ మాట్లాడినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని జెలెన్‌స్కీ ఎక్స్ వేదికలో ధ్రువీకరించారు. ట్రంప్‌తో గంటన్నరకు పైగా ఫోన్‌లో మాట్లాడానని అన్నారు. శాంతి ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని పునరుద్ఘాటించానని చెప్పారు. పుతిన్‌తో సమావేశంలో చర్చించుకున్న ముఖ్య విషయాలను ట్రంప్ తనకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. త్రైపాక్షిక సమావేశంపై ట్రంప్ చేసిన ప్రతిపాదనకు తాను మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. కీలక అంశాలపై చర్చించుకునేందుకు అది మంచి వేదిక అవుతుందన్నారు. పరిస్థితులను చక్కదిద్దే బలం అమెరికాకు ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సోమవారం వాషింగ్టన్ డీసీలో ట్రంప్‌తో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించే అన్ని విషయాలపై అక్కడ చర్చిస్తానన్నారు. శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. అలాస్కా వేదికగా ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యి రెండున్నర గంటలకు పైగా చర్చించారు. అయినప్పటికీ ఎలాంటి ఒప్పందం కుదరలేదు. అయితే, చర్చలు సానుకూలంగా జరిగాయని ఇరువురు నేతలు ప్రకటించారు. ఈ సమావేశం అనంతరం ట్రంప్ ఫాక్స్ న్యూస్ ప్రతినిధి సియాన్ హానిటీతో మాట్లాడుతూ.. ఒప్పందంపై నిర్ణయం జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉందన్నారు. డీల్ కుదుర్చుకోవాలని తాను సూచిస్తానన్నారు.

ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధినేత పుతిన్‌లు అలాస్కా వేదికగా భేటీ అయిన విషయం తెలిసిందే. ఎలాంటి ఒప్పందం కుదరనప్పటికీ.. చర్చలు సానుకూలంగా సాగినట్లు ఇరునేతలు ప్రకటించారు. ఈ క్రమంలోనే 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఉక్రెయిన్, రష్యాలు నేరుగా శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే ఈ యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమ మార్గంగా పేర్కొన్నారు. కాల్పుల విరమణ నిలబడే అవకాశాలు తక్కువేనన్నారు. అదేవిధంగా జెలెన్‌స్కీ అమెరికా పర్యటనను ధ్రువీకరించారు."అలాస్కాలో ఇదొక గొప్ప, విజయవంతమైన రోజు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం చాలా బాగా జరిగింది. అదేవిధంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, నాటో సెక్రటరీ జనరల్, ఇతర ఐరోపా నేతలతో ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడాను. నేరుగా శాంతి ఒప్పందానికి వెళ్లడమే యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమ మార్గంగా ఓ నిర్ణయానికి వచ్చాం. కాల్పుల విరమణ తరచూ ఉల్లంఘనలకు గురయ్యే అవకాశం ఉంది. జెలెన్‌స్కీ సోమవారం ఓవల్ కార్యాలయానికి రానున్నారు. అన్ని సవ్యంగా సాగితే.. పుతిన్‌తో సమావేశాన్ని షెడ్యూల్ చేస్తాం. తద్వారా లక్షలాది మంది ప్రజల ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుంది" అని ట్రంప్ రాసుకొచ్చారు. దాదాపు ఐదేళ్ల విరామం అనంతరం ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగిన ఈ సమావేశాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనించాయి. భేటీలో అనేక అంశాలు చర్చకు వచ్చాయని ట్రంప్ తెలిపారు. ఈ చర్చల్లో ఎంతో పురోగతి ఉందన్నారు. అయితే కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని వెల్లడించారు. తుది ఒప్పందం మాత్రం కుదరలేదన్నారు. అన్ని విషయాలను పరిష్కరించుకొని అధికారికంగా అగ్రిమెంట్‌పై సంతకం చేసే వరకు ఒప్పందం జరగదన్నారు. 2022లో తాను అధ్యక్షుడిగా ఉండి ఉంటే ఉక్రెయిన్ యుద్ధం జరిగేదే కాదని ట్రంప్ పదే పదే చేసిన వ్యాఖ్యలపై తాజా భేటీలో పుతిన్ స్పందించారు. ఆ విషయాన్ని ధ్రువీకరిస్తున్నట్లు చెప్పారు.

# ట్రంప్-పుతిన్ భేటిని స్వాగతిస్తున్నాం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే ప్రయత్నాల్లో భాగంగా అలాస్కా వేదికగా అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య జరిగిన సమావేశాన్ని భారత్ స్వాగతించింది.ఈ భేటీలో భాగంగా సాధించిన పురోగతిని అభినందిస్తున్నట్లు పేర్కొంది. భారత విదేశాంగశాఖ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధినేత పుతిన్‌ల మధ్య అలాస్కాలో జరిగిన సమావేశాన్ని స్వాగతిస్తున్నాం. శాంతి సాధన దిశగా వారి ప్రయత్నాలు ఎంతో ప్రశంసనీయం. ఈ భేటీలో సాధించిన పురోగతిని అభినందిస్తున్నాం. చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్య పరిష్కారానికి ముందుకెళ్లాలి. ఉక్రెయిన్ సంక్షోభానికి వీలైనంత త్వరగా తెరపడాలని ప్రపంచం కోరుకుంటోంది" అని విదేశాంగశాఖ తన ప్రకటనలో పేర్కొంది. ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యేందుకు ముందుకు రావడాన్ని కూడా భారత్ ఇటీవల స్వాగతించిన విషయం తెలిసిందే. "ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికేందుకు ఇదో అవకాశంగా భావిస్తున్నాం. ఇది యుద్ధాల కాలం కాదన్న ప్రధాని నరేంద్ర మోదీ సందేశానికి ఈ ప్రయత్నాలు దోహదం చేస్తాయి" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# పుతిన్‌తో ట్రంప్ భేటీ భారత్ కలిసొచ్చేనా..?

రష్యా చమురును కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తాజాగా ఆయన కాస్త వెనక్కి తగ్గినట్లు కన్పిస్తోంది. ఈ అదనపు టారిఫ్‌ల అంశంపై పునరాలోచన చేస్తానని వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కీలక భేటీ ముగిసిన తర్వాత ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉక్రెయిన్‌పై జరుగుతున్న సుదీర్ఘ యుద్ధం ఆపడమే లక్ష్యంగా ట్రంప్ పుతిన్‌తో భేటీ అయ్యారు. అలాస్కా వేదికగా రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో యుద్ధం ముగింపునకు ఎలాంటి ఒప్పందం జరగలేదు. భేటీ సానుకూలంగానే జరిగినట్లు ట్రంప్ తెలిపారు. ఈ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. "ఈ రోజు జరిగిన పరిణామాల తర్వాత.. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై సుంకాల గురించి ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని నేను అనుకోవడం లేదు. దీనిపై రెండు, మూడు వారాల్లో పునరాలోచన చేస్తామని అన్నారు.

# భారీ వర్షాలతో గ్రామీణ రహదారులకు నష్టం

**రూ.147.70 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇప్పటికి అందిన సమాచారం ప్రకారం, రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని గ్రామీణ రహదారులకు రూ.147.70 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు మంత్రి సీతక్కకు నివేదించారు. మొత్తంగా 84.97 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. నష్టానికి సంబంధించి ప్రాథమికంగా వేసిన అంచనాల ప్రకారం ఉపరితల రోడ్లు 48 ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 3.32 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ కోసం రూ. 42.63 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

సీడీ పనులు (కల్వర్టు, లోకాజ్ వే) 77 ప్రాంతాల్లో కల్వర్టు, లోకాజ్ వే లు, క్రాస్ డ్రెయిన్ నిర్మాణాలు దెబ్బతిన్నాయి. తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం రూ. 1.55 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ వ్యయం రూ. 57.60 కోట్లుగా ఇంజనీర్లు అంచనా వేశారు. 30 ప్రాంతాల్లో రహదారులకు గండ్లు పడ్డాయి. తాత్కాలిక పునరుద్ధరణకు రూ. 1.06 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 5.45 కోట్లు ఖర్చవుతుందన్న అంచనా.

ఈ మేరకు మొత్తం 124 ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినగా తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం రూ. 6.02 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ వ్యయం రూ. 141.68 కోట్లు, మొత్తం రూ.147.70 కోట్లు అవసరమవుతుందని అధికారులు పేర్కొన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన పునరుద్ధరణ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు. నిధుల కొరత లేదని, తాత్కాలిక మరమ్మత్తుల కోసం అవసరమైన నిధులు జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని..వాటిని వినియోగించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# కాళేశ్వరం మేడిగడ్డను కూల్చే కుట్రలు

- కేసు నమోదయినా ఎందుకు పురోగతి లేదు
- సిబిఐ విచారణ జరిపిస్తే నిజాలు వెల్లడవుతాయి
- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపయోగంగా పెట్టిందని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కావాలనే అక్కడ రిపేర్లు చేయకుండా, నీటిని ఎత్తిపోయకుండా పడావుపెట్టారని అన్నారు. మేడిగడ్డ ఆనకట్ట వద్ద శబ్దాలు వినిపించాయని ఏఈఈ రవికాంత్ ఫిర్యాదు చేశారని, అక్టోబర్ 2023, 21న సాయంత్రం 6.30 గంటలకు మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందని గుర్తు చేశారు. అసాంఘిక శక్తులు ఉన్నాయని ఏఈఈ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు- చెప్పారు. అయినప్పటికీ.. ఈ కేసు విచారణపై ఎలాంటి పురోగతి లేదన్నారు. పేలుళ్లు జరిగిన ప్రాంతాన్ని సీజ్ చేసి, కారణాలపై అన్వేషణ జరగాలి కదా?మొత్తం వ్యవహారంపై సీబీఐ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కుట్ర వెనుక కాంగ్రెస్, బీజేపీ ఉన్నాయని ఆర్ఎస్పీ ఆరోపించారు. తెంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం పట్ల సంచలన ఆధారాలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బయటపెట్టారు. 2023వ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన సాయంత్రం 6:20 గంటలకు, మేడిగడ్డ పిల్లర్ల వద్ద భారీ శబ్ధాలు వచ్చాయని మేడిగడ్డ అసిస్టెంట్ ఇంజనీర్ రవికాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు 2023 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీన మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఆ ఎఫ్ఐఆర్ పట్ల చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆర్ఎస్పీ నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారు. ప్రాజెక్టు పిల్లర్‌కు పగుళ్లు రావు.. క్రస్ట్ గేట్లకు వస్తే రావొచ్చేమో. ఇంటి నిర్మాణానికి సంబంధించిన పిల్లర్లకు కూడా పగుళ్లు రావు.. ఉష్ణోగ్రత తేడాతో గోడలకు పగుళ్లు వస్తాయి కానీ కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక్కటే 20వ నెంబర్ పిల్లర్‌కి క్రాక్ వచ్చిందంటే, కచ్చితంగా బ్లాస్ట్ జరిగిందనే అనుమానాలు ఉన్నాయని ఆర్ఎస్పీ అనుమానం వ్యక్తం చేశారు. అసలు ఏమాత్రం వరద లేని సమయంలో మేడిగడ్డ బ్యారేజీ ఎలా కుంగిపోయింది.. అది కూడా ఒక్క పిల్లరే ఎలా కుంగిపోతుంది. 2022లో రికార్డు స్థాయిలో వరదలు వచ్చినా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు తట్టు-కున్నాయి. మేడిగడ్డలో ఒక్క పిల్లర్ మాత్రమే ఎందుకు కుంగిపోయింది. కిషన్ రెడ్డి లేఖ రాయగానే ఎన్‌డీఎస్ఏ వచ్చింది. ఉత్తరాఖండ్‌లో మొత్తం డ్యామ్ కొట్టు-కునిపోతే ఎందుకు ఎన్డీఎస్ఏ అక్కడికు వెళ్ళలేదు. మేడిగడ్డ వద్ద పేలుళ్ల శబ్దాలపై ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడటంలేదు. మహదేవ్‌పూర్ పోలీసులు వెంటనే విచారణ చేసి ఉండాలి. అసాంఘిక శక్తులు రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇంకా ఎవరైనా అనేది తేల్చాలి. ఈ ముగ్గురి మొబైల్ ఫోన్స్ డేటా చెక్ చేస్తే వెంటనే దొరికేవాళ్ళు . భూపాలపల్లి పోలీసులు అప్పుడు వెంటనే పిల్లర్ల శాంపిల్స్, భూమి శాంపిల్, అక్కడ ఉండే మీటర్ రీడింగ్స్, సిస్మిక్ డేటా, కాల్ డీ-టె-యిల్స్ తీసుకొని ఉండాల్సింది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు. పిల్లర్లకు ఎక్కడా క్రాక్ రాదని ఇంజనీరింగ్ నిపుణులు చెప్తున్నారు. దీని వెనుక రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఉన్నారా లేదా అనేది సిట్ ఏర్పాటు- చేసి తేల్చాలి. అసలు అక్కడ చిన్నస్థాయిలో ఏమైనా భూకంపాలు వచ్చాయా లేదా అనేది తేల్చాలి. పేలుళ్ల కోణంలో ఎందుకు విచారణ జరగలేదు. పేలుళ్లపై ఇప్పటివరకు ఎవరి స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు.

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే



**నాగార్జునసాగర్, ఆగస్టు16 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. నిడమనూరు మండలంలోని జంగాలవారి గూడెంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనం, రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు గూడు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా చేయూత అదిస్తుందన్నారు. ఇల్లు మంజూరు కాని వారు ఆందోళన చెందవద్దని, అర్హులైన పేద వారందరికీ ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు యడవల్లి వల్లభ్ రెడ్డి, ముంగి శివమారయ్య, కొండా శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ విజయ్ కుమార్, రూపని కృష్ణయ్య, షేక్ జానీ పాషా, శిరీషాల యాదగిరి, డీలర్ సైదాచారి పాల్గొన్నారు

# సీఎం భద్రతా అధికారి ఎస్‌పి చెన్నుపాటి భద్రయ్యకు రాష్ట్రపతి ప్రతిష్ఠాత్మక పథకం



**అమరావతి, ఆగష్టు 16 (జనంసాక్షి) :** పోలీసు శాఖలో విశిష్టమైన సేవలు అందించి, భద్రతా విధుల్లో అద్భుత ప్రతిభ చాటిన ఎస్‌పి చెన్నుపాటి భద్రయ్యకు రాష్ట్రపతి ప్రతిష్టాత్మక పోలీస్ మెడల్ లభించింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా కేంద్ర హోంశాఖ శౌర్య సేవా పతకాలను ప్రధానం చేయగా, రాష్ట్రానికి చెందిన ఇద్దరు అధికారుల్లో భద్రయ్య ఒకరు. గత పదేళ్లలో ఎనిమిది సంవత్సరాలు వరుసగా అత్యున్నత సేవలకుగాను గుర్తింపు పొందిన ఆయన, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తిగత భద్రతా ముఖ్య అధికారి హోదాలో కొనసాగుతున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం బొమ్మనంపాడు గ్రామం లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన భద్రయ్య స్వయం కృషితో అంచలంచలుగా ఎదిగారు. ఈయన తల్లిదండ్రులు ఆదెయ్య, అలివేలమ్మలకు నలుగురు కుమారులు, కుమార్తె సంతానం కాగా భద్రయ్య అందరికంటే చిన్నవాడు. స్వయంకృషితో ఎదిగిన భద్రయ్య 1991లో పోలీసు శాఖలో చేరి, సున్నితమైన, సంక్లిష్టమైన విధులను సమర్థవంతంగా నిర్వహించారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో కీలక బాధ్యతలు, పుష్కరాలు, రాజధాని అమరావతి శంఖుస్థాపన, అంతర్జాతీయ సదస్సులు, బాంబు నిర్వీర్యం వంటి విభాగాల్లో ప్రతిభ చాటారు. అమెరికా, యుపి రాష్ట్రాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఆయన, ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో చాంపియన్‌గా నిలిచి, రెండు బంగారు పతకాలు గెలుచుకున్నారు. భద్రయ్య గౌరవానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సహచర అధికారులు అభినందనలు తెలియజేశారు.

# కవి తంగిరాల చక్రవర్తికి నివాళి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రగతిశీల, కమ్యూనిస్టు సాహిత్యాన్ని పుస్తక రూపంలో తేవడంలో శక్తి వంచన లేకుండా కృషి చేసిన ప్రముఖ కవి, రచయిత తంగిరాల చక్రవర్తి మరణం పట్ల తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్, తెలంగాణ పబ్లికేషన్స్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాలాపూర్లోని తంగిరాల చక్రవర్తి స్వగృహానికి వెళ్లి నివాళులు అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. తంగిరాల చక్రవర్తి శనివారం ఉదయం గుండె పోటుతో ఆకస్మాత్తుగా మరణించారు. తంగిరాల చక్రవర్తి కేవలం జర్నలిస్టుగానే కాకుండా వందలాది పుస్తకాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా తంగిరాల క్రిష్ణ ప్రసాద్ పేరు మీద సంస్థను స్థాపించి, నాటక రంగంలో నిష్ణాతులను గుర్తించి అవార్డులను బహుకరిస్తూ వచ్చారు. తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ కవులు, రచయితల పుస్తకాలను సమీక్షించారు. సాహిత్య, పుస్తక రంగానికి ఎనలేని సేవ చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ బాలాపూర్లోని తంగిరాల చక్రవర్తి స్వగృహానికి వెళ్లి నివాళులు అర్పించారు. జూలూరు గౌరీ శంకర్తో పాటు కోయ, చంద్రమోహన్, రచయితలు కూర చిదంబరం, మోహన్ కృష్ణ, ముజాహిద్ , నరేష్, సుధాకర్, వాగ్దేవి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి, కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

# కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద

**ప్రాజెక్టు 18 వరద గేట్ల ఎత్తివేత**

**1,86,975 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల**



**కడెం, ఆగస్ట్ 16 (జనం సాక్షి) :** విస్తరంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి కడెం ప్రాజెక్టులోకి భారీ వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో శనివారం రోజున అధికారులు మొదట 8 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. క్రమక్రమంగా వరద నీరు ఉద్రిక్తత పెరగడంతో 18 గేట్లకు 18 గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603) కాగా, ప్రస్తుత నీటిమట్టం 693.850 అడుగులు (4,677 టిఎంసిలు) ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 1,95,923 క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో అధికారులు ప్రాజెక్టు 18 గేట్లు ఎత్తి దిగువకు 1,86,975 క్యూసెక్కుల నీటిని వ దు లు తు న్న ట్లు అధికారులు పేర్కొన్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో సమీపంలోనీ లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.

# నక్సలైట్లు దేశభక్తులెలా అవుతారు

**కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** నక్సలైట్లే దేశ భక్తులని కొంత మంది అర్బన్ నక్సలైట్లు- చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. నక్సలైట్లు ఏ దేశానికి భక్తులు?.. నక్సలిజాన్ని అంత మొందించడమే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లక్ష్యం.. నక్సలిజం ఇప్పటి వరకి సాధించినది శూన్యం.. ఛత్తీస్‌గఢ్ లో పేదరిక నిర్మూలన జరిగిందా.. జాతీయ పతాకాన్ని ఎగుర వేసే పరిస్థితి లేదు.. నక్సలైట్లు- తుపాకీ గొట్టం ద్వారా సాధించినది ఏమిటి? అని ప్రశించారు. భద్రతా, అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యంతో నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది అని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. అయితే, భారతదేశంలో నక్సలిజం నిర్మూలించడంలో కేంద్ర ప్రభుత్వం సక్సెస్ అయ్యింది అని కేంద్ర హోంమంత్రి బండి సంజయ్ చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ నక్సల్స్ తో చర్చలు జరుపాలని కోరారు.. అపరేషన్ కాగార్ ఆపాలని కోరారు.. రేవంత్ రెడ్డికి నక్సలిజంపై ద్వంద విధానం ఉంది.. రాష్ట్రంలో నక్సలైట్స్ పై నిషేధం విధించారు.. కేంద్రం మాత్రం చర్చలు జరపాలని అంటారు అని ఎద్దేవా చేశారు.

# ఉద్యమకారులైతే వేల కోట్ల ఆస్తులు ఎలావచ్చాయి?

- అసల్కైన ఉద్యమకారులు తాము ఉద్యమకారులమని చెప్పుకోలే
- కొందరు గాలి ప్రణాళికలతో దేశాన్ని ఏలాలని చూశారు
- వ్యక్తిగత కక్షలకోసం రాజకీయాలు వాడుకునే స్థాయిలో లేను
- అందెశ్రీ హసిత భాష్పాలు పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్

రాజకీయాల్లో ఉంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ రచించిన హసిత భాష్పాలు పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం కవులకు, పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ అని అన్నారు. ఉద్యమంలో ప్రజలకు స్ఫూర్తిగా గూడ అంజన్న, దాశరథి, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరెటి వెంకన్న లాంటి కవులు నిలిచారని గుర్తు చేశారు. తనపై తనకు సంపూర్ణ నమ్మకం కలిగించి, కార్యోన్ముకిన్ని చేసి యుద్ధ రంగానికి సిద్ధం చేసిన వ్యక్తి శ్రీకృష్ణుడు అని అన్నారు. తాను కొంచెం ఓపెన్‌గా మాట్లాడు తానని, ఎక్కువ టైమ్ రాజకీయ కార్యక్రమాలకు ఇస్తానని, ఎందుకుంటే అక్కడ తాము మాట్లాడేదే ఫైనల్ ఉంటుందని అన్నారు. కానీ ఈ పుస్తకావిష్కరణలకు రావాలంటే పదంపదం ప్రిపేర్ అయ్యి రావాలని అన్నారు. కింది స్థాయి నుంచి ఈ స్థాయికి వచ్చానని, ఇంత గొప్ప అవకాశాన్ని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఇచ్చారని అన్నారు. ఇలాంటి గొప్ప అవకాశాన్ని, తనకు వాళ్ల విరీద ప్రయోగిస్తే తనకంటే మూరు?డు మరోకరు ఉండరని అన్నారు. తాను కర్మసిద్ధాంతాన్ని నమ్ముతానని, వాళ్ల పాపాన వాళ్లేపోతారని భావిస్తానన్నారు. తన గెలుపుతో గిట్టని వాళ్లకు దుఃఖం వచ్చిందని, తాను సంతకం పెడుతుంటే వాళ్లకు గుండెల్లో రాసినట్టు అయ్యిందని అన్నారు. అందాల పోటీల్లప్పుడు 109 దేశాల సుందరీమణులతో జయ జయహే తెలంగాణ పాటను పాడిరచామని, వాళ్లను తెలంగాణ తల్లి ముందు మొకరించామని అన్నారు. కట్టడాలు ఎవరైనా కట్టొచ్చని, అందమైన భవనాలు అభివృద్ధి కాదని, పేదలకు సొంత ఇళ్లు ఇచ్చి ఆత్మగౌరవం నిలబెడుతున్నామని అన్నారు. ఒకనాడు సీఎంను చూడాలంటే గొప్ప సన్నివేశం. కానీ ఇప్పుడు ఎప్పుడ్కెనా, ఎవరైనా కలవచ్చని అన్నారు. తాను జడ్పీటీసీ కాగానే కౌన్సిల్ వచ్చిందని, తర్వాత ఎమ్మెల్సీ అయ్యానని, తెలంగాణకి రెండో సీఎం అయ్యానని అన్నారు. 2040 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉంటానని సీఎం అన్నారు. తనకు రాజకీయాల్లో శత్రువులెవరూ లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తాను శత్రువుగా చూడాలన్నా ఆ వ్యక్తికి అంతటి స్థాయి ఉండాలని చెప్పారు. వ్యక్తిగత పగకోసం తన పదవిని అడ్డం పెట్టుకుంటే తనకన్నా మూరు?డు ఇంకొకరు ఉండరని చెప్పారు. శత్రువులకు తన గెలుపే అసల్కైన శిక్ష అని అన్నారు. తాను కర్మ సిద్దాంతాన్ని నమ్ముతానన్న సీఎం రేవంత్.. ఎవడి పాపాలకు వాడే బల్కైపోతారని చెప్పారు. .తనకు అన్ని చట్ట సభల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. అద్దాల మేడలు అభివృద్ధి కాదని.. సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరినప్పుడే అసల్కైన విజయం అని అన్నారు. నిజమైన ఉద్యమకారులెవరూ ఉద్యమకారుడినని చెప్పుకోరని..సర్వం కోల్పోయినా లక్ష్యం వైపు వెళ్తారని చెప్పారు రేవంత్. ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకు అన్ని వేల కోట్లు- ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణతో పేగు బంధం,పేరు బంధం అన్ని తెంచుకున్నారని విమర్శించారు. దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో అన్నీ కోల్పోయారని అన్నారు.

# కేసు పేరుతో మహిళకు వేధింపులు

**ఎస్ఐ రాజశేఖర్‌ను సస్పెండ్ చేసిన ఎస్పీ**

**ధర్మవరం, ఆగష్టు 16 (జనంసాక్షి) :** ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన బాధ్యతాయుత పదవిలో ఉన్నాడు. అలాంటి వ్యక్తి బుద్ధి గడ్డి తింది. ఓ మహిళను లైంగిక వేధింపులకు గురి చేయడంతో ఉన్న పోలీస్ ఉద్యోగం కాస్తా ఊడింది. ఈ ఘటన శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా అడవి బ్రాహ్మణ పల్లి తండాకు చెందిన గిరిజన మహిళ వ్యక్తిగత కారణాలతో భర్తతో విడాకులు తీసుకుంది. విడాకుల సందర్భంగా తనకు తగిన న్యాయం జరగలేదని పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. ఈ క్రమంలో కానీపట్నం ఎస్ఐ రాజశేఖర్‌కు తన గోడు వెల్లబోసుకుంది. ఐతే అతను సానుకూలంగా స్పందించకపోగా.. ఆమెపై కన్నేశాడు. ఈ క్రమంలోనే ఫోన్ నంబర్ తీసుకున్నాడు. కేసు వంకతో ఆమెకు నిత్యం ఫోన్ చేసేవాడు రాజశేఖర్. అందులో అసభ్యంగా మాట్లాడేవాడు. లైంగికంగా లొంగదీసుకునేందుకు ప్రయత్నించాడు. ఏకంగా పలుమార్లు వీడియో కాల్ కూడా చేశాడు. ప్రయివేట్ పార్ట్స్ చూపిస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో అసలే వ్యక్తిగత సమస్యలతో ఇబ్బంది పడుతున్న మహిళకు మరింత నరకం కనిపించింది. దీంతో పోలీస్ ఉన్నతాధికారులకు విషయం తెలిపింది. ఎస్సై రాజశేఖర్ అసభ్య వీడియో కాల్ రికార్డ్స్ కూడా వారి ముందు ఉంచింది. ఈ విషయంపై స్పందించిన జిల్లా ఎస్పీ వీ.రత్న ఎస్ఐ రాజశేఖర్‌ను వెంటనే వీఆర్‌కు తరలిస్తూ ఆదేశాలు జారీ చేశారు. శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో ఎస్ఐ రాజశేఖర్ అసభ్య వ్యవహారం నిజమని నిగ్గుతేలింది. ఫలితంగా ఆయన ఉద్యోగం ఊడింది. అంతే కాదు భార్యతో గొడవ పడి.. కానీపట్నంలోనే ఓ అద్దెభవనంలో బస చేస్తూ ఈవ్ టీజరయ్యాడని ప్రచారం జరుగుతోంది. ఎస్పీ రత్న.. సకాలంలో స్పందించి ఓ మహిళకు జరిగిన అన్యాయంపై పోలీసులను కూడా వదిలిపెట్టనందుకు శ్రీసత్యసాయి జిల్లా ప్రజలు ప్రశంసిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
17 ఆగస్టు 2025

# సినిమాల్లో సాహిత్యంలో జానర్లు

ఇటీవల సినిమాల వైవిధ్యం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు చర్చకు వచ్చాయి. వైవిధ్యాన్ని వర్గీకరించి జానర్ లు అనే పేరుతో పిలుస్తున్నారు. ఉదాహరణకు హాస్య రస ప్రధాన చిత్రం, కుటుంబ కథా చిత్రం, జానపదం పౌరాణికం, చారిత్రికం, మంత్ర తంత్రాల చిత్రం, బాలల చిత్రం, మహిళల చిత్రం, క్రయిం, హారర్ చిత్రం, డెటెక్టివ్ చిత్రం, హీరో ఓరియంటెడ్ చిత్రం, హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రం, , ఇది డైరెక్టర్ చిత్రం, ఇది కళాత్మక క్లాసిక్ చిత్రం, కమర్షియల్ చిత్రం, బయోగ్రఫీ చిత్రం.. ఇలా పేర్లతో వర్గీకరిస్తు ంటారు. ఆ వర్గీకరించిన పేర్లను జానర్ అంటారు. సినిమాల్లో ఎలాంటి జానర్లుంటాయో వారాల ఆనంద్ కొన్ని చక్కని వ్యాసాలు రాసారు.




**జానర్ వర్గీకరణ ప్రయోజనం**

ఇలా వర్గీకరణ వల్ల ప్రేక్షకులకు ఒక స్పష్టత ఏర్పడుతుంది. ఎలాంటి సినిమాలు చూడాలో ప్రజలు నిర్ణయించుకుంటారు. కొందరు హీరో హీరోయిన్లను బట్టి, దర్శకులను బట్టి, సినిమా పోస్టర్లనుబట్టి .. ఏ సినిమా అయినా చూస్తారు. అది వారి పట్ల అభిమానం, అభిరుచి. ఏ జానర్ లో తీస్తే ఆ జానర్ హంగులు పద్దతులు, రీతులు, ప్రెజెంటేషన్ ఉండాలి. ఏ ఆట ఆడితే ఆ రూల్సు పాటించినట్టు ఉండాలి. సాహిత్యానికి కూడ ఇది వర్తిస్తుంది. సెంటర్ పాయింటు ఒకటి ఉండాలి. సినిమాల్లో దీన్ని కథను సింగిల్ లైన్ చెప్పు అంటారు. సాహిత్యం చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు ప్రచురిస్తాయి. వంద కాపీలు అచ్చు వేసినా పుస్తకంగా దాని పేరు దానికి వస్తుంది. సినిమా అట్ల కాదు. వేలు లక్షలు కోట్ల మంది చూసే సబ్జక్టునే తీసుకోవాల్సి వుంటుంది. అందువల్ల సాహిత్యంలో వచ్చే ట్రెండ్స్ అన్ని సినిమాల్లో రావు. సాహిత్యంలో వున్నవే సినిమాల్లోకి వస్తాయి. అలాగే సినిమాల్లో వున్నవే సాహిత్యంలోకి వస్తాయి. సినిమాల్లోకి రాని సాహిత్యం చాలా వుంటుంది. ఆ సాహిత్యంలో సినిమాకు కావలసిన హంగులు బాగా తక్కువ వుండడం కావచ్చు. సినిమాగా దాన్ని ప్రేక్షకులు తక్కువ చూస్తారు, డబ్బులు రావు అని కావచ్చు. కొన్ని సినిమాలు బాగా నడిచినా సాహిత్యంలో అలాంటివి,పత్రికల్లో ప్రచురణకు తీసుకోక పోవచ్చు. ఉద్యమ సాహిత్యాన్ని అలా నిరాకరించారు.

**పాఠకులు వేరు ప్రేక్షకులు వేరు**

పాఠకులు వేరు. ప్రేక్షకులు వేరు. ప్రేక్షకులు రకరకాల సినిమాలు చూడవచ్చు. కాని పాఠకులు ఫలానా రచనలే చదువుతామని నిర్ణయించుకోవచ్చు. అలాంటి కొద్ది మంది ఎంతో మెచ్చిన కథలు సినిమాలు తీస్తే పైసలు గంగలో పోసినట్టు కావచ్చు. సాహిత్యంలోని జానర్లు సినిమాల్లోకి తీసుకోలేదు. 1990 నుండి సాహిత్యంలో అనేక జానర్లు పాపులర్ అయ్యాయి. వాటిలో చాలా జానర్‌లు సినిమాలలోకి తీసుకోలేదు. కొన్నిటిని ప్రేక్షకులు ఆదరించరు, స్వీకరించరు అనే భయం కావచ్చు. కొన్నిటికి దర్శకుడు, నిర్మాత, డిస్ట్రి బ్యూటర్, హీరో హీరోయిన్లు నో చెప్పడం కావచ్చు. అట్లా చాలా రకాల సినిమాలు తెలుగులో రాలేదు. తమిళంలో వచ్చాయి . కన్నడంలో, మళయాళంలో, మరాఠీలో, హిందీలో, ఇంగ్లీషులో, బెంగాలీలో వచ్చాయి. బాగా నడిచాయి. అయినా అలాంటివి తెలుగులో రాలేదు.

**తెలంగాణ సంస్కృతి జీవితం సినిమాల్లో ఏది?**

తెలంగాణ జీవితం సంస్కృతితో సినిమాలు ఎక్కువ రాలేదు. తీసిన వాటి ఆదరణ బాగానే వున్నప్పటికీ రావడం లేదు. అనగా తీయడం లేదు. చిన్న సినిమాలు ఒక పది పదిహేను రోజులు ఆడినా పెట్టిన పైసలతో పాటు లాభంకూడా వచ్చేస్తుంది. గిరీష్ కాసర వెల్లి , కారంత్ అలా చిన్న బడ్జట్‌తో తీసి అంతర్జాతీయ జాతీయ అవార్డులు ఎన్నో కొట్టేసారు. మాభూమి నర్సింగ రావు తీసిన వాటికి డబ్బులు వచ్చినా రాకున్నా ఆ జానర్లలో అంతర్జాతీయంగా క్లాసిక్కు గా నిలిచి పోయాయి.

**సంపాదకుల ఇష్టాయిష్టాలు**

ఇక సాహిత్యం విషయానికి వస్తే ఆర్ నారాయణ మూర్తి విప్లవ సినిమాలు ఎంత బాగా నడిచినా పత్రికల్లో అలాంటి రచనలు వేయలేదు. అనగా అది సంపాదకులకు ఇష్టం లేదని అర్థం. మహిళా వాద జానర్ 1980 నుండి వేగం పుంజుకున్న కొత్త తరహా మహిళా ఓరియంటెడ్ కథలు నవలలు చాలా వచ్చాయి. ఓల్గా తన కథనే తాను తోడు కథను తెరకెక్కించారు తప్ప పెద్దగా రాలేదు. మహిళా వాద సాహిత్యం చాలానే వచ్చింది. సగం జనాభా మహిళలే. మహిళల ఓట్లతో సినిమాలే కాదు రాజకీయాలు కూడా దశ మారుతున్నాయి. అయినా మహిళా దృష్టి ఓరియంటెడ్ సినిమాలు తీయడం లేదు. కథలు నవలలు పెద్దగా రాలేదు. వచ్చినా అవి సినిమాగా మార లేదు. సినిమాకు కథలు రాసే వాల్లు వేరే ఉంటారు. అనేక భాషల సినిమాలు చూస్తారు. వాల్లు ట్రెండ్ ను పట్టుకుంటారు. దర్శకుడు వగైరా కలిసి చర్చిస్తారు. అలా యూరప్, ఆస్ట్రేలియా, అమెరికాలో ఉద్యోగాలు ప్రేమలు , అక్కడికి ఇక్కడికి మారే కుటుంబ సంబంధా లు ఓరియంటెడ్ సినిమాలు చాలా వచ్చాయి నడిచాయి. కథలు నవలు రాసే రచయితలకు ఆ జీవితాలు, ఆ విమాన ప్రయాణాలు తెలియకపోవడం వల్ల రాయడం తక్కువ. కొందరి రచనల్లో రైలు ప్రయాణం కూడా వుండదు. అలాంటి కథలతో సినిమాలు తీ ప్రేక్ష కులను రప్పించలేరు మెప్పించలేరు. హెలికాప్టర్లు, విమానాలు, పారి శామివేత్తలు కోటీశ్వరులు కోటీశ్వరులు, రైల్లు లేకపోయినా కనీసం కారు, బస్సు, కాలేజీ చదువులు లేని కథలతో ఈ కాలంలో వచ్చే కథలతో సినిమాలు తీస్తే చూడరు అని దర్శకుల నిర్మాతల భయం.

**సాహిత్యం ఎంత వచ్చినా సినిమాలకు తీసుకోని జీవితాలు**

1990 నుండి దళిత సాహిత్యం, బీసీ సాహిత్యం, ముస్లిం సాహిత్యం ఎతో వచ్చింది. సినిమాల్లో ఈ జానర్ సినిమాలు చావలా తక్కువ. వచ్చిన సినిమాలను కూడ ఆదరించ లేదు. నాగ చైతన్య, సాయి పల్లవితో తెలంగాణ టచ్ తో శేఖర్ కమ్ముల సనిమాలో నాగచైతన్య దళితుడొ చివరి సన్ని వేశాల్లో సూచిస్తాడు. తాను ఇష్ట పడ్డ పిల్లను అడుగుదాం పద అమ్మా అని పోతే వాకిట్లో ఆపి పాత బట్టలు ఇచ్చి కట్టుకోమని చెప్పే దృశ్యంతో చెప్పాడు దర్శకుడు. ఆ సినిమా అంత జాగ్రత్తగా డీల్ చేయగలిగితే...

ఆ సినిమా లో చెప్పినంత జాగ్రత్తగా డీల్ చేయగలిగితే దళిత బహుజన కథలు, మహిళా వాద కథలు చిన్న సినిమాలుగానైనా తీయవచ్చు. అలాంటి సినిమాలకు 50 లక్షలు రాంటు ఇచ్చి ఏటా ఓ 50 సినిమాలకు ప్రభుత్వం సకరిస్తే కొత్త తరంతో కొత్తరకం సినిమాలు వస్తాయి. ఇటీవల బలగం సినిమా విరగబడి చూసారు. నిజానికది విషాదాంత సినిమా! అయినా ప్రజలు ఆదరించారు.

**సాహిత్యంలో ఎన్ని జానర్లు వచ్చాయి?**


ఇటీవలి సాహిత్యంలో సినిమాల వలె ఎన్ని రకాల జానర్లు వస్తున్నాయో చూడాలి. దీని అవసరం చాలా వుంది. నాపేరు రాయ లేదు. నా రచన పేర్కొన లేదు. నేను కంటికి ఆనలేదా? అని కొంద రు కొట్టుక చస్తున్నారు. అన్ని జానర్‌లు విమర్శకులు చదవరు. చదవలేరు. వారికీ అభిరుచి వుంటుంది. రాసేవారు ఏదో జానర్ కే పరిమితమైనపుడు ఇతర రచనలు దాని వెలుపలివవుతాయి. తాను రాసింది ఏ జానరో రచయితకు స్పష్టత అవసరం. ఎందు కంటే ప్రతి జానర్కు తన దైన వస్తువు, శైలీ శిల్పం, వస్తువు, పరిణామం, కథ నడక వుంటుంది. ఆ అంతర్గత నియమాలు తెలుసుకోవాలి. అందులో ముందుకు సాగాలి. ఉదాహరణకు డిటెక్టివ్ జానర్ లో కొమ్మూరి సాంబశివరావు ఏ గ్రేడ్, స్పై జానర్ లోమధుబాబు ఏ గ్రేడ్, సాంఘికం, అగ్రకుల జానర్‌లో కోడూరి కౌసల్యాదేవి, యద్దనపూడి తదిరులు పాపులర్. ఎవరి జానర్ వారిది. ఒక జానర్ లో రాసి మరో జానర్ లో రాసే వారిని విమర్శించడం దేనికి? కబడ్డీ ఆటగాడు క్రికెట్ ను విమర్శించినట్టుంది. విమర్శించాలంటే ఆ జానర్ రాసి మెప్పించాలి. మెప్పించాక విమర్శే అవసరం లేదు. సాహిత్యంలో జానర్ల వర్గీకరణ ఎంతో మేలు చేస్తుంది.

సినిమాలు పాత్రల ఓరియంటెడ్‌గాంటాయి. సాహిత్యం మరికొన్ని రకాలుగా వుంటుంది. ముందుగా రచయితలు ఏఏ జానర్లలో రాస్తున్నారో వారికి అర్థం కావాలి. అపుడు ఏ జానర్‌లో రాయలేదో చూసుకొని ఆ జానర్‌లో రాసే వస్తువు ఎన్నుకొనిఎదుగుతారు. కథలకు నవలలకు కూడా ఈ జానర్ల పేర్ల ప్రకారం వడ్డించి వర్గీకరిస్తే చాలా స్పష్ట కలుగుతుంది. మనం ఎన్ని జానర్లు పట్టుకున్నామో ఎనిని కొత్తవి / పాతవి సృష్టించాలో తెలుస్తుంది. ఉదాకుః ఓల్డు మ్యాన్ అండ్ సీ యులిసిస్. అలాంటిదే డాక్టర్ కేశవ రెడ్డి నవల అతడు అడవిని జయించాడు. అలం శేషగిరి రావు వేట కథలు, వాన కథలు పేరిట ఖదీర్ బాబు సంకలంనకూడ తెచ్చాడు. యుద్ధం కథలు వంటి ఏడెట నిమిది జానర్లతో కె వి నరేందర్ కథల పుస్తకాలు తెచ్చాడు. విప్లవ జానర్ తో అల్లం రాజయ్య సృష్టి కర్తలు, భూమి, సంపుటాలు), పి చంద్ బిఎస్ రాములు, కార్మిక జానర్‌తో పులుగు శ్రీనివాస్ ( కార్మిక కథలు) పి చంద్, కుటుంబ రావు గాంధీ, ఎదుగు మరింత ఎదుగు జానర్ తో యండమూరి, ప్రభాకర్ జైని, గల్ఫ్ పల్లెటూరు జానర్‌తో పెద్దింటి అశోక్ కుమార్, మహిళా సమస్యల జానర్‌తో రంగనాయకమ్మ, ఓల్గా, అనిశెట్టి రజిత, జ్వలిత, బండారు విజయ, దళిత జానర్ తో కళ్యాణ్ రావు అంటరాని వసంతం, దళిత మహిళ జానర్‌తో జాజుల గౌరి,( మన్ను బుల్వ, వొయినం, జూపాక సుభద్ర, గోగు శ్యామల, ప్రేమలు సంసారం జానర్ తో కోడూరి, యద్దనపూడి డిటెక్టివ్ జానర్‌తో కొమ్మూరి, విశ్వ ప్రసాద్, విజయ బాపినీడు, కృషణ మోహన్, టెంపోరావు, భయంకర్, స్పై జానర్ తో మధు, బీపౌరాణిక జానపద జానర్ తో లల్లాదేవి, సౌదా, బెజ్జారపు రవిందర్, భయంకర్ కొవ్వలి, ఉద్యమాల జానర్ తో దాశరథి రంగాచార్య, మహీధర రామ్మోహన్ రావు, లక్ష్మి కాంత మోహన్, వట్టికోట ఆళ్వారు స్వామి,( ప్రజల మనిషి, గంగు)... బయోగ్రఫీ ఆటో బయోగ్రఫీ జానర్ లో తిరుమల రామ చంద్ర, (హంపి నుండి హరప్పా దాక) సత్యం శంకర మంచి ( అమరావతి కథలు) బీసీ జానర్ తో బి ఎసి రాములు( మనతలు, కాలం తెచ్చిన మార్పు, గెలుచుకున్న జీవితం). జ్వలిత తెచ్చిన మల్లెసాల కథల సంకలనం, ముస్లిం జానర్ లో స్కై బాబా, ఖదీర్ బాబు, షాజహానా, నస్రీన్ ఖాన్, సమీక్షతో కలిగే మేలుఅలాగే ప్రాంతాల వారీగా జానర్లు వర్గీకరించాలి. అపుడే ఎన్ని గడులు ఖాలీలున్నాయో ఏమేమ్ రాయాలో తెలిసి వస్తుంది. ఎన్నో పాటలు వచ్చి దేశమంతా ఊపి సిన జన నాట్యమండలిలో 1986లో సమీక్షకు కూర్చుంటే 26 జానర్లకు 6 జానర్ల పాటలే వచ్చని తేలింది. ఆ తరు వాత వస్తు వైవిధ్యం పై దృష్టి పెరిగింది. మన తెలుగు కథ నవల సాహిత్యం కూడాకూలంకషంగా జానర్ వారీగా వర్గీకరించాలి. అపుడే తాము ఏమి రాయలేదో తెలిసి మిగతావాటిలో తమకు విషయ పరిజ్ఞానం ఉన్న జానర్లలో రాసి చరిత్ర సృష్టిస్తారు.



- యుగకర్త
సామాజిక తత్వవేత్త
**బి ఎస్ రాములు**
తెలంగాణ రాష్ట్ర తొలి
బీసీ కమిషన్ చైర్మన్

## స్వాతంత్ర్య దేశంలో ఎందరో...
# అస్వతంత్ర ప్రజలు



భారతదేశం స్వాతంత్రం సాధించి 79 సంవత్సరాలు గడుస్తున్నా, స్వాతంత్ర ఫలాలు దేశంలోని ప్రతి పౌరుడికి సమానంగా అందకపోవడం వల్ల స్వాతంత్ర దేశానికి అర్థం లేకుండా పోయింది. నాటి స్వాతంత్ర పోరాటంలో ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేసి, భారతీయులు స్వదేశంలో స్వపరిపాలనలో స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, ప్రజాస్వామ్య గణతంత్ర విలువలతో జీవించాలని బ్రిటిష్ పాలకులతో అలుపెరగని పోరాటం చేసి స్వాతంత్రం సాధించారు. అయినప్పటికీ, నేడు భారతదేశం స్వాతంత్రం, గణతంత్రం సాధించినప్పటికీ, అనుకున్న విధంగా సంపూర్ణ ప్రగతిని సాధించలేకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది బ్రిటిష్ పాలకుల నుండి విముక్తి పొందినప్పటికీ, కుల, మతాలకతీతంగా పాలన వ్యవస్థలో సామాజిక న్యాయం లేకపోవడం. ఈ కారణంగానే స్వాతంత్ర, గణతంత్ర ఫలాలు అన్ని సామాజిక వర్గాలకు సమానంగా దక్కలేదని గణాంకాలు నిరూపిస్తున్నాయి. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్ లాంటి మహానీయులు బ్రిటిష్ పాలకులు వీడినంత మాత్రాన విప్లవాత్మక మార్పులు రావని ముందుగానే హెచ్చరించారు. రాజ్యాధికారంలో కుల, మతాలకతీతంగా అన్ని సామాజిక వర్గాలకు సమానత్వం ఉన్నప్పుడే సామాజిక న్యాయం అమలవుతుందని వారు జోస్యం చెప్పారు. కానీ, బ్రిటిష్ పాలకులను తరిమేసిన తర్వాత, దేశంలో 10% అగ్రవర్ణాలు కేంద్ర, రాష్ట్ర, కార్య, శాసన, న్యాయ నిర్వహణ వ్యవస్థలో అత్యధిక సింహభాగం ఆక్రమించడం వల్ల సామాజిక న్యాయం లోపించి, దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడినట్లు నిరూపణ అవుతోంది. గణాంకాల ప్రకారం, దేశంలో 90% సంపద అగ్రవర్ణాల చేతిలో, 10% సంపద మాత్రమే అణగారిన వర్గాల చేతిలో ఉంది. అలాంటప్పుడు, భారత ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా, రష్యాలను అధిగమించేలా ఎలా నిర్మాణమవుతుంది? గణతంత్రం అంటే దేశ పరిపాలన, సంపద, వ్యాపారం వంటి అన్ని రంగాల్లో సమాన వాటా పంచుకొని, ప్రతి పౌరుడు దేశ సహజ వనరులను అనుభవిస్తూ, అభివృద్ధికి పాటుపడటం. కానీ, మన దేశంలో కేంద్ర, రాష్ట్ర అధికారాలు, సంపద, భూమి, అన్ని రంగాలు అగ్రవర్ణాల ఆధీనంలో బందీ అయ్యాయి. దీనివల్ల 90% అణగారిన వర్గాలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వెనుకబడ్డాయి. ఈ సామాజిక వైరుధ్యాలు లేకుండా ఉండాలనే భారత రాజ్యాంగ పీఠికలో సర్వసత్తాక, సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా భారతదేశాన్ని నిర్మించుకోవాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో, ఆస్తి, అంతస్తులలో ప్రతి పౌరుడికి సమన్యాయం ఉండేలా దేశ ఔన్నత్యాన్ని పెంపొందించాలని రాజ్యాంగం రూపొందించబడింది. అయితే, రాజ్యాంగ మౌలిక సూత్రాలను సంపూర్ణంగా అమలు చేయకుండా, వాటికి వ్యతిరేకంగా పాలన సాగడం వల్ల రాజ్యాంగ పీఠికలోని అంశాలు కాగితంపై మాత్రమే ఉన్నాయి, భౌతికంగా అమలు కావడం లేదు. దీనివల్ల దేశంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమన్యాయం లోపించి, భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగానే పిలువబడుతూ, మానవ అభివృద్ధి సూచిలో వెనుకబాటుకు గురవుతోంది. సహజ వనరులు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ, చిన్న దేశాలపై ఆధారపడి దిగుమతులు చేసుకోవడం దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారడానికి, అగ్రవర్ణ పాలకుల అసమర్థ, స్వార్థపూరిత పాలనకు నిదర్శనం. 79 సంవత్సరాల స్వాతంత్ర, గణతంత్ర రాజ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి మౌలిక సదుపాయాలైన గుణాత్మక ఉచిత విద్య, అత్యాధునిక వైద్యం, ఉపాధి అవకాశాలు, సరైన గృహాలు, వ్యవసాయ భూమి వంటివి అణగారిన వర్గాలకు అందడం లేదు. ఈ లోపాల వల్ల అగ్రవర్ణాలకు స్వాతంత్ర ఫలాలు పూర్తిగా దక్కగా, అణగారిన వర్గాలు వెనుకబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడవ లేదా నాల్గవ స్థానంలో ఉంటుందని చెబుతున్నప్పటికీ, అణగారిన వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక విప్లవాత్మక మార్పులు, మౌలిక సౌకర్యాలు కల్పించకుండా ఈ వాదనలు నిరూపణ కాకపోతే, ప్రజలను మభ్యపెట్టడమేనని గణాంకాలు చెబుతున్నాయి. అణగారిన వర్గాలు రాజ్యాంగ పుణ్యంతో కొంత మెరుగైన జీవితం గడుపుతున్నాయి, కానీ అగ్రవర్ణ పాలకుల నుండి ఎలాంటి సమానత్వం లభించలేదు. స్వాతంత్ర భారతంలో అణగారిన వర్గాలు కార్మికులు, కూలీలుగా వెట్టిచాకిరీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాలకు సమాన వాటా, సంపద, భూమి, శాసన, కార్య, న్యాయ వ్యవస్థలో సమాన పాలు ఉంటే, భారతదేశం ప్రపంచ దేశాలకు నాయకంగా నిలిచేది. ఇప్పటికైనా అగ్రవర్ణ పాలకులు, వ్యాపారులు పరివర్తన చెంది, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమన్యాయం కోసం అన్ని వర్గాలకు సమాన వాటా కల్పించాలి. లేకపోతే, అగ్రవర్ణాల భూస్వామ్య, పెట్టుబడిదారీ అసమానత్వ పాలనకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం మరో స్వాతంత్ర సంగ్రామం రావచ్చు. కుల, మత భేదాలు లేకుండా ప్రతి పౌరుడికి స్వాతంత్ర, గణతంత్ర ఫలాలు అందించడం పాలకుల తక్షణ కర్తవ్యం. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయడానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కూడా నిరంతరం ప్రచారం చేయాలి. ఇది మేధావులు, విద్యావంతులు, సామాన్యులు గ్రహించాల్సిన చారిత్రక సత్యం.



పుల్లెంల గణేష్
(ధర్మ సమాజ్ పార్టీ, స్టడీ, రీసెర్చ్ టీం రాష్ట్ర ఇంచార్జ్)

## ప్రశాంతత

సముద్రపు అలలు మెల్లగా తాకేలా,
గాలి చెదిరే ఆకుల జాడల్లో
ఒక సరళమైన ఊపిరి.
ప్రతి ఉదయం సూర్యుడు
ప్రసరించిన కాంతితో
చేతులలోనూ, మనసులోనూ
మెల్లగా విస్తరించిన వెలుగు.
నిర్జన అడవుల్లో, పర్వతాల
శిఖరాల్లో
శబ్దరహిత ఆత్మసంతోషం
ఎటు చూసినా, ఎటు వెళ్ళినా
అంతటా సౌందర్యం, ప్రశాంతత.
మళ్లీ ఎవరితోను, ఏ
ఆందోళనతోనూ
వారసత్వాన్ని పంచుకోకుండానే
కేవలం నా మనసులో
ఒక శాంతి సుగంధం.
ప్రశాంతత
ప్రతి మనసుకీ కావలసిందే,
ప్రతి ఊపిరిలో, ప్రతి దారిలో
నిత్యమూ మెరిసే ఓ మెరుపే!

-బాలాజీ పోతుల
8179283830

## అవకాశవాది

పరాయి వాడి మోచేతి నీళ్లు
తాగడానికి మోకరిల్లిన వాడు
పక్కవాడిని ప్రేమించాలనే
ఇంగీత జ్ఞానం మరిచిపోతాడు
ఎవడో విసిరిన కుక్క బిస్కెట్లు తిని
సొంత మనుషుల్ని కరుస్తాడు.

జోకుడుగాడు ఎప్పుడు ఎవరిని
జోకుతాడో తెలియదు.
అవసరాలు తీర్చుకోవడం
వీడికి అన్నిటికంటే ముఖ్యం
వీడు కులం,మతం రంగు
పూసుకొని రంగస్థలం పైకి వస్తాడు.
విధూషకుడై వింత ప్రవర్తన చూపిస్తాడు.

ఎదుటివాడి దగ్గర మెరిసే ధనం
ఆకర్షించి 'కం టు మీ' అన్న వీడే
రేపు వీన్ని తన్ని తరిమి దూరం పెడితే
'గో బ్యాక్' అనేది కూడా వీడే
వీడికి అనుభవం అయితే కానీ
ఎదుటివాడి గాయం కనబడదు.

మొన్న అధికారం కోసం
కన్నవాళ్లను చంపిన
సింహాసనం కోసం
అన్నదమ్ములను చంపిన
సొంత కుటుంబ సభ్యులను
కిరాతకంగా హింసించిన
శత్రువు పక్కన చేరి
సహాయం అందించింది వీడే.
వీడికి రాజ్యం ముఖ్యం కాదు
సొంత రక్షణ ముఖ్యం.

నిన్న పరాయి పాలనలో
పట్టనట్టుగా ఉండి
కంటిలో నలుసై
ఇంటిలోనే పోరు చేసి
ఇల్లు చక్కబెట్టుకున్న
ఇగురవంతుడు వీడు.
వీడెప్పుడూ ఇంటివాడో
ఎప్పుడు పరాయి వాడో
తెలువకుండా తెలివిగా ప్రవర్తిస్తాడు
వీడికి స్వప్రయోజనాలే ముఖ్యం.

వీడు ఎవ్వడు మాట్లాడని భాషకు
గొప్పతనం కూర్చి నేర్చుకోమంటాడు
వీడు ఎవ్వరికి తెలవని సంస్కృతిని
పురాతన సంస్కృతంటూ బుర్రలోకి ఎక్కిస్తాడు
ఎవ్వనికీ తెలవని సాంప్రదాయాలను
మనపై బలవంతంగా రుద్ది
ఆచరించ మని ఆత్రుత పెడతాడు.
ఇంతకీ వీడెవడో తెలుసా?
సమయస్ఫూర్తితో తన జీవితాన్ని
చక్కబెట్టుకునే అవకాశవాది .

నెరువట్ల చైతన్య
9491470746, కరీంనగర్

# వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా చేపల ఉత్పత్తి!

ప్రకృతి వనరులు, మానవ వనరులతో పాటు జీవజంతుజాలం, అడవులు వంటివి ఏ దేశంలో ఎక్కువగా ఉంటాయో, ఆ దేశ పాలకుల పరిణతి, సమయస్ఫూర్తి, వనరుల సద్వినియోగం పైన ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఒక వనరును మరొక రూపంలోకి మార్చడం, ఉపాధి కల్పన చేయడం, సంపాదన అవకాశాలు సృష్టించడం ద్వారా సంపదను ప్రజలకు సమానంగా పంచే అవకాశం ఏర్పడుతుంది. దీని ఫలితంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతోపాటు కుటుంబాల ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయి. కొనుగోలు శక్తి పెరిగినప్పుడు జీవన ప్రమాణాలు ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. లోహాలు, ఖనిజ లవణాలు, అడవులు వంటి ప్రాకృతిక వనరులతోపాటు జీవజంతుజాలంలో ముఖ్యంగా చేపలు ఒక దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఎగుమతి ద్వారా ఆదాయం సమకూర్చడమే కాకుండా, ఆహార అవసరాలను తీర్చడంలో కూడా ఇవి గణనీయమైన భూమిక వహిస్తాయి. ప్రకృతిలో చేపలు అందుబాటులో ఉండడం ఒకటి, వాటిని సద్వినియోగించుకోవడం మరొకటి. చేపలను ఆహారంగా ఎక్కువగా వినియోగించే దేశాల్లో ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే చేపల్లో పోషక విలువలు సమృద్ధిగా ఉంటాయి, ఇవి అనారోగ్య కారకాలను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఒమేగా-3 ఫ్యాటీ ఆసిడ్స్ వంటి పోషకాంశాలు పిల్లల్లో మేధస్సు, చదువులో రాణించే సామర్థ్యాన్ని పెంచుతాయి. ఇటీవలి కాలంలో మాంసాహార ఎంపికల్లో చేపలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హమైన మార్పు. చికెన్, మాంసం దుకాణాల కంటే చేపల మార్కెట్లలో వినియోగదారుల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఆరోగ్యం, రుచి, పోషక విలువలను దృష్టిలో ఉంచుకుని ఆహార ఎంపికలు చేస్తున్నారు ప్రజలు, ఇది అనారోగ్య సమస్యలను దూరం చేసే ప్రయత్నంగా పరిగణించవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా చేపల ఉత్పత్తిలో భారతదేశం రెండవ అతిపెద్ద దేశంగా నిలిచింది, ప్రపంచ ఉత్పత్తిలో సుమారు 8 శాతం వాటా కలిగి ఉంది. ఆక్వాకల్చర్ (చేపల పెంపకం)లో చైనా తర్వాత రెండవ స్థానంలో ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం చేపల ఉత్పత్తి 184.02 లక్షల టన్నులుగా (18.402 మిలియన్ మెట్రిక్ టన్నులు) అంచనా వేయబడింది. భారతదేశంలో చేపల వేట, పెంపకం రంగం దేశ జిడిపిలో 1.1 శాతం వాటాను అందిస్తూ, 28 మిలియన్లకు పైగా ప్రజల జీవనోపాధికి మద్దతుగా నిలుస్తోంది, ముఖ్యంగా అణగారిన, దుర్బల వర్గాలకు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డిబి) ప్రకారం, మత్స్య పరిశ్రమ 2023-24లో రూ. 60,000 కోట్లకు పైగా ఎగుమతి ఆదాయాన్ని సమకూర్చింది, ఇది యుఎస్‌డి 7.38 బిలియన్లకు సమానం. కేంద్ర ప్రభుత్వ



ప్రాయోజిత పథకాలు 2025 నాటికి ఎగుమతులను రూ. 1 లక్ష కోట్లకు పెంచే లక్ష్యంతో పని చేస్తున్నాయి. 2017 నుండి 2024 వరకు ఈ పథకాల కింద లక్షలాది మత్స్యకారులకు శిక్షణ ఇవ్వబడింది. మంచినీటి చేపల ఉత్పత్తి మొత్తం ఉత్పత్తిలో 55 శాతానికి పైగా ఉంటుంది. మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, చేపల ఉత్పత్తి 1950-51లో 7.52 లక్షల టన్నుల నుండి 2023-24లో 184.02 లక్షల టన్నులకు పెరిగింది, ఇది దాదాపు 24 రెట్లు వృద్ధి. ప్రతి సంవత్సరం జూలై 10ని జాతీయ చేపల రైతుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కేరళలోని కోయిలాండి నౌకాశ్రయం ఆసియాలో అతిపెద్ద ఫిషింగ్ హార్బర్‌గా ప్రసిద్ధి చెందింది, ఇది పొడవైన బ్రేక్‌వాటర్‌ను కలిగి ఉంది. భారతదేశంలో 7,516 కిలోమీటర్ల సముద్ర తీరం, 3,827 మత్స్యకార గ్రామాలు, 1,914 సాంప్రదాయ చేపల ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. మంచినీటి వనరుల్లో 195,210 కిలోమీటర్ల నదులు, కాలువలు, 2.9 మిలియన్ హెక్టార్ల జలాశయాలు, 2.4 మిలియన్ హెక్టార్ల చెరువులు, సరస్సులు, 0.8 మిలియన్ హెక్టార్ల వరద మైదాన చిత్తడి నేలలు ఉన్నాయి. 2010 నాటికి సముద్ర, మంచినీటి వనరులు 4 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా స్థిరమైన చేపల క్యాచ్ సామర్థ్యాన్ని అందించాయి. ఫిషింగ్ టెక్నాలజీ, నియంత్రణ సంస్కరణలు, స్థిరత్వ విధానాలను అవలంబిస్తే ఆక్వాకల్చర్‌లో ఉత్పత్తి పది రెట్లు పెరిగే సామర్థ్యం ఉంది.

చేపలను ఆహారంలో భాగం చేసుకోవడం ఒక అంశం, కొన్ని ప్రాంతాల్లో చేపలనే ప్రధాన ఆహారంగా తీసుకోవడం మరొక అంశం. సముద్రాలు, నదులు, వాగులు, కుంటల్లో చేపలు సర్వత్రా అందుబాటులో ఉండటం వల్ల అనేక దేశాలు ఆహార అవసరాలను తీర్చుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయి. వ్యవసాయేతర దేశాల్లో ఆహార పదార్థాలు అందుబాటులో లేని చోటల్లో కూడా చేపలను ప్రధాన ఆహారంగా తీసుకుంటున్నారు. రుచిలో ఉన్నతంగా ఉండడమే కాకుండా, చేపలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, కొన్ని రోగాల నుండి విముక్తి కల్పించడం వంటి ప్రయోజనాలు కలిగి ఉన్నాయి. అందుకే భోజన ప్రియులు చేపలను తమ ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాలి. ఇటువంటి రుచికరమైన, పోషక విలువలతో నిండిన చేపల గురించి వివరాలు, గణాంకాలు తెలుసుకోవడం అవసరం. మన దేశంలో అందుబాటులో ఉన్న వనరులు, ఉత్పత్తి సామర్థ్యం, ఎగుమతి వ్యాపారం వంటి అంశా లు అర్థం చేసుకుంటే భారత ఆర్థిక పరిస్థితిని అంచనా వేయవచ్చు.

చేపల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో రెండవ స్థానంలో ఉండడం గర్వకారణం. 2023-24లో మత్స్య రంగం స్థూల విలువలో 1.12 శాతం వాటా కలిగి ఉంది. 2008-09లో 75.2 లక్షల టన్నులుగా ఉన్న ఉత్పత్తి 2023-24లో 184.02 లక్షల టన్నులకు చేరుకుంది. చేపల వృత్తిపై ఆధారపడిన వారు జలాశయాల్లో చేప పిల్లలను వేసి పెంచడం ద్వారా భారీ స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. సముద్రాలు మినహా ఇతర జలాశయాల్లో 75 శాతం ఉత్పత్తి జరుగుతోంది. గత ఏడు సంవత్సరాల గణాంకాలు:

2017-18లో 89.5 లక్షల టన్నులు,
2018-19లో 97.2 లక్షల టన్నులు,
2019-20లో 104.4 లక్షల టన్నులు,
2020-21లో 112.5 లక్షల టన్నులు,
2021-22లో 121.2 లక్షల టన్నులు,
2022-23లో 131.1 లక్షల టన్నులు,
2023-24లో 184.02 లక్షల టన్నులు.

ఈ గణాంకాలు మత్స్య రంగం ఆర్థిక వ్యవస్థను ఎలా బలోపేతం చేస్తుందో చూపిస్తాయి. చేపలు రోగనిరోధక శక్తిని పెంచి, గుండె, కాలేయం, కిడ్నీలు వంటి అవయవాలను కాపాడి, జ్ఞాపక శక్తి, శరీర కాంతిని మెరుగుపరుస్తాయి. మాంసాహారంలో చేపలను రారాజుగా గుర్తించి ఆహారంగా తీసుకోవాలి. ప్రభుత్వాలు నిరుపేదలకు చేపల సరఫరా చేయడం ద్వారా ఆహార, ఆరోగ్య అవసరాలను తీర్చవచ్చు. సమర్థవంతమైన పాలన ద్వారా వనరుల సద్వినియోగం, ప్రజల ఆరోగ్యం, కొనుగోలు శక్తిని పెంచి, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యాన్ని పెంచాలి. చేపలు ఈ ప్రక్రియలో కీలకం. చేపలు తినడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలపరచుకుందాం.

చేపల ఉత్పత్తి, వినియోగం పట్ల ప్రజలలో చైతన్యం పెరుగుతోంది. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో చేపలు సహజమైన పోషకాహారంగా మారాయి. ఒమేగా-3 ఫ్యాటీ ఆసిడ్స్ హృదయ ఆరోగ్యాన్ని కాపాడటంతోపాటు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెంచడంలో ఇవి దోహదపడతాయి. ఇటీవలి అధ్యయనాలు చేపల వినియోగం డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలను తగ్గిస్తుందని చూపిస్తున్నాయి. భారతదేశంలో మత్స్య రంగం వృద్ధి చెందడానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పిఎమ్ఎమ్ఎస్‌వై) వంటి పథకాలు మత్స్యకారులకు ఆర్థిక సహాయం, ఆధునిక సాంకేతికతలు అందిస్తున్నాయి. ఇవి ఉత్పత్తిని పెంచడమే కాకుండా స్థిరత్వాన్ని కాపాడటంలో సహాయపడతాయి. అయితే, పర్యావరణ మార్పులు, కాలుష్యం వంటి సవాళ్లు మత్స్య రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయి. సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల చేపల జాతులు మారుతున్నాయి, ఇది ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. అందుకే స్థిరమైన మత్స్య విధానాలు అవసరం. ఆక్వాకల్చర్‌లో ఆర్గానిక్ పద్ధతులు, బయోసెక్యూరిటీ చర్యలు అవలంబించాలి. మత్స్యకారులకు వాతావరణ మార్పుల పై అవగాహన కల్పించాలి. ఎగుమతి మార్కెట్లలో భారత చేపలకు డిమాండ్ పెరుగుతోంది. యూరప్, అమెరికా, జపాన్ వంటి దేశాలు మన ష్రింప్, ఫిష్ ఉత్పత్తులను ఇష్టపడుతున్నాయి. 2024-25లో ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే, నాణ్యతా ప్రమాణాలు, సర్టిఫికేషన్‌లు కచ్చితంగా పాటించాలి. మత్స్య రంగం మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో మహిళల పాత్ర పెరుగుతోంది. ఇది లింగ సమానత్వానికి దోహదపడుతుంది. చేపలు కేవలం ఆహారం మాత్రమే కాదు, సాంస్కృతిక, ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్నాయి. తీర ప్రాంతాల్లో చేపల వేట సంప్రదాయం శతాబ్దాలుగా కొనసాగుతోంది. ఆధునికీకరణతో పాటు సంప్రదాయ జ్ఞానాన్ని కాపాడాలి. ప్రభుత్వాలు, సమాజం కలిసి మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేయాలి. ఇది దేశ అభివృద్ధికి, ప్రజల ఆరోగ్యానికి దోహదపడుతుంది. చేపలు తినడం ద్వారా ఆరోగ్యవంతమైన జాతిని నిర్మిద్దాం.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఆదివాసుల హక్కుల కోసం ఉద్యమిద్దాం



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 16 (జనం సాక్షి) :** ఆదివాసి హక్కుల–కార్పొరేటీకరణ. కగార్ హత్యాకాండ –కాల్పుల విరమణ గురించి బహిరంగ సభను ఈ నెల 24న ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు, స్థలం అంబేద్కర్ భవన్, వరంగల్ సభను విజయవంతం చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం ప్రజాసంఘాల నాయకులు పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్య భారతంలో గత ఏడు నెలలుగా మావోయిస్టుల ఏరివేతలో భాగంగా అమాయకులైన ఆదివాసీలను ఎన్కౌంటర్లకు హత్యలు చేసి వాళ్లకు డ్రస్సులు తొడిగించి మావోయిస్టులనిముద్ర వేయడంవల్లఆదివాసుల జీవించే హక్కుకు బంధం కలుగుతుందనీ, భారత రాజ్యాంగం ప్రకారం జీవించే హక్కును కాపాడవలసిన ప్రభుత్వం ,ఆదివాసుల జీవితాలను చిద్రం చేస్తుందనీ, కేంద్ర ప్రభుత్వ బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగే పోరాటంలో ఆదివాసులు బలి చేయడందుర్మార్గం అని, గతంలో ఆదివాసీ మహిళ ఆరు నెలల పాపకు పాలిస్తుండగా పోలీసుల కాల్పుల్లో ఆరు నెలల అమ్మాయి చనిపోయిందనీ, దీనిబట్టి ప్రభుత్వం నక్సలైట్ల పేరుతో ఆదివాసులను కూడా భయభ్రాంతులకు గురిచేసి అడవిని కాళీ చేయించి, పెట్టుబడుదారులకు అడవుల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపద వారికి కట్టబెట్టాలని ప్రభుత్వం కుట్రపూరితంగా ఆపరేషన్ కగారు పేరుతో ఉద్యమకారు కారులను అంతం చేస్తామని ప్రకటించడం అంటే జీవించే హక్కు ఆర్టికల్ 21 ధిక్కరించడమే అవుతుందని ,ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని, మావోయిస్టల పేరుతో గడ్చిరోలి ప్రాంతాలలో ఆదివాసుల జాతి హననం కొనసాగుతున్నదనీ,ఆ ప్రాంతాలలో 28 రకాల ఏడు లక్షల కోట్ల ఖనిజ సంపద ఇతర అడవి సంపదను దోచిపెట్టడానికి కార్పొరేట్ సంస్థలతో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న 175 ఒప్పందాలను అమలు చేయడం కోసం,ప్రజలపై చేస్తున్న కార్పొరేట్ యుద్ధమే అతర్యుద్ధం అని ,మనదేశంలో 461 ఆదివాసి తెగలు ఉండగా 92 శాతం మంది అడవి పైనే ఆధారపడి జీవిస్తున్నారని ,పాలకులు అధికారులు పోలీసు యంత్రాంగం కార్పొరేట్ సంస్థలు క్రిమినల్స్ కలిసి ,కుమ్మక్కై ఆదివాసుల సంపదను దోపిడీ చేస్తున్నారనీ ,దోపిడి నిరాఘ్టంగా కొనసాగడానికి ,అక్కడున్న ఆదివాసీలను అక్కడినుండి ఖాళీ చేయించి వెళ్ళగొట్టాలి అందుకోసం మొత్తం ఆదివాసి సమాజాన్ని భీతావహనం చేయాలనీ ,ఆదివాసీల 1996 వేసా చట్టం 2006 హక్కుల చట్టం రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్లో వారికి ఉన్న హక్కులను అడగకుండా చేయాలనీ,అందుకే రెండు మూడు కిలోమీటర్ల చొప్పున వందలాది పోలీస్ క్యాంపులను నెలకొల్పి ,లక్షలాది పోలీసు బలగాలను మోహరించి, ఆదివాసులు రోజువారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న యుద్ధమే ఆపరేషన్ కగార్ , ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం ఒక కార్పొరేట్ సంస్థకు బస్తర్ లో900 ఎకరాలు భూమిని అప్పజెప్పి కేంద్ర పర్యావరణ శాఖ గడ్చిరోలిలో 1,20,000 చెట్లను కొట్టి వేయడానికి అనుమతించిందనీ,పర్యావరణం దెబ్బతిని మానవజాతి ,జంతువులు, పక్షులు వాటి ఉనికికి తీవ్రమైన సంక్షోభానికిగురి కాబోతుందనీ,ఆదివాసి జీవించే హక్కుకు మాత్రమే కాదనీ,ఈ భూమిపై జీవిస్తున్న సకల మానవకోటికి జీవించే హక్కుకు పర్యావరణం వల్ల నష్టం జరుగు తోందనీ, కాబట్టి వెంటనే ప్రభుత్వం ఆపరేషన్ కంగార్ నిలిపివేసి శాంతి చర్చలు జరిపి అడవులను ఆదివాసుల జీవించే హక్కులను కాపాడుతూ పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ,ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని,ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా శాఖ తరపున మేము మాట్లాడుతున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితిరాష్ట్ర ప్రధానకార్యదర్శి జి . గోపాల్,చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ బి. జ్యోతి,గద్వాల జిల్లా కమిటీ నాయకురాలు వెంకటమ్మ, తెలంగాణ ప్రజ ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ శంకర ప్రభాకర్, ఉమ్మడి జిల్లా ఉప అధ్యక్షుడు పి.నాగరాజు, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎండి సుభాన్, తెలంగాణ జన సమితి గద్వాల జిల్లా నాయకులు ఆలూరు ప్రకాష్ గౌడ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఇగ్బాల్,సిపిఐ పార్టీ గద్వాల జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు, బీరెల్లి దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకర వంతెనను పరిశీలించిన అధికారుల బృందం



**న్యాల్‌కల్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** మండలంలోని రేజింతల్ – ఎల్గోయి రోడ్డు ప్రమాదకర వంతెనను అధికారుల బృందం పరిశీలించారు. శుక్రవారం రాత్రి నుండి శనివారం తెల్లవారుజాము వరకు కురిసిన మోస్తారు భారీ వర్షంతో రేజింతల్ – ఎల్గోయి మామిడి వాగు వరద ఉధృతిని తహసిల్దార్ ప్రభులు, హద్దునూర్ ఎస్సై సుజిత్, ఎంపీడీవో శ్రీనివాస్, తదితరుల అధికారుల బృందం శనివారం ఉదయం మామిడి వాగు వంతెనను పరిశీలించారు. వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వరద ఉధృతి వాగు వద్ద పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. భారీ వర్షంతో న్యాల్ కల్ – చినిగెపల్లి పంచాయతీరాజ్ పిటి రోడ్డుపై సీసీ కల్వర్టు వద్ద రోడ్డు భారీగా కోతకు గురై పెను ప్రమాదకరంగా మారింది. అటువైపుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై సుజిత్ సూచించారు.

## మంత్రుల పర్యటనలో రగడ

- ప్రతిపక్ష నాయకులు అరెస్ట్
- రోడ్ల అద్వాన స్థితిపై ఆందోళన
- ఆందోళనకారులను అరెస్టు చేసిన నవాబ్ పేట్ పోలీసులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ చించల్ పేట్ గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రుల కాన్వాయలను ప్రతిపక్ష నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఎస్టి మైనారిటీ శాఖ మంత్రి లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొనే కార్యక్రమానికి ముందు ఈ సంఘటన జరిగింది. బిజెపి బి ఆర్ ఎస్ పార్టీల నాయకులు వేర్వేరు చోట్ల ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నవాబ్ పేట మండలంలో రోడ్లు అద్వాన స్థితిలో ఉన్నాయని దీనిపై మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వడానికి ప్రయత్నం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. బిజెపి నాయకులు పూలపల్లి గేటు దగ్గర మంత్రుల కాన్వాయ్ ని ఆపి వినతి పత్రాలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలో వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి వారిని అదుపులోకి తీసుకొని నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. మంత్రులకు శాంతియుతంగా వినతి పత్రాలు అందజేస్తామని బిజెపి నాయకులు చెప్పిన పోలీసులు ముందస్తు జాగ్రత్తగా వారిని అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. అలాగే బి ఆర్ ఎస్ పార్టీ నాయకులను పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా అరెస్టు చేశారు. మండలంలో నెలకొని ఉన్న సమస్యలపై మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రం అందజేస్తామని బి ఆర్ ఎస్ నాయకులు చెప్పిన వినిపించుకోకుండా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. దీంతో బిజెపి బి ఆర్ ఎస్ పోలీసుల మధ్య వాద్వి వాదం జరిగింది.

# చందానగర్ ఖజానా జ్యువెలరీ షాప్ రాబరీలో పురోగతి

- దోపిడీలో బీహార్ అంతర్రాష్ట్ర ముఠా ప్రమేయం
- ఇద్దరు నిందితుల అరెస్ట్...మరో ఏడుగురి నిందితుల పరారి
- త్వరలోనే కేసు నిజాలను నెగ్గుతేలుస్తాం
- మాదాపూర్ డిసిపి వినీత్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 16 (జనంసాక్షి) :** హైదరాబాద్ మహానగరంలో సంచలనంగా మారిన చందానగర్ ఖజానా జ్యువెలర్స్ దోపిడీ కేసులో సైబరాబాద్ పోలీస్ అధికారులు పురోగతిని సాధించారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోక మరో ఏడుగురు పరారీలో ఉన్నట్లు సమాచారం. కాగా ఈనెల 12న ఉదయం 10.30 గంటల సమయంలో ముంబై జాతీయ రహదాన్ని ఆనుకుని ఉన్న చందానగర్ ఖజానా జ్యువెలర్స్ షాప్ లోకి చొరబడ్డ ఏడుగురు నిందితులు తుపాకుల వంటి మారణాయుధాలను ధరించి హల్చల్ చేయడమే కాకుండా బంగారు ఆభరణాలు లభించకపోవడంతో సుమారు 10 కిలోల వెండి ఆభరణాలను దోచుకెళ్లే క్రమంలో ఖజానా జ్యువెలర్స్ డిప్యూటీ మేనేజర్ సతీష్ కుమార్ పై కాల్పులకు తెగబడిన విషయం విధితమే. పట్టపగలే గతంలో ఎప్పుడూ లేనివిధంగా చందానగర్ ప్రాంతంలోని ప్రముఖ జ్యువెలరీ షాప్ పై దోపిడీ ఘటన చోటు చేసుకోవడం సంచలనంగా మారిన తరుణంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సైబరాబాద్ పోలీస్ అధికారులు క్లూస్ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్, ఎస్ ఓ టి, క్రైమ్ బ్రాంచ్ తదితర ఇతర విభాగాలతో కలిపి దాదాపు 12 బృందాలను ఏర్పాటు చేసి దొంగతనం జరిగిన తీరును ఆధారంగా చేసుకుని కేసు(890/225) దర్యాప్తును కొనసాగించారు. ఈ క్రమంలో ఖజానా జ్యువెలర్స్ దోపిడీలో పాల్గొన్న సరన్ జిల్లా బీహార్ రాష్ట్రానికి చెందిన ఆశిష్ కుమార్ సింగ్(22), దీపక్ కుమార్ షా(22) లను అదుపులోకి తీసుకొని విచారణలను కొనసాగించగా బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ ముఠా హైదరాబాద్ నగరంలోని జువెలరీ షాపులపై దాడి చేసి బంగారు, వజ్రాభరణాలను కొల్లగొట్టడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకోవడం జరిగిందని, దోపిడీలో నిందితుడైన దీపక్ కుమార్ షా జీడిమెట్ల ప్రాంతంలో నివాసం అంటూ వెల్డింగ్ షాప్ లో వర్కర్ గా పనిచేస్తూ ఈ దొంగతనం ప్లాన్ ని అమలు చేయడానికి సహకరించడం జరిగిందన్నారు. దోపిడీకి వేసుకున్న ప్లాన్ లో భాగంగా రెండు సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసి దోపిడీ కంటే ముందే కథనా జ్యువెలరీ షాప్ వద్ద పక్కారెక్కిని నిర్వహించి అనుకున్న విధంగానే తమ ప్రణాళికను అమలు చేయడం జరిగిందన్నారు. ముందుగా నిందితులలో మరో వ్యక్తి అయిన ఆశిష్ కుమార్ సింగ్ మహారాష్ట్రలో అదుపులోకి తీసుకొని విచారణను కొనసాగించగా జీడిమెట్ల లోని దీపక్ కుమార్ షా ప్రధాన పాత్రను పోషించడం జరిగిందని, అతనే వాహనాలను నిందితులకు అందించడంతోపాటు వారు ఉండడానికి సైతం తగిన షెల్టర్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆశిష్ కుమార్ సింగ్ ఇచ్చిన సమాచారం మేరకు దీపక్ కుమార్ షా ను అదుపులోకి తీసుకోవడం జరిగిందని, వీరి ద్వారా పూర్తి వివరాలను రాబట్టి త్వరలోనే నిందితులందరినీ అరెస్టు చేయడం జరుగుతుందని మాదాపూర్ టిసిపి డాక్టర్ జి. వినీత్ వెల్లడించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్న నగల వ్యాపారస్తులు తమ షాపుల వద్ద సెక్యూరిటీని పెంచుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భద్రతను మరింత కట్టుదిట్టం చేసుకోవాలని డిసిపి సూచించారు.

## తోల్కట్ట, నక్కలపల్లి రోడ్డుకు రీబిట్ చేయాలని మంత్రి సీతక్కకు వినతి

- స్పందించిన మంత్రి సీతక్క



**మొయినాబాద్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** తోల్కట్ట చౌరస్తా నుంచి నక్కలపల్లి వరకు దాదాపు 7 కిలోమీటర్ల పొడవు బిటి రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారి గుంతలు కుంటలుగా తలపిస్తున్నాయి. అంటూ మంత్రి సీతక్కకు మొయినాబాద్ మండల నాయకులు, తోల్కట్ట గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. శనివారం చేవెళ్లలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు తోల్కట్ట గ్రామ నివాసి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో నాయకులు మధుసూదన్ రెడ్డి, షాబాద్ దర్శన్, మహేందర్ ముదిరాజ్, పట్నం రామ్ రెడ్డి, రాజు గౌడ్, తదితరులు కలిసి మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి, మంత్రికి రోడ్డు గురించి వివరిస్తూ.. తోల్కత్త చౌరస్తా హైదరాబాద్ బీజాపూర్ రహదారి నుంచి మొదలుకొని నక్కలపల్లి వరకు రోడ్డు పూర్తిగా గుంతలు పడి ప్రమాదాలకు నిలయంలో మారిందని తెలిపారు. రిబిట్ చేయించాలని మంత్రిని కోరారు. ఈ రోడ్డును 15 సంవత్సరాల నుండి గుంతల మరమ్మతులు నిర్వహించలేదని అన్నారు. ప్రభుత్వం ద్వారా వెంటనే ఈ రోడ్డు రి బిట్ చేయించాలని కోరారు. హైదరాబాద్–బీజాపూర్ రాదారి నుంచి తోల్కట్ట చౌరస్తా మొదలుకొని నక్కలపల్లి గ్రామాలు ఈ రహదారిపై ప్రయాణికులు వానదారులు ఎంతోమంది వెళుంటారు. అదేవిధంగా ఈ రహదారి నుంచి అటు వెంకటాపూర్, శంషాబాద్ వెళ్లే ప్రయాణికులు షాద్ నగర్ వైపు వెళ్తారు. దయచేసి వెంటనే ఈ రోడ్డు రిపీట్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి సీతక్క వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి రిపీట్ చేసేందుకు కృషి చేయిస్తామని తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి


### మహాసభ వాల్‌పోస్టర్ విడుదల



**సంగారెడ్డి, ఆగస్టు 16 (జనం సాక్షి) :** ఆగస్టు 19 నుంచి 22 వరకు గాజులరామారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి గంగమ్మ పిలుపునిచ్చారు. శనివారం సభకు సంబంధించిన వాల్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజులు జరిగే రాష్ట్ర మహాసభల్లో జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై చర్చ ఉంటుందన్నారు. అలాగే కేంద్రంలో మోడీ 12 ఏళ్ల పాలనలోని వైపల్యపై సమీక్షించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభకు మునిపల్లి మండల పరిధిలోని గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో జనం హాజరు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, గురుమూర్తి, సుమిత్ర రాణి, అంబికా తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- మహిళలకు 800 కోట్ల వడ్డీ లేని రుణాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి) :** మహిళాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం చించల్ పేట్ గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య తో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు గావించారు. వికారాబాద్ జిల్లా, చేవెళ్ల నియోజకవర్గం నవాబు పేట్ మండలంలోని చించల్ పేట్ గ్రామంలో 15 లక్షలతో అంగన్వాడి భవనం, 20 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, 20 లక్షలతో పశు వైద్య ఉపకేంద్ర భవనం, 20 లక్షలతో డ్వాక్రా భవనం, 30లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, 20 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం, 20 లక్షలతో గ్రామపంచాయతీ భవనాలను అతిధులు తో ప్రారంభించారు. సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో పంచాయత్ రా శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమం చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని ఆమె అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీ లేని రుణాలు, క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం దోహదం చేస్తుందన్నారు. మహిళలందరిని సంఘాల్లో చేర్పించాలని, సంఘాల్లో ఉన్నవారికి రుణాలు పొందే అవకాశం ఉంటుందని, ఇప్పటికే మహిళా సంఘాలకు 26 వేల కోట్ల అప్పులు ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. 800 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. మహిళా సంఘాల్లో ఉన్న మహిళలు రుణాలు పొంది మరణించినట్లయితే 2 లక్షల లోన్ బీమా చేయించడం జరుగుతుందని ఆమె తెలిపారు. మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయని ఆమె అన్నారు. 15 సంవత్సరాల వారికి మహిళా సంఘాల్లో సభ్యత్వం కల్పించడం జరుగుతుందని అదేవిధంగా 60 సంవత్సరాలు దాటిన మహిళలకు కూడా సంఘాల్లో చోటు కల్పించడం జరుగుతుందని ఆమె అన్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రతి పేదవాడు సన్న బియ్యంతో భోజనం చేయాలన్న సదుద్దేశంతో సన్న బియ్యాన్ని అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అదేవిధంగా రైతులను సన్న వడ్లు పండించేందుకు ప్రోత్సహిస్తూ క్వింటాల్ కు అదనంగా 500 రూపాయల బోనస్ ను కూడా ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఆరోగ్యశ్రీ కింద వైద్యానికి 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచడం జరిగిందని ఆమె అన్నారు. ఎస్సీ, ఎస్టీ , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... చించలపేట గ్రామంలో పెద్ద మొత్తంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. శాఖ పరమైన ప్రజలకు సేవ చేసేందుకు నా వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట కట్టుబడి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని ఆయన అన్నారు. గ్రామాల కనీస అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వ నిధులను కేటాయించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డిఓ వాసు చంద్ర, డిఆర్డిఏ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, డిటిడబ్ల్యుఓ కమలాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం, పశు సంవర్ధక శాఖ అధికారి సదానందం, డిడబ్ల్యుఓ కృష్ణ వేణి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇఇ ఉమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి లు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
17 ఆగస్టు 2025

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించాలి

- సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి డి బాల్ రెడ్డి
- బీసీ రిజర్వేషన్ల వ్యతిరేక పార్టీ బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలి



**వీపనగండ్ల, ఆగస్టు 16 (జనం సాక్షి) :** సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ సమావేశం పార్టీ మండల కార్యాలయంలో కామ్రేడ్ ఎం. కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ చేయకపోవడం, బీసీల పట్ల వ్యతిరేక భావజాలాన్ని బహిర్గతం చేస్తోందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానంపై గవర్నర్ వెంటనే సంతకం చేయాలని డిమాండ్ చేశారు. కానీ గవర్నర్ బీజేపీకి తలొగ్గి బిల్లుపై నిర్ణయం తీసుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ నుండి బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు పార్లమెంట్ లో నోరు మెదపకపోవడం, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేము అని చెప్పడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. బండి సంజయ్ బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీహార్లో జరుగుతున్న ఎన్నికల్లో పెద్ద ఎత్తున నకిలీ ఓటర్లను సృష్టించి అధికారంలోకి రావడానికి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో దళితులు,గిరిజనులు, మైనార్టీలు, అణగారిన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, మనువాద భావజాలంతో రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్లను రద్దు చేయాలనే బీజేపీ యత్నాలను ప్రజలు అర్థం చేసుకుని, పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, ఎండాకాలం వరి బోనస్ డబ్బులు వేయాలని, కొంతమంది రైతులకు రైతు భరోసా అందలేదు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సిపిఎం స్వతంత్రంగా పోటీ చేస్తుందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల కృష్ణయ్య,మహబూబ్ బాషా, రవి ప్రసాద్, మండల కమిటీ సభ్యులు బాలగౌడ్, వి. కృష్ణయ్య, సిహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఖాజా హుస్సేన్, ఈశ్వర్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకు బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి



**మక్తల్ ఆగస్టు 16 (జనంసాక్షి) :** హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కు గౌడ సంఘం జిల్లా కన్వీనర్ బిజ్వార్ మహేష్ గౌడ్ శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రివర్యులు వి.శ్రీనివాస్ గౌడ్ హైదరాబాదులోని ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని, మూడు కోట్ల రూపాయలను శాంక్షన్ చేస్తున్నట్లు మెమో నెంబర్ 3347/డి/2021 తో తేదీ 30/11/22 ఉత్తర్వులు ఇచ్చారని, ట్యాంక్ బండ్‌పై సాగర్ పార్క్ వద్ద స్థల పరిశీలన చేసి విగ్రహాన్ని ఏర్పాటుచేసే క్రమంలోనే ఎన్నికల కోడ్ రావడం వలన పనులు ఆపివేశారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు అవుతుందని ఇప్పటివరకు అక్కడ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని పేర్కొన్నారు. గత సంవత్సరమే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారని ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షనీయమే అని అయితే ఈ నెల 18వ తారీకున ట్యాంక్ బండ్ పై పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ని, పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లను కలిసి ప్రభుత్వంతో చర్చించి తక్షణమే భూమి పూజ చేసి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు జనగామ జిల్లాను పాపన్న గౌడ్ జిల్లాగా పేరు పెట్టేటట్లు, పెండింగ్ లో ఉన్న గీతా కార్మికుల ఎక్స్ గ్రేషియాలను విడుదల చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

## విద్యార్థులకు రంగు బ్రదర్స్ ప్రోత్సాహం



**నంగునూరు, ఆగస్టు 16 (జనం సాక్షి) :** గట్లమల్యాల హైస్కూల్లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు యువ నాయకులు రంగు చింటు గౌడ్ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. గ్రామంలో విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో చదువు పట్ల మరింత ఆసక్తిని పెంచవచ్చని, భవిష్యత్తులో వారు ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని రంగు బ్రదర్స్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, గ్రామ యువతకు స్ఫూర్తినిస్తుందని స్థానికులు ప్రశంసించారు.

## ఓ పక్క తల్లి బాధ్యతలు..మరో పక్క ప్రభుత్వ విధులు....



**ఝరాసంగం, ఆగస్టు 16 (జనం సాక్షి) :** ఓ పక్క తల్లి బాధ్యతలు మోస్తూనే మరో పక్క ప్రభుత్వ విధులకు హాజరౌతూ తనకు ఉద్యోగం పట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంటుంది మేదపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కాంచన రాథోడ్. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వం పంచాయతీరాజ్ ఉద్యోగులకు సెలువులు రద్దు చేయడంతో తప్పనిసరి విధులకు హాజరు కావలసిన పరిస్థితి ఉంది. గ్రామాలలో వాగులు,వంకలు పొంగి పొర్లుతున్నందున ఆ పరిసర ప్రాంతాలకు ప్రజలు వెళ్ళకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉంది. ఈ నేపథ్యంలో మేదపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తన 8 నెలలు చంటి బిడ్డను ఇంత చల్ల వాతావరణం ఉన్నప్పటికి అటు తల్లిగా పాప ఆలనా పాలనా చూసుకుంటూనే ఇటు ఉద్యోగ బాధ్యతలను సైతం నిర్వహిస్తూ విధులపట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూ గ్రామస్తుల మన్ననలు అందుకుంటుంది. మిగితా పంచాయతీ కార్యదర్శులు ఈమెను ఆదర్శంగా తీసుకుని తమ బాధ్యతలు నిర్వహించాలని అధికారులు పలు గ్రామాల ప్రజలు సూచిస్తున్నారు.

## నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

- జులై నెలలో 29 ఎల్‌ఓసి, 239 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



**రేవల్లి, ఆగస్టు 16 (జనంసాక్షి) :** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి నియోజకవర్గ పరిధిలోని నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నారు. రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన కల్వకోలు సత్యం మెరుగైన వైద్యం చేయించుకునేందుకు రూ. 5లక్షలు ప్రస్తుతం, మరో రూ.3 లక్షలు మొత్తం రూ.8 లక్షల విలువగల ఎల్‌ఓసీ నీ ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్థిక స్తోమత లేక తాము మెరుగైన వైద్యం చేయించుకోలేకపోతున్నామని తనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరపున వారి చికిత్సకు సరిపోయేంత ఎల్‌ఓసీ లను మంజూరు చేయించి తన మానవత్వాన్ని చాటుకుంటున్నారు. జులై నెలలో రూ. 68 లక్షల 80 వేల విలువగల 239 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సైతం ఎమ్మెల్యే మంజూరు చేయించారు.

## యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి) :** యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి సూచించారు. భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్స్, మద్యం నుండి యువతను కాపాడుకుందాం..నవభారతాన్ని నిర్మించుకుందాం అనే పోస్టర్‌ను ఫౌండేషన్ సభ్యులతో కలిసి నారాయణపేటలో రాజ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చదువులు పూర్తయిన తర్వాత యువత భవిష్యత్తుపై దృష్టి సారించాలని అన్నారు. ఇట్టి పరిస్థితుల్లో కూడా డ్రగ్స్, మత్తు పదార్థాల వైపు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గడ్డం తిప్పన్న, బాలాజీ, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, సల్ల వెంకటేష్, వై.సంతోష్, శివరాజ్, నర్సింహనాయుడు, అశోక్, ఎం.సంతోష్, నందుకుమార్, నర్సింహ, శ్రీనివాస్, జేకే.అనిల్, నాగురావు, చామకూర నగేష్, రాజప్ప గౌడ్, హరికృష్ణ ప్రభూజీ, రాజు, రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల పట్టణంలో క్షుద్ర పూజల కలకలం

- కిరాణా షాపు ముందు దంపతుల ఫోటోతో పూజలు



**చేర్యాల, ఆగస్టు 16 (జనంసాక్షి) :** ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంలో ముందుకు దూసుకెళుతున్న తరుణంలో చేర్యాల మున్సిపాలిటీలో మాత్రం ఓ కిరాణం దుకాణం ఎదుట క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు ఉండటం కలకలం రేపుతూ స్థానికులను ఆందోళనతో ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చేర్యాల పట్టణానికి చెందిన గాజుల నాగరాజు స్థానిక కొత్త బస్టాండ్ వద్ద కిరాణా షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం షాపు మూసివేసి ఇంటికి వెళ్ళి శనివారం ఉదయం తిరిగి దుకాణం తీసే క్రమంలో దుకాణం ఎదుట నల్లని బొమ్మ, పసుపు,కుంకుమ, కోడి గుడ్లు, కొన్ని రంగులతో కలిపిన అన్నం నాగరాజు దంపతుల ఫోటో ముందు పెట్టి ఉండటంతో క్షుద్ర పూజలు చేసినట్టు గుర్తించి, జరిగిన ఘటనపై చేర్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చేర్యాల ప్రధాన రహదారి అనుకొని నిత్యం రద్దీ ఉండే ప్రాంతంలో ఇలా క్షుద్రపూజలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

## భారీ వర్షాలకు తెగిపోయిన బ్రిడ్జి సందర్శన




**నారాయణఖేడ్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ మండల పరిధిలోని కాంజీపూర్ రోడ్డు బ్రిడ్జి భారీ వర్షాల కారణంగా శుక్రవారం తెగిపోయిన బ్రిడ్జిని ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి శనివారం పరిశీలించారు. బ్రిడ్జి, రోడ్డు మరమ్మత్తులను వెంటనే చేపటాలని అధికారులకు సూచించారు. బ్రిడ్జి కూడా మంజూరు అయిందని త్వరలోనే టెండర్లకు పిలిచి పనులు చేపట్టే విధంగా చూస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో రోడ్లను కనీసం మరమ్మతులు చేపట్టలేదు అన్నారు. ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిగా రోడ్లు ధ్వంసం అవుతున్నాయి అన్నారు. నల్లవాగు ప్రాజెక్టు గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎంత మోతాదులో నీరు నిలువ అయిందని అధికారులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ఆయన వెంట డిఈ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, న్యాయవాది సంగన్న మాజీ ఎంపీటీసీ పండరెడ్డి, జ్ఞానేశ్వర్ పాటిల్, విష్ణు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భాష్యం విద్యాకేతన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**మహమ్మదాబాద్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** శ్రీకృష్ణ జన్మాస్మి పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో యువతి యువకులు ఆనందోఉత్సవాలతో,కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘ సభ్యులు గ్రామాలలో ఉట్టి కట్టి ఎంతో ఆసక్తికరంగా గ్రామస్తులు తిలకిస్తుండగా న్యూత్యలు చేస్తూ ఆటపాటలతో ఉట్టి కొట్టి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేకంగా మహమ్మదాబాద్ భాష్యం విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు శ్రీ కృష్ణష్టమిని పండుగను జరుపుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణుని పాటలతో ఎంతో ఉత్సవాలతో,ఉట్టి కొట్టి సంతోషాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా చిన్నారుల రాధాకృష్ణ గోపికల వేషదరణతో విద్యార్థులు ఉపాధ్యాయులు ఆకట్టుకున్నారు.

## ఎట్టకేలకు స్మశానవాటికకు రోడ్డు పనులు ప్రారంభం





- జనం సాక్షి కథనానికి కదలిక
- మంత్రి శ్రీహరి చొరవ

**కృష్ణ, ఆగస్టు 16 (జనంసాక్షి) :** కృష్ణ మండలం గుడేబల్లూర్ గ్రామంలో ఎట్టకేలకు శనివారం స్మశాన వాటికకు అధికారులు రోడ్డు పనులు ప్రారంభించారు. కాటికి వెళ్ళాలన్నా కష్టమే అన్న జనం సాక్షి కథనానికి అందరిలో కదలిక వచ్చింది. ఈ కథనంతో రాష్ట్ర మత్స్య, పాడి పరిశ్రమ, క్రీడలు యువజన శాఖా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి స్పందించి చొరవ చూపారు. మంత్రి శ్రీహరి వెంటనే స్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. దాంతో ఇటీవల అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఆ వెంటనే అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం రోడ్డు పనులను ఎంపీడీఓ విజయలక్ష్మి ప్రారంబించారు. రోడ్డు పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఎట్టకేలకు స్మశానానికి రోడ్డు పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రోడ్డు పనులకు చొరవ తీసుకున్న మంత్రి,అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రఘు స్వామి, గ్రామ పెద్దలు, సిద్రామ్ రెడ్డి మాలిపాటిల్, చందాపూర్ నాగప్ప,వడ్వాట్ సిద్రమప్ప, మాజీ ఎంపిటిసి వాకిటి లక్ష్మీ నారాయణ, ఈ విజయ గౌడ్, పంతికిరెడ్డి, బొల్ల బోడి మహాదేవ్, నాగేశ్వరరావు, సోమ ప్రకాష్, సి రమేష్, పి సిద్ధప్ప, ప్రజాప్రతినిధులు, యువకులు, తదితరులు, పాల్గొన్నారు.

## అలుగు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు





- ప్రాంతాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**మఖ్తల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గంలోని అలుగు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు మండల పరిధిలోని అలుగు వరద సమస్య ప్రాంతాలైన గోలపల్లి, రుద్రసముద్రం, కర్ని, ముస్లాయిపల్లి చెరువు అలుగు లను కాంగ్రెస్ నాయకులు ఎ.రవి కుమార్, నూరుద్దీన్, సాధిక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు గోలపల్లి, రుద్రసముద్రం, కర్ని, ముస్లాయిపల్లి చెరువు అలుగు ప్రాంతాలను పరిశీలించి మంత్రి కి వివరించామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో అలుగు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాబోయే రోజుల్లో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హామీ ఇచ్చినట్లు తెలిపారు. చాలా ఏళ్ళ నుంచి ఆయా గ్రామాల మీదుగా రాకపోకలు సాగించే ప్రజలు వర్షాకాలంలో అలుగు పారిన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి అతి త్వరలో శాశ్వత పరిష్కారం చూపెడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# ఉప్పొంగి ప్రవహిస్తున్న మోరంచవాగు

● వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచవాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది.. శుక్రవారం రాత్రి నుండి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురియడంతో మోరంచవాగులో వరద ఉధృతి పెరిగింది.. సుమారు రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇదే మోరంచ వాగు ఉగ్రరూపం దాల్చింది.. స్థాయికి మించి వరద ప్రవాహం రావడంతో పక్కనే గల మోరంచపల్లి గ్రామం నీటమునిగింది.. వరద ప్రవాహంలో నలుగురు మనుషులు, అనేక పశువులు కొట్టుకుపోయి విషాదాన్ని మిగిల్చింది.. గ్రామ ప్రజలందరు నిరాశ్రయులుగా మారార. ఆ సంఘటన జరిగినప్పటినుండి ఎప్పుడు భారీ వర్షాలు కురిసినా మోరంచవాగు ఉప్పొంగి ప్రవహించినా గ్రామస్తులు భయంతో వణికిపోతున్నారు.. ఇలాంటి పరిస్థితుల్లో ఇటీవలె భారీ వర్షాలు కురుస్తుండడంతో అధికారులు ఎప్పటికప్పుడు మోరంచవాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం మొరంచపల్లి వాగు ఉధృతిని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు..

### అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

మోరంచవాగు ఉధృతి పెరుగుతూ వస్తుందని, అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మోరంచవాగును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వాగు ఉధృతి దృష్ట్యా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు తక్షణమే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఎగువ భాగం నుండి ఎంత వరద వచ్చే అవకాశం ఉందన్న వివరాలు ఈఈ ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా ఉండాలని వరద పరిస్థితిని ముందుగా అంచనా వేసి ప్రజలను ముందస్తు అప్రమత్తం చేయాలని సూచించారు. వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లాకు ఆదివారం వరకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి రక్షణ చర్యలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు ఉన్న దృష్ట్యా ప్రజలు, పశువుల ప్రాణరక్షణలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలకు ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ కు కాల్ చేయాలని సూచించారు. 90306 32608 ద్వారా వచ్చిన ఫిర్యాదులకు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశువులను మేతకు బయటికి పంపకుండా ఇంటి పట్టునే ఎత్తైన ప్రదేశంలో ఉంచాలని తెలిపారు. రహదారులపై నీళ్లు చేరిన ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణాలు చేయకుండా పటిష్ట నియంత్రణ చేయాలని తెలిపారు. కొంతమంది అత్యుత్సాహంతో ఎవరైనా దాటే ప్రయత్నం చేసే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ సిబ్బంది పటిష్ట పర్యవేక్షణలో బారికేడ్లు ఏర్పాటు చేసి రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ ప్రసాద్, డిఈ వరుణ్, ఏఈ షర్ఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశావర్కర్ ఇర్ప లక్ష్మిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే..

● ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్

● పది లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 16(జనం సాక్షి):** ఇర్ప లక్ష్మిది ప్రభుత్వ హత్య అని ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులుకుంజ మహేష్ రాష్ట్ర ప్రభుత్వం పైన తీవ్ర స్థాయిలో ఆరోపించారు. లక్ష్మి పురం నుండి మొట్ల గూడెం, రాచపల్లి, వెంకటాపురం వెళ్లే దారిలో వాగు ఉందని అన్నారు. ఈ వాగుకు బ్రిడ్జి కట్టక పోవడం వల్ల వాగు దాటే క్రమంలో ఆదివాసీలు వరదలో కొట్టుకొని పోయి చనిపోతున్నట్లు తెలియజేసారు. శనివారం ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్ లక్ష్మి పురం గ్రామాన్ని సందర్శించారు. చనిపోయిన లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ ఆదివాసీలతో మాట్లాడినారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఇర్ప లక్ష్మి చనిపోయిందని అన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి ఇంకా ఎంతమంది ఆదివాసీలు బలి కావాల్సి వస్తుందో అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు . విధి నిర్వహణ లోనే వాగు దాటుతూ ఉండగా లక్ష్మి చనిపోయినందున ఆమె కుటుంబానికి ప్రభుత్వం పది లక్షల రూపాయలు ఎక్స్ గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. లక్ష్మి చనిపోయి నాలుగు రోజులు అయిన స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పి ఓ కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలవక పోవడం సిగ్గు చేటు అన్నారు. ఆదివాసీల చావులు వీధి కుక్కల చావుల కంటే హీనంగా ఉన్నాయని మండిపడ్డారు. ఆదివాసీలు వాగులు దాటుతూ చనిపోవడం ప్రజా పాలనా లక్ష్యమా.. అని ప్రశ్నించారు. వెంకటాపురం మండలానికి ఐదు కిలోమీటర్లు దూరం లో ఉన్న లక్ష్మి పురం ఆదివాసీ గూడెం ఏ రకంగాను అభివృద్ధి కి నోచుకోలేదని ఆయన అన్నారు. లక్ష్మి పురం గ్రామానికి చెందిన ఇర్ప లక్ష్మి ఆశా వర్కర్ గా పని చేస్తోందని అన్నారు. బుధవారం ఆమె తన విధులు నిర్వర్తించు కోని ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామానికి అనుకోని ఉన్న పాలెం వాగు దాటుతూ అదుపు తప్పి నీళ్లలో పడి పోయి చనిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలుపు తున్నారని ఆయన అన్నారు. కొంతమంది అధికారులు లక్ష్మి మరణాన్ని వక్రీకరిస్తూ ఉన్నట్టు ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. లక్ష్మి పురం గ్రామం చుట్టూ వాగులు ఉన్నాయని అన్నారు. రోడ్డు మార్గం కూడా లేదని అన్నారు. వర్షాకాలం వస్తే బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నామని ఆదివాసీలు తమ గోడు చెప్పు కుంటున్నారని అన్నారు. ఈ గ్రామం లో ప్రాథమిక పాఠశాల లేదన్నారు. ఆదివాసీ బిడ్డలను దశాబ్దాలుగా విద్యకు దూరం చేస్తూ ఉన్నారని ప్రభుత్వం పై మండిపడ్డారు. ఏటూరునాగారం ఐటీడీఏ అధికారులు ఆదివాసీల సమస్యలను గుర్తించడం లో అలసత్వం వహిస్తూ ఉన్నారని అన్నారు. ఆదివాసీ గూడెలకు విద్య, వైద్యం, త్రాగు నీరు సాగు నీరు వంటి మౌలిక వసతులు కల్పించడం లో గిరిజనాభివృద్ధి సంస్థ విఫలం అవుతోంది విమర్శ చేశారు. కోట్ల రూపాయల జీతాలు ప్రతి నెల చెల్లిస్తూ .. ప్రాజెక్ట్ అధికారిగా ఐఏఎస్ లను పెట్టినా ప్రయోజనం శూన్యం అన్నారు. రాష్ట్రం లో ఇప్పటి వరకు గిరిజనాభివృద్ధి శాఖా మంత్రిని కేటాయించక పోవడం సిగ్గు చేటన్నారు. ఏళ్ల తరబడి లక్ష్మి పురం గ్రామ ఆదివాసీ బిడ్డలు విద్యకు దూరం అవ్వడానికి కారణం ప్రభుత్వం ఐటీడీ ఏ అధికారులే కారణం అన్నారు. ప్రజా పాలన.. బంగారు తెలంగాణ.. అభివృద్ధి చెందుతోంది ఇండియా.. అని పాలకులు ఇచ్చే నినాదాలు ఈ దేశ ములవాసులు అయిన ఆదివాసీలకు వర్తించవు అని పేర్కొన్నారు. కార్యక్రమం లో కంతి శంకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు..



# పాకాల సరస్సు మత్తడికి మాజీ ఎమ్మెల్యే పెద్ది పూజలు

**ఖానాపురం, ఆగస్టు 16 (జనం సాక్షి):** కానాపురం మండలం అశోక్ నగర్ సమీపంలోని పాకాల సరస్సు మత్తడి వద్ద నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాతలకు సమృద్ధిగా పంటలు పండాలని వేడుకొన్నారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఖానాపూర్ మండలంలోని పాకాల సరస్సు మత్తడి పోస్తున్న శుభ తరుణంలో కట్టమైసమ్మ తల్లి, మత్తడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నియోజకవర్గ రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. నర్సంపేట ఖానాపురం మండల రైతాంగానికి వరప్రదాయినిగా ఉన్న పాకాల సరస్సు ఈ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకొని వారి ధాన్యాన్ని పండించేందుకు నేటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్, గుగులోత్ రామస్వామి నాయక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు నాగవెల్లి వెంకట్ నారాయణ గౌడ్, గోనె యువరాజు, బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఖానాపురం మండల పార్టీ అధ్యక్షులు మున్సిపల్ వైస్ చైర్మన్, మాజీఎంపిపి, మండల పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# నిర్మల్ జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఉద్యమం ఉధృతం

**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 16 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ స్థాపన అత్యవసరమని విద్యార్థి సంఘాలు, ప్రజా ప్రతినిధులు,,ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు ఉద్యమం ఉధృతం చేస్తున్నారు. గత వారం రోజులుగా జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘభవన్ లో అన్ని సంఘాల నాయకులు, విద్యావంతులు, జర్నలిస్టులు, సుదీర్ఘంగా చర్చించారు. అందులో భాగంగా స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నంగే శ్రీనివాస్, ఎం సి లింగన్న, జల్ద్ రమణ, రాసం శ్రీధర్, డా,కృష్ణంరాజు, డా,ప్రమోద్ చందర్ రెడ్డి సారథ్యంలో స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ద్వారా ఉద్యమ కార్యాచరణ రూపొందించి దశల వారీగా ఆందోళనలకు సిద్ధమయ్యారు.. హస్తకళలు, వ్యవసాయం, అటవీ వనరులు, పర్యాటకం వంటి రంగాల్లో ప్రత్యేకత కలిగిన నిర్మల్ జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు పరిమితంగానే ఉన్నాయనీ, కొత్త విశ్వవిద్యాలయం వస్తే పరిస్థితి మారుతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రత్యేకతల ప్రకారం నిర్మల్ టాయ్స్, పెయింటింగ్స్, అడవి ఉత్పత్తులు, పసుపు, వరి, సోయాబీన్ పంటలు ప్రాధాన్యం పొందాయి. వీటిని ఆధారంగా చేసుకుని శిక్షణా కార్యక్రమాలు అందిస్తే స్థానిక యువత పరిశ్రమల్లో అవకాశాలు పొందడమే కాకుండా, స్వయం ఉపాధి దిశగా ముందుకు వెళ్లగలరని మేధావులు చెబుతున్నారు. ప్రస్తుతం వేలాది మంది విద్యార్థులు హైదరాబాదు, వరంగల్, నాందేడ్ వంటి పట్టణాలకు వెళ్లి నైపుణ్య విద్య కోసం ఖర్చులు పెంచుతున్నారని, నిర్మల్‌లోనే విశ్వవిద్యాలయం వస్తే వారికి పెద్ద ఉపశమనం కలుగుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాలు, కళాకారుల సంఘాలు, రైతు సంఘాలు కలిసి ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి. సంతకాల సేకరణ, శాంతియుత ర్యాలీలు, సోషల్ మీడియా ప్రచారం ద్వారా డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. త్వరలో తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం. అందజేయడం, ఎంపీలు, ఎమ్మెల్యేలను కలసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ,ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని జిల్లా ప్రజలు,మేధావులు, కోరుతున్నారు.

# చెరువును తలపిస్తున్న ఎంపీడీవో కార్యాలయం



**నల్లబెల్లి, ఆగస్టు 16 (జనంసాక్షి):** శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోకి వర్షపు నీరు భారీగా వచ్చి చేరడంతో చెరువును తలపిస్తుంది. కార్యాలయంలోకి వెళ్లాలన్న వెళ్లలేని స్థితిలో వర్షపు మీరు వచ్చి చేరింది. శనివారం కార్యాలయానికి సెలవు దినం కావడంతో కార్యాలయ సిబ్బందికి, ప్రజలకు కార్యాలయంలోకి వెళ్లే ఇబ్బందులు తప్పయి. మండల ప్రజలు నిత్యం ఏదో అవసరం మీద ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. అలాంటిది కార్యాలయ ఆవరణలో వర్షపు నీరు ఉండడంతో కార్యాలయంలోకి వెళ్లి సమస్యలు పరిష్కరించుకోనేది ఎలా అని... ప్రజల ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి కార్యాలయ ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే గండ్ర పర్యటన



**భూపాలపల్లి, ఆగస్టు 16 (జనం సాక్షి):** భూపాలపల్లి పట్టణ పరిధిలోని 19వ వార్డు రెడ్డి కాలనీలో వర్షాల కారణంగా వరద ప్రభావిత ఇళ్లను పరిశీలించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు. వరద నీరు ప్రవేశించిన వారి ఇళ్ళలోకి వెళ్ళి వారిని పరామర్శించినారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్లే వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోందని గుర్తించి, వెంటనే డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లద్దనీ, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ పోల్ లకు దూరంగా ఉండాలని , అన్నీ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, మునిసిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లలోకి చేరిన వరద నీరు





**మంగపేట ఆగస్ట్ 16(జనంసాక్షి) :** శుక్రవారం రాత్రి నుండి మరుసటి రోజు శనివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి సైతం వరద నీరు కాస్త ఇండ్లలోకి చేరిన ఘటన శనివారం చెరుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి నుండి ఎడ తెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో నరసింహసాగర్ ప్రాజెక్ట్ (ప్రాజెక్ట్ కాలువ) లో వరద నీరు కాస్త ఉధృతంగా ప్రవహించడంతో కాలువలు, మోరీలు ఇసుక మట్టితో పూడిపోవడంతో ఆ వరద నీరు కాస్త రోడ్లపైకి ఎక్కి తమ ఇండ్లలోకి చేరడం జరిగిందని బాధితులు నాగబెల్లి కేశవాచారి, అచ్చ రవి, ఆకుల జయమ్మ లు తమ ఆవేదనలను వ్యక్తపరిచారు. ఈ విషయంపై గత వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు సైతం కూడా ఇలానే ఇండ్లలోకి వరద నీరు వచ్చిందని ఎటు వెళ్ళాలో తెలియని దిక్కు తెలియని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో కలిసి భయం గుప్పెట్లను తెల్లవారులు జాగారాలు చేశామని ఈ విషయాన్ని అధికారులకు కూడా తెలపడం జరిగిందని కనీసం వారు పట్టించుకోకపోవడం మనోవేదనను కలిగించిందని వారు వాపోయారు. అప్పుడు అధికారులు పట్టించుకోకపోవడంతోనే మళ్లీ శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద నీరు కాస్త ఇంటి చుట్టూ, ఇండ్లలోకి చేరిందని బాధితులు తెలిపారు. ఎక్కడ సమస్య ఉన్న వెంటనే స్పందిస్తామన్న అధికారులు కనీసం చెప్పిన కూడా పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరి ఎంతుందో అర్థమవుతుందని వారన్నారు . గతంలో ఎన్నడు కూడా ఇలా వరద నీరు ఇండ్ల లోకి రాలేదని ఈసారి మాత్రమే ఇలా పైకి రావడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించి మరల వరద నీరు ఇళ్లలోకి రాకుండా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

## శాంతి వనంలో కలిమి కాయలు



**నర్సంపేట ఆగస్టు 16 (జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలోని శాంతి వనంలో కలిమి కాయలు,వాక్రాయలు, కరొండ అనే పేర్లతో పిలుస్తారని వన ప్రేమి గోకా రామస్వామి అన్నారు.వీటిని రోటి పచ్చడి గానే కాక నిలువ పచ్చడి కూడా చేస్తారని తెలిపారు. కిలో 50 రూపాయలున్న టమాట బదులు ఐదు, ఆరు కాయలు పప్పు లో వేసుకుంటే ఆ రుచే వేరని అన్నారు. ఇందులో "సి" విటమిన్ పుష్కలంగా ఆరోగ్య ప్రదాయిని గా ఉపయోగ పడుతుందని ఆయన అన్నారు. వ్యవసాయదారులు ఈ మొక్కలను జీవ కంచెగా చేను చుట్టు వేస్తారని, వీటికి ఉన్న మూడు ఇంచుల ముల్లుల వలన పాములు కూడా చొరబడవని గోకా అన్నారు. శాంతి వనం కొరకు తేవడం జరిగిందని, నేడు విరగ బూసిన కాత తో శాంతి వనానికి అందం తెచ్చాయని ఆయన అన్నారు

# 'భద్రకాళి'కి బస్సు సౌకర్యం



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 16(జనంసాక్షి):** భద్రకాళీ అమ్మవారి దర్శనమునకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం వరంగల్ రైల్వే స్టేషన్ నుండి వయా భద్రకాళీ దేవస్థానం మీదుగా కాజీపేట రైల్వే స్టేషన్ వరకు టీజీఆర్టీసీ బస్సు నడుపుటకు నిర్ణయించి కొత్త బస్సును శనివారం ఉదయం లాంఛనంగా టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ బత్తిని శ్రీనివాస్ రావు (బట్టి శ్రీను) జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, దేవాలయ చైర్మన్ డాక్టర్ బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, గాండ్ల స్రవంతి,మోతుకూరి మయూరిరామేశ్వర్రావు, ఓరుగంటి పూర్ణచందర్, బింగి సతీష్, కార్యనిర్వహణాధికారి రామల సునీత, భద్రకాళి శేషు అయ్యగారు దేవాలయ అర్చకులు మరియు సిబ్బంది, ఆర్.టి.సి హనుమకొండ డిపో మేనేజరు ధరమ్ సింగ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద

● పాత ముగ్దుంపురం లోలెవల్ కాజ్ వేను పరిశీలించిన కలెక్టర్



**చెన్నారావుపేట, ఆగస్టు 16 (జనం సాక్షి):** వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో కలిసి చెన్నారావుపేట నర్సంపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో పాత ముగ్దుంపురం వద్ద వరద నీటితో ప్రవహిస్తున్న లో లెవెల్ కాజ్ వేను ఆమె పరిశీలించారు. లో లెవెల్ కాజ్ వే వద్ద అధికారులు, పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించి సమర్ధ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ వాతావరణ శాఖ వరంగల్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిందని అది రెడ్ అలర్ట్ గా మారే సూచనలు ఉన్నాయని ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల పై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, చెరువులలో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన మేరకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో భారీ వర్షాల పై టామ్ టామ్ చేసి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులలో, లో లెవెల్ కాజ్వే పై వరద నీరు ప్రవహిస్తున్నందున వాహనాలను, ప్రయాణికులను వెళ్లడానికి అనుమతించవద్దన్నారు. దారి మళ్లించి పంపించాలని సూచించారు. చెరువులలో ప్రజలను, చేపలు పట్టే వారిని రైతులను, పశు కాపరులను సందర్శకులను అనుమతించవద్దని అన్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉన్నారని, విపత్కర పరిస్థితి ఎదురైతే ఎస్ డిఆర్ఎఫ్, ఎన్ డిఆర్ఎఫ్ బృందాలు జిల్లాలో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, లో లెవెల్ కాజ్వే లనుదాటే ప్రయత్నం చేయకుండా హెచ్చరిక బోర్డులు, పోలీసుల నిఘా ఉంచుతూ ప్రజలకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఎంపీడీవో నల్ల శ్రీవాణి, చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి, గిర్ధవర్ మహమ్మద్ రషీద్, చెన్నారావుపేట పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 16 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి పూర్తి చేసుకోవాలని కోరారు. శనివారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సమావేశ మందిరంలో రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి, అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి సూర్యాపేట రూరల్, చివ్వెంల మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా హుజూర్ నగర్ నుండి సన్నబియ్యం , తిరుమలగిరి నుండి నూతన్ రేషన్ కార్డులు పంపిణి చేయటం సూర్యాపేట జిల్లా అదృష్టమని అన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల పంపిణీలో భాగంగా, చివ్వెంల మండలంలో 1856 నూతన రేషన్ కార్డులు, 526 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ఇవ్వడం జరుగుతున్నదని, అలాగే సూర్యాపేట రూరల్ మండలంలో 1654 రేషన్ కార్డ్స్, 740 ఇందిరమ్మ ఇల్లు మంజూరి పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులు రాని వారు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, కొత్త కార్డుకు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉంటే తహసీల్దార్ పరిశీలించి పౌర సరఫరాల శాఖ ద్వారా కార్డు మంజూరు చేస్తారని తెలిపారు. సన్నబియ్యం పంపిణిలో రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం 400 నుంచి 600 చదరపు అడుగులలోపే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని చెప్పారు. ముగ్గులు పోసిన తర్వాత ఫొటో క్యాప్చర్ చేస్తామని, బేస్ మెంట్ పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ లెవెల్ గోడలు పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తి కాగానే 2 లక్షల రూపాయలు, ఇల్లు పూర్తి కాగానే లక్ష రూపాయలు ఇలా నాలుగు దశలలో 5 లక్షల రూపాయలను ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణం ప్రారంభించుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కొరకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తుందని, ట్రాన్స్ పోర్ట్ ఖర్చులు లబ్ధిదారులు భరించాలని, తాపీ మేస్త్రీలు, సిమెంటు,ఇనుము తదితర నిర్మాణసామాగ్రి ధరలు అదుపులో ఉంచేందుకు మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేశామని, ఈ బృందం సమావేశం ఏర్పాటు చేసుకొని మేస్త్రీలతో, వ్యాపారస్తులతో మాట్లాడి ధరలను అదుపులో ఉంచేలా చూస్తుందని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే మండల స్థాయిలో హౌసింగ్ ఏఈని, గ్రామస్థాయిలో గ్రామ సెక్రటరీని సంప్రదించాలని, నిర్మాణాలు పూర్తయిన ఇండ్లను పరిశీలించి ప్రతివారం నగదును లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ పేదవారి ఆత్మ గౌరవనికి రేషన్ కార్డులు చిహ్నమని అన్నారు. సూర్యాపేట జిల్లా నుండే సన్నబియ్యం, నూతన్ రేషన్ కార్డులు పంపిణీ ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ నాయకుడు ఆలోచించని విధంగా ధనవంతులతో పాటు, పేదవారు సన్న బియ్యం తినాలనే ఆలోచన మన ముఖ్యమంత్రికి,మంత్రికి రావటం వారి గొప్పతనమని కొనియాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వాలని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 20 లక్షల ఇండ్లు నిర్మించారని, తిరిగి ఇప్పుడు నియోజవర్గానికి 3500 చొప్పున మొత్తం 5 సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి పేదవాడికి కడుపునిండా భోజనం అందించడానికే సన్న బియ్యం అందిస్తున్నామని, ఆరోగ్య శ్రీ ద్వారా 10 లక్షల వైద్య ఖర్చులు అందిస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 రూపాయలకు ఎల్పిజి గ్యాస్, రైతు రుణమాఫీ అమలు చేశామని, సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చామని, వ్యవసాయం దండగ అన్న దాన్ని పండగ చేసి చూపించామని చెప్పారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ నూతన రేషన్ కార్డులు ఇవ్వటం, అలాగే సన్నబియ్యం ఇవ్వటం చాలా సంతోషమని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రేషన్ కార్డు లో ఎంతమంది ఉన్నా నలుగురికి మాత్రమే 4 కేజీల చొప్పున బియ్యం ఇచ్చారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత కార్డులో ఉన్న అందరికి 6 కేజీల చొప్పున ఇచ్చామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసాక అన్ని అమలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు ఇల్లు త్వరగా పూర్తి చేసుకొని గృహప్రవేశానికి తనను ఆహ్వానించాలని కోరారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అర్హత ఉన్న ప్రతి పేదవాడికి అందేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డిఎస్ఓ మోహన్ బాబు, హౌసింగ్ పిడి జి. సిద్ధార్థ, డిఈ జబ్బార్ అహ్మద్, ఏఈ పి. రాంబాబు, హౌసింగ్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 18 నుండి రెండో విడత ఎంపికైన లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ



- జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 16 (జనం సాక్షి) :** లైసెన్స్ సర్వేయర్ల రెండో విడతలో ఎంపికైన 130 మంది అభ్యర్థులకు 50 రోజుల శిక్షణ ఆగస్టు 18 నుండి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ ,హైదరాబాద్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుచున్నదని తెలిపారు. ఈ సందర్భంగా రెండవ విడతలో ఎంపికైన 130 మంది లైసెన్స్ సర్వేయర్లకు ఈనెల 18 నుండి 22 వరకుశిక్షణ మొత్తం 50 పనిదినాలు గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు ఈనెల18న ఉదయం 10 గంటలకు పాత ఎంపీడీవో కార్యాలయం,అంబేద్కర్ చౌక్, గద్వాల జిల్లా కేంద్రంలోని మీటింగ్ హాల్ వద్ద హాజరు కావాలని అన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, ప్రభుత్వ సివిల్ సర్జన్ జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికేట్,రెండు తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావలసి ఉంటుందని పేర్కొన్నారు. మొదటి విడతలో శిక్షణ పొంది పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణత సాధించని లైసెన్స్ సర్వేయర్ అభ్యర్థులు తాము ఫెయిల్ అయిన సబ్జెక్టులకు మాత్రమే సప్లిమెంటరీ పరీక్షలు రాయవలసి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు జిల్లా సర్వే కార్యాలయం,జోగులాంబ గద్వాల లేదా 9849720811, 9985866499 నంబర్లను సంప్రదించగలరని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## అసత్యపు చేరికలతో బీజేపీ ఆర్భాటం

- పార్టీ చేరికల ఫ్లెక్సీలు కాంగ్రెస్ కార్యకర్తల ఫోటోలు
- ఉనికిని కాపాడుకునేందుకు ఉత్తుత్తి చేరికలు

**రేవల్లి, ఆగస్టు 16 (జనంసాక్షి) :** బిజెపి పార్టీ నాయకులు తమ గ్రామాలలో ఉనికిని చాటుకునేందుకు ఉత్తుత్తి చేరికల కార్యక్రమాలు చేపట్టి ఆ పార్టీ అధినాయకులను తప్పుదోవ పట్టిస్తున్నారు. శనివారం ఏదుల మండల కేంద్రంలో నిర్వహించిన బిజెపి పార్టీ చేరికల కార్యక్రమ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సగానికి పైగా కాంగ్రెస్ కార్యకర్తల ఫోటోలు ఉండడం గమనార్హం. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షించి, ప్రతిపక్షాల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారే తప్ప ప్రతిపక్షాల వైపు ప్రజలు మొగ్గు చూపడం లేదని ఇటువంటి తప్పుడు చేరికల ప్రచారాలను బిజెపి ఇకపై చేయకూడదని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలో తమకు సంబంధం లేకుండానే తమ ఫోటోలను బోయ బాలరాజు, రాముడు, ఎర్రముని సైదులు, కుందేల రాజు, బోయ జోగయ్య, బోయ భగవంతు మేమందరము కూడా ఏ పార్టీలో చేరలేదని, మా అనుమతి లేకుండానే ఫ్లెక్సీలో ఫోటోలు వేసుకున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాత్తు బిజెపి ఎంపీ డీకే అరుణ సమక్షంలోనే ఈ తతంగం జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**సంగారెడ్డి, ఆగస్టు 16 (జనం సాక్షి) :** గతి తప్పిన జగతిని ప్రగతి మార్గాన నడిపించడానికి మానవ అవతారమెత్తి, ఆధ్యాత్మిక భావసంపదను పాదుకొల్పి జగద్గురువుగా భాసిల్లుతున్న కృష్ణ భగవానుని జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరుగనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలు వారు నిర్వహిస్తున్న కృష్ణ గోపిక వేశాధారణ అందరికీ సాక్షాత్కరింపచేస్తున్నాయి. మునిపల్లి మండలంలోని యూనైటెడ్ పాఠశాల, సంగారెడ్డి లోని వివిధ పాఠశాలలో చిన్నారులు సాక్షాత్తు చిన్ని కృష్ణుని తలపిస్తూ ఆనంద తాండవం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసర సమయంలో తప్ప ప్రజలు బయటకు రాకూడదు
- ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**నర్సాపూర్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు శనివారం నర్సాపూర్ పట్టణంలోని రాయరావు చెరువు నిండుకుండలా మారి అలుగు పారుతున్నందున కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి పరిశీలించారు అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6, 7 వార్డుల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పాడుబడ్డ ఇండ్లలో ప్రజలు ఎవరు కూడా నివాసం ఉండకూడదని ప్రజలకు ఆయన సూచించారు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన ప్రజలకు తెలిపారు ఎడతెరపు లేకుండా కురుస్తున్నందున అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిలను తెలుసుకొని పర్యవేక్షించాలని ఆయన అధికారలను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో మైపాల్ రెడ్డి తాసిల్దార్ శ్రీనివాస్ మునిసిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి ఆర్ ఐ పైజాల్ ఎస్సై లింగం నాయకులు మురళీధర్ యాదవ్ రమణారావు రిజ్వాన్ దేవేందర్ యాదవ్ అజ్మత్ సురేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

## రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా భారీ వర్షాల కారణంగా చర్ల తిరుమలాపూర్ వెళ్ళే రోడ్డు మీదకు వరద నీరు చేరడంతో గ్రామానికి రాకపోకలు బంద్ అవ్వడం జరిగింది. ఈరోజు ఎమ్మెల్యే స్వయంగా వెళ్ళి పరిశీలించి అందుకు ప్రత్యామ్నాయంగా చర్ల తిరుమలాపూర్ నుంచి చర్ల ఇటిక్యాల మీదుగా నాగర్ కర్నూల్ పట్టణానికి వచ్చే రోడ్డును మరమ్మతులు చేసి గ్రామస్థులకు రోడ్డు సదుపాయం కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ ఈ.ఈ. విజయ్ కుమార్ ని ఆదేశించడం జరిగింది. ఇందుకు గాను గ్రామస్థులు ఎమ్మెల్యే కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్ల తిరుమలాపూర్ గ్రామస్థులు సంభధిత అధికారులు ఉన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు





**చారకొండ, ఆగస్టు 16 (జనంసాక్షి) :** మండలం కేంద్రంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి చిన్నారులకు కృష్ణుడు గోపికల వేషధరణలతో ముస్తాబై ఆనందంగా గడిపారు. ఉట్టి కొట్టి చిన్నారులు సంబరపడ్డారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణుడికి పూజలు చేశారు. గ్రామాలలో చిన్నారులకు కృష్ణుడి వేషాదారంలో పాల్గొని అందర్నీ ఆకట్టుకున్నారు. మహిళలు గోపికల వేషధారణలతో అలరించారు. అయోధ్య నగర్ శ్రీ శిరసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో, శ్రీకృష్ణుని జానపద కీర్తనలతో వినిపించాయి. సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. భక్తులు విస్తారంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామాలలో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ పాల్గొని పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## పాలమూరు యూనివర్సిటీలో అట్టహాసంగా సాగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యం లో నిర్వహించినటువంటి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమాన్ని పురస్కరించుకొని పీజీ కాలేజ్ గ్రౌండ్లో ఉట్టి కొట్టె కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఉట్టి కొట్టె కార్యక్రమం లో విద్యార్థులు పెద్ద ఎత్తున్న ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాలమూరు యూనివర్సిటీ ఏబీవీపి శాఖ ప్రెసిడెంట్ నాగేష్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మ వత్తాంతం దాని ప్రాధాన్యత శ్రీకృష్ణుడు ఈ జగతికి చేసినటువంటి గీత బోధ మానవ జీవిత పరమార్తానీ గురించి కృష్ణుడు చెప్పిన విషయాలను వివరించారు. శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వివరిస్తూ కృష్ణుడు కారాగారంలో పుట్టి కష్టాలను నోర్చి ఎన్నో నింద ఆపనిదాలకొర్చి జగతిన ధర్మ ప్రధాన్యాని వివరించిన తిరును వివరించారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వేణుగోపాల్ మాట్లాడుతూ యువతకి శ్రీకృష్ణుడు ఆదర్శప్రాయం అని నేటి యువత శ్రీకృష్ణుని మార్గదర్శకంగా తీసుకోవాలని కోరుకుంటూ కృష్ణుని జన్మ బృందాన్ని వివరిస్తూ కృష్ణుడు జైల్లో పుట్టి అయినవాళ్ల ఆదరణకి నోచుకోక అవమానాలను ఓర్చుకోనీ ధర్మ సంస్థాపన నార్థం పుతన వద నుంచి కంసుడి మరణం కురుపాండవుల కురుక్షేత్రం లో ధర్మపక్షపాతై కురు వంశాని సంరక్షిస్తూ తన వంశం నాశనం అవుతుందని గాంధారి శాపం పెట్టిన చిరునవ్వుతో స్వీకరించి జగతిన ధర్మానికి భవిష్యత్ తరాలకు మార్గదర్శకం అయ్యిండు అని వివరించడం జరిగింది .కార్యక్రమం లో పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి నాయకులు , స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ సంగీత , సెక్రటరీ రవితేజ , గోపాల్, హరికృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల ప్రజల కళ్ళల్లో వెలుగు చూడాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



**పెన్‌పహాడ్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** పేద ప్రజల కళ్ళల్లో వెలుగు చూడాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని అన్నారం బ్రిడ్జి గ్రామం జె ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు గొప్పవరమన్నారు. ఇండ్ల పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ముగ్గులు పోసుకొని ఇల్లు కట్టుకోవడం ప్రారంభించాలని కోరారు. పేదవారి ఆత్మ గౌరవానికి రేషన్ కార్డులు చిహ్నం అని అన్నారు. రేషన్ కార్డులతో పాటు, సన్న బియ్యం లాంటి గొప్ప పథకాలు సూర్యాపేట జిల్లా నుండే ప్రారంభం కావడం జిల్లా వాసుల అదృష్టమని అన్నారు. పేదవారు సైతం సన్నబియ్యంతో భోజనం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ నూతన రేషన్ కార్డులు ఇవ్వటం అలాగే సన్నబియ్యం ఇవ్వటం చాలా సంతోషం అని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు ఇల్లు త్వరగా పూర్తి చేసుకొని గృహప్రవేశం చేసుకొని సంతోషంగా ఉండాలని కోరారు. పెన్‌పహాడ్ మండలం లో1477 నూతన రేషన్ కార్డులతో కలిపి మొత్తం 14225 కార్డులన్నారు. 613 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, ఆర్డీఓ వేణుమాధవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మండల ఇంచార్జ్ అధికారి అండ్ ఎస్టి సంక్షేమ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ నాయక్, డి ఎస్ ఓ మోహన్ బాబు, పి డి హౌసింగ్ జి. సిద్ధార్థ, డి ఇ జబ్బార్ అహ్మద్, ఏ. ఇ పి రాంబాబు, హౌసింగ్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల తెలంగాణ ఇంకా రాలే..!

- తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి) :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు తెలంగాణ ఇంకా రాలేదని ఆచార్య జయశంకర్ విశ్వకర్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కే బ్రహ్మయ్య అన్నారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని తిమ్మసానిపల్లి లోని తన నివాసంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ విశ్వకర్మ సేవా సమితి ఏర్పాటు చేశాక ఆయన సిద్ధాంతాలకు అనుగుణంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. జయశంకర్ ఆశయాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం లేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక సగభాగం మాత్రమే అభివృద్ధి జరిగిందని విపరీతమైన హామీలు ఇచ్చారని ఆ హామీలను నెరవేర్చడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం రాకముందు ఒకలాగా వచ్చాక ఒకలాగా ప్రవర్తిస్తోందన్నారు. ప్రతి ఒక్కరం హక్కుల కోసం పోరాడదాం అన్నారు విద్య ఉపాధి విషయాలలో నిర్ణయాలు సరిగా లేవన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫలాలు ఎవరికి అందడం లేదన్నారు 33 జిల్లాలలో అన్ని పథకాలు అమలు కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమ సంఘం ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. ప్రస్తుతం ఉన్న కొన్ని సంఘాలు రాజకీయాల వైపు ప్రయాణం చేస్తున్నాయని వెల్లడించారు. గ్రామాలను ప్రజాప్రతినిధులు దత్తత తీసుకోవాలన్నారు. అన్ని ఫలాలు అందరికీ అందాలన్నదే ప్రొఫెసర్ జయశంకర్ లక్ష్యం అన్నారు. బ్యాంకులు ఇట్లాంటి షూరిటీలు లేకుండా లోన్స్ ఇవ్వాలని దానికి మీడియా సహకారం కూడా కావాలన్నారు కార్మికులకు న్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి అన్నారు. సాధించుకున్న తెలంగాణలో ఊహించిన తెలంగాణ ఏర్పడలేదని అది ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు విరుద్ధమని తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. ఆచార్య జయశంకర్ తొలిదశ మలిదశ ఉద్యమాలలో విస్తృతంగా పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో గెలవనరుల దోపిడీ జరుగుతుందని తెలంగాణ రాక మునుపు కూడా ఇదే రకమైనటువంటి దోపిడీ జరిగిందన్నారు. తెలంగాణలో ఒక్క ఎకరా కూడా ఎండ కూడదన్నదే జయశంకర్ లక్ష్యం అని వెల్లడించారు. యువత ఉద్యోగాలు లేక జీవిస్తున్నారని తెలంగాణ యువత ఉద్యమంలో ముందున్నారని శ్రీకాంత్ ఆచారి పోలీస్ కృష్ణయ్య త్యాగాలు ఎంతో గొప్పవని అన్నారు. వారి త్యాగాలు తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతగానో ఉపయోగపడ్డావని అన్నారు. రాజకీయంగా ఒత్తిడి తెచ్చి రాజ్యాంగబద్ధంగా తెలంగాణ సాధించుకోవడంలో ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప పాత్ర పోషించారన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ తీసుకురావాలని నిరుద్యోగ భృతి ఇవ్వాలని ప్రోత్సాహకాలు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలన్నారు. బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని అప్పుడే జయశంకర్ ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు.




### ఈ బ్యాట్‌మాన్ ఎడిషన్

# కేవలం 300 మందికే..




**జనంసాక్షి:**మహీంద్రా మహీంద్రా దేశీయ మార్కెట్లో 'బీఈ 6 బ్యాట్ మాన్' ఎడిషన్ లాంచ్ చేసింది. ఈ కారు ధర రూ.27.79 లక్షలు. కంపెనీ ఈ మోడల్ కోసం ఆగస్టు 23 నుంచి బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించనుంది .డెలివరీలు సెప్టెంబర్ 20న బ్యాట మ్యాన్ డే సందర్భంగా మొదల వుతాయి. కాగా సంస్థ దీనిని 300 యూనిట్లకు మాత్రమే పరిమితం చేసింది. అంటే దీనిని 300 మంది కస్టమర్లు మాత్రమే కొనుగోలు చేయడానికి సాధ్యమవుతుంది. మహీంద్రా బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్.. కస్టమ్ శాటిన్ బ్లాక్ బాడీ కలర్‌తో వస్తుంది. ముందు డోర్స్ మీద బ్యాట్‌మ్యాన్ డెకాల్స్, టెయిల్‌గేట్‌పై డార్క్ నైట్ బ్యాడ్జ్, ఫెండర్‌పై బ్యాట్‌మ్యాన్ లోగో, బంపర్ రివర్స్ లాంప్ ఉన్నాయి. బ్రేక్‌లు, స్ప్రింగ్‌లు ఆల్కెమీ గోల్డ్ పెయింట్ పొందాయి. ఇది చూడగానే ఒక సూపర్ హీరోను గుర్తుకు తెస్తుంది.మహీంద్రా బ్యాట్‌మ్యాన్ ఎడిషన్.. 79 బ్యాటరీ ప్యాక్‌తో.. ఒకే ఫుల్ ఛార్జ్‌పై 682 కి.మీ రేంజ్ అందిస్తుంది. ఇందులోని ఎలక్ట్రిక్ మోటారు 286 హార్స్ పవర్, 380 న్యూటన్ మీటర్ టార్క్ ఉత్పత్తి చేస్తాయి. పనితీరు పరంగా ఉత్తమంగా ఉంటుందని సమాచారం. మహీంద్రా బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ లోపల కూడా అద్భుతమైన ఇంటీరియర్ డిజైన్ పొందుతుంది. డాష్‌బోర్డ్‌పై ఆల్కెమీ గోల్డ్‌లో నంబర్ ఉన్న బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ ప్లేక్, ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్ కోసం చార్‌కోల్ లెదర్ గోల్డ్ సెపియా స్టిచింగ్‌తో కూడిన స్వెడ్ లెదర్ అపోల్ స్ట్రే వంటివి ఉన్నాయి. .

## చార్జింగ్ కేంద్రాలు పెరిగితే మరిన్ని రయ్ రయ్

### హైదరాబాద్‌లో ఈ-వాహనాలదే హవా

హైదరాబాద్(జనంసాక్షి):గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ- బండి టాప్‌గేర్‌లో పరుగులు తీస్తోంది. ఈవీలపై జీవితకాల పన్ను మినహాయింపుతో ఈ ఏడాది ఇప్పటి వరకు లక్షకుపైగా ద్విచక్ర వాహనాలు, 22 వేల కార్లు రోడ్డెక్కాయి. కొంతకాలంగా ఈ రెండు కేటగిరీలకు చెందిన వాహనాల అమ్మకాలు ఊపందుకున్నట్లు ఆటోమొబైల్ వర్గాలు తెలిపాయి.ఈ సంవత్సరం కేంద్రం ప్రకటించిన ప్రోత్సాహకాలు కూడా ఎలక్ట్రిక్ వాహనాల దూకుడు పెరిగేందుకు దోహదం చేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంధన ధరలు భారంగా మారుతున్న దృష్ట్యా సామాన్య, మధ్యతరగతి వర్గాలు క్రమంగా పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ఈవీలకు మారుతున్నారు. గ్రేటర్‌లో ఈ నెల 10 నాటికి 1,88,549 ద్విచక్ర వాహనాలు, 22,365 కార్లు నమోదైనట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు. కొత్తగా 5,097 ఆటోలు, మరో 5,363 తేలికపాటి వస్తు రవాణా వాహనాలు రోడ్డెక్కాయి. వివిధ కేటగిరీల్లో మొత్తం 2,21,374 ఎలక్ట్రిక్ వాహనాలు ఇప్పటి వరకు నమోదైనట్లు అధికారులు చెప్పారు.


# తగ్గిన బంగారం స్మగ్లింగ్

- 2023-24ల్లో 240 కేసులు నమోదు
- గత ఆర్థిక సంవత్సరం ఇది 133కు తగ్గుదల
- కేంద్రం ఇంపోర్ట్ డ్యూటీని తగ్గించడమే కారణం
- గణనీయంగా పెరిగిన సిగరెట్ల అక్రమ రవాణా
- మూడు రెట్లు అధికంగా వీటి సంబంధిత కేసులు



రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 240 కేసులు నమోదు చేశారు. వీటికి సంబంధించి 132.4 కేజీల పసిడి స్వాధీనం చేసుకున్నారు. 2024-25 నాటికి కేసుల సంఖ్య 133కి, సీజ్ చేసిన బంగారం 42.5 కేజీలకు తగ్గిపోయింది. కేంద్రం ఇంపోర్ట్ డ్యూటీని 15 నుంచి 6%కు తగ్గించడమే దీనికి కారణమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో సిగరెట్ల అక్రమ రవాణా మాత్రం గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

న్యూఢిల్లీ(జనంసాక్షి): విదేశాల నుంచి అక్రమ రవాణా అవుతున్న బంగారానికి సంబంధించి శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 240 కేసులు నమోదు చేశారు. వీటికి సంబంధించి 132.4 కేజీల పసిడి స్వాధీనం చేసుకున్నారు. 2024-25 నాటికి కేసుల సంఖ్య 133కి, సీజ్ చేసిన బంగారం 42.5 కేజీలకు తగ్గిపోయింది. కేంద్రం ఇంపోర్ట్ డ్యూటీని 15 నుంచి ఆరు శాతానికి తగ్గించడమే దీనికి కారణమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో సిగరెట్ల అక్రమ రవాణా మాత్రం గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దుబాయ్ హవాలా రాకెట్లతో పాటు ఇప్పుడు బంగారం అక్రమ రవాణాకూ కేంద్రంగా మారిపోయింది. దీంతో పాటు జెద్దా, మస్కట్, కువైట్, బహ్రేన్ నుంచి స్మగ్లింగ్ అవుతుంటుంది. ఆయా దేశాల్లో ఆదాయపు పన్ను విధానం లేకపోవడంతో మనీలాండరింగ్ అనేదే ఉత్పన్నం కాదు. దీంతో ఇక్కడ నుంచి హవాలా ద్వారా నల్లధనాన్ని అక్కడకు పంపే స్మగ్లర్లు దాన్ని బంగారంగా మార్చి ఇక్కడకు తీసుకు వస్తుంటారు.ప్రస్తుతం నగరంలో 24 క్యారెట్ల బంగారం కేజీ రూ.కోటి వరకు పలుకుతోంది. ఆయా దేశాల్లో దీని ఖరీదు ఐదు నుంచి ఏడు శాతం తక్కువగా ఉంటుంది. కేజీ బంగారాన్ని స్మగ్లింగ్ చేయడానికి సూత్రధారులు రూ.7 లక్షల వరకు ఖర్చు చేస్తారు. గతంలో విదేశాల నుంచి తీసుకువచ్చే బంగారంపై 15 శాతం ఇంపోర్ట్ డ్యూటీ ఉండేది. దీన్ని కేంద్ర ప్రభుత్వం ఆరు శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో విదేశాల నుంచి అక్రమ రవాణా చేసి తీసుకువచ్చినా, నేరుగా తీసుకువచ్చినా వచ్చే లాభంలో పెద్ద తేడా లేకపోవడంతో స్మగ్లింగ్ గణనీయంగా తగ్గింది. బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులు, మాదకద్రవ్యాలు... అక్రమ రవాణా పేరు చెప్పగానే ఇవే గుర్తుకొస్తాయి. అయితే సిగరెట్లు కూడా పెద్ద సంఖ్యలో స్మగ్లింగ్ అవుతున్నాయి. 2023-24లో కేవలం 54 కేసులు నమోదు కాగా... గత ఆర్థిక సంవత్సరానికి ఈ సంఖ్య 175కు చేరింది. హైదరాబాద్ నగరానికి అక్రమ రవాణా అవుతున్న సిగరెట్లలో రెండు బ్రాండ్లే ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.




## ఈసీఎఫ్‌వో.. ఇకపై ఆలస్యానికి చెక్




లక్షలాది మంది చందాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ పనిచేస్తోంది. ఇందులో భాగంగానే ఆధార్‌ను యూనివర్సల్ అకౌంట్ నంబర్‌తో అనుసంధానించడంలో ఉన్న ఇబ్బందులను సరళీకృతం చేస్తూ..ప్రాసెస్‌ను మరింత సులభతరం చేసింది.ఆగస్టు 13, 2025 నాటి సర్క్యులర్ ప్రకారంలో సభ్యుని పేరు, లింగం, పుట్టిన తేదీ ఆధార్‌తో సరిగ్గా సరిపోలితే, యజమాని పోర్టల్‌లోని కేవైసీ ఫంక్షనాలిటీ ద్వారా నేరుగా ఆధార్‌ను సీడ్ చేయవచ్చు. దీనికి ఈపీఎఫ్ఓ నుంచి ప్రత్యేకంగా ఆమోదం పొందాల్సిన అవసరం లేదు. అన్నీ సరిగ్గా ఉంటే ఆలస్యానికి ఆస్కారం లేదు. యూనివర్సల్ అకౌంట్ నంబర్ అనేది ప్రతి సభ్యునికి ఈపీఎఫ్ఓ కేటాయించిన 12 అంకెల ఐడెంటిఫైయర్. వ్యక్తి ఉద్యోగాలు మారినప్పటికీ నెంబర్ మాత్రం అలాగే ఉంటుంది. ఆధార్‌ను %ఖాూచీ%కి లింక్ చేయడం వలన సభ్యులు నేరుగా సేవలను పొందగలుగుతారు. కానీ ఆధార్ డేటా.. యూఐడీఏఐ ద్వారా ధృవీకరణ పొందాల్సిన అవసరం ఉందని తప్పకుండా గమనించాలి.





## కస్టమర్లకు షాకిచ్చిన ఎస్‌బీఐ

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**రుణాలను చౌకగా చేయడానికి ఓవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయత్నిస్తుంటే మరోవైపు దేశంలో అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాత్రం రుణ గ్రహీతకు వింత షాకిచ్చిం ది.ఆర్బీఐ ఇటీవల రెపో రేటును 5.5 శాతానికి తగ్గించి నప్పటికీ, ఎస్‌బీఐ గృహ రుణ వడ్డీ రేట్లను పెంచి ఆశ్చర్యపరిచింది. ఈ బ్యాం క్‌లో కొత్త రుణ గ్రహీతలకు వడ్డీ రేటు ఇప్పుడు 25 బేసిస్ పాయింట్లు పెరగనుంది.ఎస్‌బీఐ హోమ్ లోన్ వడ్డీ రేట్ల గరిష్ట పరిమితిని 25 బేసిస్ పాయింట్లు పెంచింది. లోయర్ ఎండ్ 7.50 శాతం వద్ద కొనసాగుతుండగా, ఎగువ బ్యాండ్ 8.45 శాతం నుంచి 8.70 శాతా నికి పెరిగింది. ఈ మార్పు తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న రుణగ్రహీతలను ఎక్కువగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రస్తుతం 7.35 శాతం నుండి ప్రారంభమయ్యే వడ్డీ రేట్లతో గృహ రుణాలను అందిస్తున్నాయి. ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ఎస్‌బీఐ బాటలో పయనించే అవకాశం ఉంది. ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఆర్బీఐ రెపో రేటును వరుసగా మూడుసార్లు తగ్గించింది. ఆర్బీఐ రెపో రేటును తగ్గించడం వల్ల గృహ రుణాలతో సహా రుణాలపై వడ్డీ రేట్లు తగ్గడం వల్ల పరోక్షంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.


## ఐదు ఏఐ కోర్సులు.. పూర్తిగా ఉచితం

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు డిమాండ్ పెరుగుతోం ది. చాలామంది ఇందులో కొత్తగా నైపుణ్యాలను పెంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యా మంత్రిత్వ శాఖ 'స్వయం పోర్టల్'లో ఫ్రీ ఏఐ కోర్సులను అందిస్తోంది.వివిధ పరిశ్రమలలో ఏఐ ప్రాముఖ్యత పెరుగుతున్న సమయంలో ఈ కోర్సులు చాలా ఉప యోగకరంగా ఉంటాయి.ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ వంటి వాటికి సంబంధించిన ప్రాథమిక అంశాలను పరిచయం చేస్తారు. ఇందులో స్టాటిస్టిక్స్, లీనియర్ ఆల్జీబ్రా, ఆప్టిమైజేషన్, డేటా విజువలైజేషన్ వంటివి నేర్చుకోవడానికి అవకాశం ఉంది. అంతే కాకుండా.. డేటా సైన్స్‌లో విస్తృతంగా ఉపయోగించే ప్రోగ్రామింగ్ భాషలలో ఒకటైన పైథాన్‌ను కూడా కవర్ చేస్తుంది. కోర్సు పూర్తయిన తరువాత చివరిలో సర్టిఫికేషన్ ఇవ్వడం జరుగుతుంది.



# అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి

### ఉక్రెయిన్ శాంతి చర్చలు అర్థరహితమేనా?




**వాషింగ్టన్(జనంసాక్షి):**ఏదో అనుకుంటే.. ఇంకేదో జరిగింది. శాంతి చర్చల్లో ముందడుగు పడకపోతే కఠినంగా వ్యవహరిస్తానంటూ రష్యాపై రంకెలు వేసిన ట్రంప్.. అలస్కా చర్చల తర్వాత కాస్త మెత్తబడ్డాడు.ఉక్రెయిన్ శాంతి చర్చలు అర్థరహితంగా ముగిసినట్లు వాళ్ల ప్రకటనలను బట్టి స్పష్టమవుతోంది. ఈ క్రమంలో.. ట్రంప్ ఇంకా అలస్కాలో ఉండగానే పుతిన్ అక్కడి నుంచి నిష్క్రమించడం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే.. అలస్కాలో జర్నలిస్టులు సంధించిన ప్రశ్నలను ఇరు దేశాల అధినేతలు స్వీకరించలేదు. తాము చెప్పాలనుకున్నది చెప్పి.. తలోదారి వెళ్లిపోయారు. యాంకరేజ్ విమానాశ్రయంలో, అలాగే చర్చలు ప్రారంభం కావడానికి ముందు పీస్ రూమ్‌లోనూ ఇరు దేశాధినేతలు మీడియా ముందు ఆసీనులయ్యారు. ఆ సమయంలో ఉక్రెయిన్ కాల్పుల విరమణ, యుద్ధంలో సాధారణ పౌరులు మరణించడం లాంటి ప్రశ్నలు పుతిన్‌కు ఎదురయ్యాయి."సాధారణ పౌరుల్ని చంపడం ఇంకెప్పుడు ఆపుతారు?" అంటూ ఓ జర్నలిస్ట్ ప్రశ్నించగా.. దానికి పుతిన్ తనకేమీ వినబడడం లేదన్నట్లు సైగ చేసి చూపించారు. అదే సమయంలో "ట్రంప్ మిమ్మల్ని మాత్రమే ఎందుకు నమ్ముతున్నారు?" అని మరో విలేఖరి ప్రశ్నించగా.. జర్నలిస్టుల గోలతో పుతిన్ ఇచ్చిన వివరణ వినిపించనట్లే కనిపించింది. పుతిన్‌పై అంతర్జాతీయ నేరస్థుల కోర్టు కేసు ఉన్నప్పటికీ.. అమెరికా భూభాగంలోకి ఎందుకు ఆహ్వానించారు?. ఉక్రెయిన్‌ను నేరుగా భాగం కానీయకుండా కాల్పులవిరమణ డీల్ కుదర్చాలని ట్రంప్ భావిస్తున్నారా?. పుతిన్ ఎలాంటి రాయితీలు ఇవ్వవచ్చు? ట్రంప్ ఏమి అంగీకరించవచ్చు? ఇది యుద్ధ విరామానికి దారి తీస్తుందా? లేదంటే రాజకీయ నాటకం మాత్రమేనా? అని ప్రశ్నలు గుప్పించారు. అయితే వీటిలో వేటికి సమాధానాలు రాలేదు. దీంతో.. సోషల్ మీడియా సదరు జర్నలిస్టుల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతోంది. ఇవే ప్రశ్నలను గాజాపై యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహును అడిగే దమ్ముందా? అని నిలదీస్తోంది. "2023 అక్టోబర్ 7వ తేదీన గాజా యుద్ధం మొదలైంది. ఇజ్రాయెల్ దాడులతో ఇప్పటిదాకా 60 వేలమందికిపైనే మరణించారు. అందులో 70 శాతం మహిళలు, చిన్నారులే ఉన్నారని నివేదికలు గణాంకాలతో సహా చెబుతున్నాయి. అయితే ఈ మరణాలపై నెతన్యాహు ఏనాడూ స్పందించగా పోగా.. కనీసం విచారం కూడా ?వ్యక్తం చేసింది లేదు. పైగా ఎంతసేపు హమాస్ అంతమే శాంతికి మార్గం అంటూ చెబుతూ వస్తున్నారు. దీనికి తోడు మానవతా సాయం అందకుండా చేశారనే ఆరోపణలు ఆయపై ఉన్నాయి. ఈ క్రమంలో యుద్ధ నేరాల కింద అంతర్జాతీయ న్యాయస్థానం నెతన్యాహుపై వారెంట్ సైతం జారీ చేసింది.ఈ పరిణామాలపై ఇటు ఇజ్రాయెల్.. అటు అమెరికా జర్నలిస్టులెవరూ ఆయన్ని ప్రశ్నించే సాహసం చేయలేకపోయారు. మరోవైపు.. రెండుసార్లు నెతన్యాహు అమెరికా పర్యటనకు వచ్చారు. ఆ సమయంలోనూ జర్నలిస్టులెవరూ.. గాజా పౌరుల మరణాల గురించి ఎందుకు నిలదీయలేదు?" అని సోషల్ మీడియా కోడై కూస్తోంది.ఇదిలా ఉంటే.. 2022 ఫిబ్రవరిలో మొదలైన ఉక్రెయిన్ రష్యా యుద్ధంలో లక్షల మంది మరణించారు. మూడున్నరేళ్ల యుద్ధానికి ఫుల్‌స్టాప్ పెట్టే ఉద్దేశంలో పర్స్యూయింగ్ పీస్ పేరిట అలస్కా చర్చల్లో పాల్గొన్నారు. ట్రంప్-పుతిన్‌లు ఐదారుగంటలు అలస్కాలోనే గడపగా.. రెండున్నర గంటలపాటు చర్చలు జరిగాయి. అయితే.. ఉక్రెయిన్ కాల్పుల విరమణకు అమెరికా అధ్యక్షుడు పట్టుబట్టగా.. అందుకు రష్యా అధినేత ఏమాత్రం సానుకూలంగా స్పందించలేదని తెలుస్తోంది.భేటీకి ముందు జర్నలిస్టుల ప్రశ్నలకు స్పందించని ఇరువురు నేతలు.. సంయుక్తంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లోనూ మీడియా ప్రతినిధులను ప్రశ్నలకు అనుమతించలేదు. మరోవైపు.. అలస్కా చర్చల సారాంశం కోసం రష్యా అధికారుల బృందాన్ని పలువురు జర్నలిస్టులు కలిసే ప్రయత్నమూ విఫలమైంది. అదే సమయంలో.. ట్రంప్ తన అనుకూల రిపోర్టర్లతో పుతిన్‌పై ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసే ప్రయత్నం చేశారని, దాని నుంచి పుతిన్ భలేగా తప్పించుకున్నారనే వాదన నెట్టింట నడుస్తోంది. అలస్కాలో ట్రంప్ దౌత్యం విఫలమేనని కొన్ని అమెరికన్ మీడియా చానెల్స్ ప్రముఖంగా చర్చిస్తున్నాయి. కానీ, ట్రంప్ మాత్రం ఎంతో కొంత పురోగతి సాధించాం అని చెబుతుండడం గమనార్హం. "పుతిన్ చాలా టఫ్, స్ట్రాంగ్ ఫెల్లో. ఇక దారికి రావాల్సింది జెలెన్‌స్కీనే' అన్నట్లు ఫ్యాక్స్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడారు. ఇంకోవైపు.. అలస్కాలో ట్రంప్-పుతిన్ భేటీలో రష్యా అనుకూల ఏకపక్ష డీల్ కుదరనందుకు సంతోషమంటూ ఉక్రెయిన్? ఎద్దేవా ప్రకటన విడుదల చేసింది.

## ట్రంప్ ఓవరాక్షన్ ప్లాన్..

### ఇరువురి భేటి సందర్భంగా పుతిన్‌నే భయపెట్టే ప్రయత్నం!

**అలాస్కా,జనంసాక్షి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ కలిసిన వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమెరికా ఎంత బలమైన దేశమో.. చెప్పేందుకు పుతిన్‌కు చూపించాలనే ఉద్దేశ్యంతో ట్రంప్ పెద్ద ప్లానే చేశారు. పుతిన్‌ను ట్రంప్ ఆహ్వానిస్తున్న సమయంలో స్టెల్త్ బాంబర్లు, ఫైటర్ జెట్స్ విమానాలు గాల్లో చక్కర్లు కొట్టాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కోసం రష్యా అధ్యక్షుడు పుతిన్ అమెరికాకు వెళ్లారు. ఈ సందర్భంగా విమానం దిగిన పుతిన్‌కు ట్రంప్ ఘన స్వాగతం పలికారు. అయితే, వారిద్దరూ ముందుకు సాగుతున్న సమయంలో అనూహ్యంగా స్టెల్త్ బాంబర్లు, ఫైటర్ జెట్‌లువిమానాలు గాల్లో దర్శనమిచ్చాయి. ఆకాశంలో ఎగురుతూ కనిపించాయి. దీంతో, ట్రంప్ చప్పట్లు కొడుతూ.. పుతిన్‌తో ఏదో మాట్లాడారు. మరోవైపు.. పుతిన్ మాత్రం వాటిని చూస్తూ ముందుకు కదిలారు.ఇక, ట్రంప్-పుతిన్ సమావేశం జరుగుతున్నంత సేపూ కూడా అవి గాల్లోనే చక్కర్లు కొడుతూ కనిపించాయి. దీని ద్వారా పుతిన్ అమెరికా సైనిక శక్తిని గ్రహించాలని ట్రంప్ భావించారు. గత నెలలో ఇరాన్ అణు కర్మాగారాలను ట్రంప్ సైన్యం ఇదే బీ-2 స్టెల్త్ బాంబర్లను ఉపయోగించి నాశనం చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోపై పలువురు నెటిజన్లు స్పందిస్తున్నారు. అందరి కంటే తానే బలవంతుడు, తన దేశమే బలమైన దేశం అని నిరూపించాలని ట్రంప్ ఇలా చేశారని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. పుతిన్‌ను హెచ్చరించేందుకే ట్రంప్ ఇలా చేశారని మరి కొందరు అంటున్నారు.




## జీఎస్టీలో మార్పులు.. ఈ వస్తువుల ధరలు తగ్గుతాయ్..!

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**గవస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో కీలక సవరణలకు కేంద్రం సిద్ధమైంది. సామాన్యులు, చిరువ్యాపారులపై భారం తగ్గించేలా.. ఇకపై జీఎస్టీలో రెండు శ్లాబ్‌ల (5, 18 శాతం) విధానాన్ని ప్రతిపాదించింది. 12, 28 శాతం శ్లాబ్‌లకు స్వస్తి పలకనుంది. దీపావళి కానుకగా ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో అనేక వస్తువుల ధరలు దిగి వచ్చే అవకాశం ఉంది. మరి అవేంటో ఓసారి చూద్దాం..! సవరించిన విధానాన్ని జీఎస్టీ మండలి ఆమోదిస్తే, ప్రస్తుతం 12% శ్లాబ్‌లో ఉన్న 99% వస్తువులు.. 5% పన్ను శ్రేణిలోకి వెళ్లనున్నాయి. అదే విధంగా ప్రస్తుతం 28% పన్ను శ్లాబులో ఉన్న వస్తు సేవల్లో 90%.. 18% పన్ను రేటుకు మారనున్నాయి. ఈ కొత్త విధానంతో జౌళి, ఎరువులు, పునరుత్పాదక విద్యుత్తు, ఆటోమోటివ్, హస్తకళలు, వ్యవసాయం, వైద్యం, బీమా రంగాలకు లాభం చేకూరనుంది.

జీఎస్టీ సవరణలతో ధరలు తగ్గే అవకాశం ఉన్న వస్తువులు ఇవే..

టూత్ పేస్ట్, టూత్ పౌడర్, హెయిర్ ఆయిల్, సబ్బులు
గొడుగులు, కుట్టు మెషీన్లు
ప్రాసెస్డ్ ఫుడ్, కండెన్స్‌డ్ మిల్క్, శీతలీకరించిన కూరగాయల వంటి ప్యాకేజ్డ్ ఫుడ్స్
ప్రెజర్ కుక్కర్లు, వాటర్ ఫిల్టర్లు, ప్యూరిఫయర్లు (నాన్ ఎలక్ట్రానిక్)
ఎలక్ట్రానిక్ ఐరన్స్, కంప్యూటర్లు, గీజర్లు, వాక్యూమ్ క్లీనర్లు (నాన్ కమర్షియల్)
రెడిమేడ్ దుస్తులు, రూ.500-1000లోపు ఉన్న పాదరక్షలు. చాలా రకాల వ్యాక్సిన్లు, హెచ్ఐవీ, హెపటైటిస్, టీబీ డయాగ్నోస్టిక్ కిట్లు
కొన్ని రకాల ఆయుర్వేద ఔషధాలు
జామెట్రీ బాక్సులు, మ్యాప్‌లు, గ్లోబ్‌లు, సోలార్ వాటర్ హీటర్లు
అల్యూమినియం, స్టీల్‌తో తయారుచేసిన వంటపాత్రలు, ఇతర సామగ్రి, నాన్ కిరోసిన్ స్టవ్‌లు
సైకిళ్లు, ప్రజా రవాణా వాహనాలు, వ్యవసాయ పరికరాలు, వెండింగ్ మెషీన్లు
గ్లేజ్డ్ టైల్స్ (లగ్జరీ కానీ వేరియంట్లు), లిక్విడ్ సోప్స్
సిమెంట్, రెడీ మిక్స్ కాంక్రీట్
ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్‌వాషర్లు.
కార్లు, మోటార్‌సైకిల్ సీట్లు, సైకిళ్లు, వ్యవసాయ వాహనాలకు వాడే రబ్బర్ టైర్లు, ప్లాస్టర్
ప్రొటీన్ సప్లిమెంట్లు, షుగర్ సిరప్‌లు, అరోమా కాఫీ, కాఫీ ఉత్పత్తులు
టాంపర్డ్ గ్లాస్, అల్యూమినియం ఫాయిల్, రేజర్లు, ప్రింటర్లు, మ్యానిక్యూర్/పెడిక్యూర్ కిట్లు

ప్రస్తుతం బీమాపై 18 శాతం జీఎస్టీ ఉండగా.. దాన్ని 5 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. అవసరమైతే సున్నాకు కూడా తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇక, సేవల రంగంపై 18 శాతం జీఎస్టీ విధించే అవకాశం ఉంది. మరోవైపు, హానికారక వస్తువులపై 40 శాతం ప్రత్యేక పన్ను విధించే అవకాశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది.

## రాష్ట్రపతికి కోర్టులు గడువు విధించే అధికారం లేదు

ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.బిల్లులపై గవర్నర్లు అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం తెలిపింది. ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన ఉన్నత ఆదర్శాలను సూచిస్తాయని పేర్కొంది. వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే అనవసరమైన న్యాయ జోక్యాల ద్వారా కాకుండా రాజ్యాంగపరమైన యంత్రాంగాల ద్వారా సరిదిద్దాలని సూచించింది.తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను గవర్నరు ఆర్. ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరి కాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయ స్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది.

## ప్రాచీన కాలంలో బుల్లి తిమింగలం

### ఆస్ట్రేలియా తీరంలో శిలజాన్ని గుర్తించిన సైంటిస్టులు

**వెల్లింగ్టన్,జనంసాక్షి:** సముద్రాల్లో తిరుగాడే తిమింగలం పరిమాణం ఎంత ఉంటుందో మనకు తెలుసు. భారీ ఆకారంతో టన్నుల కొద్దీ బరువుండే తిమింగలాలు ఉన్నాయి.కానీ, ప్రాచీన కాలంలో బుల్లి తిమింగలాలు ఉండేవని పరిశోధకులు గుర్తించారు. 2.5 కోట్ల సంవత్సరాల క్రితం నాటి తిమింగలం శిలాజం ఆస్ట్రేలియా సముద్ర తీరంలో లభించింది. దీనికి జంజూసిటస్ దులార్ది అని పేరు పెట్టారు.ఇది చాలా అరుదైన తిమింగలం అని చెబుతున్నారు. తిమింగలాల పరిణామ క్రమాన్ని తెలుసుకోవడానికి తోడ్పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇది ఎంత చిన్నది అంటే సింగిల్ బెడ్‌కు సరిగ్గా సరిపోతుంది. దాని కండ్లు టెన్నిస్ బంతుల సైజ్‌లో ఉన్నాయి. పదునైన దంతాలు కనిపిస్తున్నాయి. అంటే ఇవి ఆహారం కోసం సముద్రంలో ఇతర జీవులను వేటాడేవని తెలుస్తోంది. దీని ముఖం కార్టూన్ క్యారెక్టర్ ముఖాన్ని పోలి ఉంది. బుల్లి తిమింగలాలు ఎలా అంతరించిపోయాయన్నది తెలుసుకోవడానికి సైంటిస్టులు ప్రయత్నిస్తున్నారు.



# భరతమాత ముద్దుబిడ్డ వాజ్‌పేయి

- వాజ్ పేయి బాటలో నడుస్తూ భారత్‌ను "విశ్వగురు"గా తీర్చిదిద్దుతున్న మోదీ
- వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన కేంద్రసహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 16 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య ఫలాలను అట్టడుగునున్న పేద వాడి వరకు తీసుకెళ్లాలనే శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలను, సిద్ధాంతాలను తూ.చ. తప్పకుండా అమలు చేసిన గొప్ప నాయకుడు, మానవతావాది, భరతమాత ముద్దుబిడ్డ వాజ్ పేయి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. స్వార్ధ ప్రయోజనాల కోసం చిల్లర రాజకీయాలు చేస్తూ ప్రభుత్వ విధానాలను గుడ్డిగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలున్న ఈరోజుల్లో అందుకు భిన్నంగా ప్రతిపక్షమంటే ప్రజల పక్షమని నిరూపిస్తూ దేశ ప్రయోజనాల విషయంలో రాజకీయాలను పక్కనపెట్టి పాలక పక్షానికి సహకరించిన చరిత్ర వాజ్ పేయిదేనని పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాన మంత్రి, భారత రత్న అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా శనివారం రోజు కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బీజేపీ నేతలతో కలిసి వాజ్ పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బండి సంజయ్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. భారత దేశ వైభవాన్ని, విలువలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నానని, పదవుల కోసం ఎంతటికైనా దిగజారే వ్యక్తులు, పార్టీలున్న ఈరోజుల్లో అందుకు భిన్నంగా నమ్మిన సిద్ధాంతం కోసం, విలువల కోసం కేంద్ర మంత్రి, ప్రధానమంత్రి వంటి అత్యున్నత పదవులనే త్రుణ ప్రాయంగా వదిలేసుకున్న మహా నాయకుడు వాజ్ పేయి అని కొనియాడారు. 2 ఎంపీ సీట్లకే పరిమితమైన బీజేపీని అలుపెరగని పోరాటం చేసి ప్రభుత్వంలోకి తీసుకురావడంతోపాటు మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టిన నేత వాజ్ పేయి అని పేర్కొన్నారు. వాజ్ పేయి ఆలోచనలకు అనుగుణంగా నడుస్తూ భారత్ ను విశ్వగురుగా తీర్చిదిద్దుతున్న నాయకుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని పేర్కొన్నారు. ఆనాడు వాజ్ పేయి హయాంలో వీరోచిత కార్గిల్ పోరాటం చేస్తే మోదీ హయాంలో సర్జికల్ స్ట్రయిక్స్, ఆపరేషన్ సింధూర్‌తో పాక్ వెన్నులో వణుకు పుట్టించారు. స్వర్ణ చతుర్భుజితో జాతీయ రహదారుల విస్తరణకు వాజ్ పేయి నాంది పలికితే వాటిని పరిపూర్ణం చేసిన మహానేత మోదీ. గత పాలకుల హయాంలో లబ్దిదారులకు రూపాయి విడుదల చేస్తే అందులో 15 పైసలు మాత్రమే అందుతోందని, మిగిలిన పైసలు దళారుల చేతుల్లోకి వెళుతున్న సమయంలో జీరో బ్యాలెన్స్ తో కొట్ల పేదలకు బ్యాంకు అకౌంట్లను తెరిపించి సంక్షేమ ఫలాల నగదును దళారుల ప్రమేయం లేకుండా జమ చేస్తున్న గొప్ప నాయకుడు మోదీ అని ప్రధానిని కొనియాడారు.

# అనుక్షణం అప్రమత్తం





- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి
- జలాల్పూర్ - బడాపహాడ్ మార్గంలో రాకపోకల నిలిపివేత

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 16 (జనం సాక్షి) :** ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని స్వయంగా సమీక్షించారు. నిజామాబాద్ నగరం, బోధన్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు వర్ని మండలం జలాల్పూర్ తదితర ప్రాంతాలలో కలెక్టర్ పర్యటించారు. జలాల్పూర్ వద్ద లో లెవెల్ వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద జలాలను పరిశీలించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జలాల్పూర్ – బడాపహాడ్ మార్గంలో రాకపోకలను నిలిపి వేయించాలని అధికారులకు సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్ ను దారి మళ్లించాలని అన్నారు. చెరువులు, కాల్వలు, కుంటలు, వాగులలోకి ఎవరు కూడా చేపల వేటకు, ఈత కోసం వెళ్లకుండా కట్టడి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన రహదారులపై నుండి వరద జలాలు ప్రవహిస్తున్న చోట ఇరువైపులా పోలీసు బందోబస్తు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ప్రాణ నష్టం సంభవించడం, ప్రజలు, పశువులు వరదలో చిక్కుకోవడం వంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రెండు రోజుల పాటు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసినందున, అధికారులు అందరూ తమతమ కార్యస్థానాలలో ఉంటూ పరిస్థితులను నిశితంగా పర్యవేక్షించాలని హితవు పలికారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే, వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా సన్నద్ధమై ఉండాలన్నారు. కాగా, గోదావరి నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్న దృష్ట్యా, శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపర్లు, గొర్ల కాపర్లు, చేపలు పట్టే వారు, రైతులు, సాధారణ ప్రజానీకం ఎవరు కూడా గోదావరి నదిని దాటే ప్రయత్నాలు చేయకూడదని కలెక్టర్ సూచించారు. అంతకుముందు కలెక్టర్ నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్ స్టామ్ వాటర్ డ్రైనేజీలు పరిశీలిం చారు. అలాగే బోధన్ పట్టణంలోని షర్బతి కెనాల్, సరస్వతీ నగర్ ప్రాంతాలలో పర్యటించి, స్థానికంగా నెలకొని ఉన్న పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. వార్డు ఆఫీసర్లు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి, ఎలాంటి పరిస్థితులు తలెత్తినా సమర్ధవంతంగా ఎదుర్కొనేలా సన్నద్ధంగా ఉండాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని అన్నారు. ప్రమాదాలు జరిగిన తరువాత సహాయక చర్యలు చేపట్టడానికి బదులు, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్ట డం ఎంతో శ్రేయస్కరమని అధికారులకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచిం చారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, నిజామాబాద్ మున్సిపల్ ఈఈ మురళీ మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**ఐడీఓసీలో కంట్రోల్ రూమ్ తనిఖీ :**
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాల నుండి ఏమైనా ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తితే కలెక్టరేట్‌లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 08462-220183కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# ఆర్ఎఫ్‌సిఎల్‌లో అక్రమాలపై సిబిఐకి ఫిర్యాదు చేస్తా..

- రైతులకు యూరియా కొరత సృష్టించేందుకు కేంద్రం కుట్రలు
- అణుబాంబుల కింద బతుకుతున్నాం
- తెలంగాణకు 50 శాతం యూరియా ఇవ్వవలసిందే
- రసాయనాల శాఖమంత్రిని కలిసి సమస్యలపై విన్నపిస్తా
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, జనంసాక్షి :**
తెలంగాణాలో యూరియా కొరత సృష్టించడానికి కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎరువుల కర్మాగారంను శనివారం సందర్శించారు. అమ్మోనియా ఫ్లాంట్ లో తరుచు సాంకేతిక లోపాలు తలెత్తున్నాయని, నాణ్యత లోపంతోనే అమ్మోనియా లీకేజ్ అవుతుందని, రామగుండం ప్రజలు అణుబాంబు క్రింద దినదిన గండంగా బ్రతుకుతున్నారని అన్నారు. నాసిరకం పైపు లైన్ తో యూరియా కొరత ఏర్పడుతుందన్నారు. రైతులు నాట్లు వేసి యూరియా కొరకు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికి నాలుగుసార్లు షట్ డౌన్ చేసి యూరియా ఉత్పత్తికి ఆటకం కలిగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణాకు 50 శాతం యూరియా ఇవ్వవలసి ఉండగా ఇప్పుటి వరకు యూరియా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయటం సరైంది కాదన్నారు. వీర్లపల్లి గ్రామాన్ని తరలించాలని విజ్ఞప్తి చేసిన పట్టించుకోవటం లేదని, రామగుండం ఎరువుల కర్మాగారంలో జరుగుతున్న అవినీతిపై సిబిఐకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రసాయనాలు ఎరువుల శాఖమంత్రిని కలిసి రామగుండం ఎరువుల కర్మాగారంలో సమస్యలపై వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఎరువుల కర్మాగారంలో సమస్యలపై సిఈఓ అలోక్ సింఘాలకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన కారులో 16 కిలోల గంజాయి లభ్యం

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసు స్టేషన్ పరిధిలోని బాటసింగారం వద్ద ఓ కారు ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇక కారును పరిశీలించగా, అందులో గంజాయి ప్రత్యక్షమైంది. దీంతో పోలీసులు కారును సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్‌కు చెందిన భూక్యా నాయక్ ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా బాటసింగారం వద్ద కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో గంజాయి బయటపడిందన్నారు. 16 కేజీల గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భూక్యానాయక్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలను సెమిరెసిడెన్షియల్స్‌గా మార్చాలి

డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, టి. లింగారెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 16 (జనం సాక్షి) :**
రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) 15 వ వార్షిక కౌన్సిల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సోమయ్య అధ్యక్షతన హైదరాబాద్ లోని టి. ఎన్.జి. ఓ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి హాజరైన కౌన్సిల్ సభ్యులను ఉద్దేశించి సోమయ్య, లింగారెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అన్నింటిని సెమిరెసిడెన్షియల్ మార్చి, విద్యార్థులందరికీ ఉదయం అల్పాహారం, పుష్టికరమైన మధ్యాహ్నబోజనం, సాయంత్రం స్నాక్స్, పాలు ఇచ్చి పాఠశాలలోనే హోంవర్క్ చేపించిన అనంతరం విద్యార్థులను ఇంటికి పంపే విధానం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరారు. అప్పుడు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన స్రవంతి ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తూ, వాటికి బదులు గత ప్రభుత్వం కులాల వారిగా, మతాలవారీగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసినట్లే ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూల్ల పేరిట నూతన పాఠశాలల ఏర్పాటు సరికాదని, ఈ చర్యల ద్వారా సామాజిక, ఆర్థిక అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కావున అంతరాలను పెంచే వివిధ రకాల పాఠశాలలను కాకుండా అందరూ విద్యార్థులు కలసి చదువుకునే ఒకే రకమైన పాఠశాలలు ఏర్పాటు చేసి అందరికీ సమాన అవకాశాలు గల నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావలసిన ఐదు డి.ఎ లు వెంటనే విడుదల చేయాలని, 2023 జులై 1 వ తేది నుండి అమలయ్యే విధంగా పీఆర్సీ 40% ఫిట్మెంట్ తో అమలు చేయాలని, నెలల తరబడి పెండింగ్ లో ఉంటున్న ఆర్థిక బిల్లులు, పెన్షనరీ బెనిఫిట్స్ విడుదల చేయాలని, ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఖాళీగా ఉన్న డిఇఓ, డిప్యూటీ డిఇఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్స్ పోస్టులు వెంటనే భర్తీ చేసి పర్యవేక్షణ వ్యవస్థ పటిష్టం చేయాలని కోరారు. కోర్టు కేసులను అధిగమించి ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మరియు ఇతర ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, 29 రోజుల సమ్మె కాలానికి వేతనం చెల్లించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని గురుకుల, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. శంతన్, వి. రాజిరెడ్డి, టి. శ్రీశైలం, వి.రేణుక, చాప కార్యదర్శులు బాబుదొర, రాష్ట్ర ఎం.సామ్యూల్, ఎస్.భాస్కర్, జె.రామస్వామి, ఎ. శ్రీనివాస్ రెడ్డి, బి.శ్యామ్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.రఘుశంకర్ రెడ్డి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం. ఎన్.కిష్టప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్ పి. ఈశ్వర్ రెడ్డి, సభ్యులు సంపాదకులు సీహెచ్ జ్వాల, జి.కళావతి, పి.సుదర్శన్ వెంకటేశ్వర్లు, బి.సదానందం, అధ్యాపక రెడ్డి, అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ, సభ్యులు ఇప్ప రాంరెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీరు నిల్వకుండా చూడాలి

రానున్న 2 రోజులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ పమేలా సత్పతి.
నగరంలో పలు ప్రాంతాలు పరిశీలన



**కరీంనగర్ జిల్లా బ్యూరో,(జనంసాక్షి) :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడ కుండా రోడ్లపై, ఖాళీ స్థలాల వద్ద వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, భారీ వర్షాల సూచన నేపథ్యంలో రానున్న రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికా రులను ఆదేశించారు. వరద నీరు నిలిచే అవకాశం ఉన్న జిల్లాకేంద్రంలోని కట్టరాంపూర్ పరిధిలోని గౌతమినగర్, అలుగునూర్ చౌరస్తాలను శనివారం నగరపాలిక కమిషనర్ ప్రపుల్ దేశాయ్, డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) సిబ్బందితో కలిసి పరిశీలించారు. గౌతమినగర్‌లో డ్రైనేజీ లేక రోడ్డుపై, ఖాళీ స్థలాల్లో వరద చేరుతుంది. దీంతో భూముల యజమానులు అభ్యంతరం తెలుపగా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా వరద వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాల వేళ నిత్యం అప్రమత్తంగా ఉంటూ.. నాలాలు శుభ్రం చేసి రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలని పేర్కొన్నారు. మునిసిపల్, రెవిన్యూ, పోలీస్, ఆర్అండ్‌బి, విద్యుత్, పంచాయతీ రాజ్ ఇరిగేషన్ శాఖ అధికారులు రానున్న రెండు రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమన్వయంతో వర్షాల వల్ల ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వారి వెంట మున్సిపల్ డీఈ వెంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్, డీఆర్ఎఫ్ సిబ్బంది రెవెన్యూ అధికారులు ఉన్నారు.

### భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్ సత్య ప్రసాద్

**జగిత్యాల (జనం సాక్షి):** జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు. శనివారం జగిత్యాల మండలం అనంతారంలో లెవెల్ వంతెన, రాయపట్నం వంతెన, ధర్మపురి గోదావరి పరివాహక ప్రాంతం, నేరెళ్లలో లో-లెవెల్ వంతెన, సారంగాపూర్ మండలం రేచపల్లి ప్రాంతాలను సందర్శించి వరద ప్రభావిత పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు. వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఫీల్డ్ అధికారులు, సిబ్బంది నిత్యం ఫీల్డ్‌లో ఉండి 24 గంటలూ అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో ప్రమాదకర నాలాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల వల్ల మనుషులు, పశువులకు ప్రాణ నష్టం జరగకుండా చూడాలని, అధికారులు హెడ్‌క్వార్టర్స్ వదిలి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, హాస్టళ్లు, పురాతన భవనాలను గుర్తించి ఖాళీ చేయించాలని, సాధారణ పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.



## ప్రస్తుత అవసరం మేరకే రైతులు యూరియా కొనుగోలు చేయాలి

- యూరియా నిల్వ చేసుకోకుండా తగు జాగ్రత్తలు పాటించాలి
- విక్రయాల్లో అవకతవకలకు పాల్పడే డీలర్ల పట్ల కఠిన చర్యలు
- యూరియా పంపిణీపై వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,ఆగస్టు 15(జనంసాక్షి) :** ప్రస్తుత అవసరం మేరకే రైతులు యూరియా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో యూరియా పంపిణీ పై వ్యవసాయ అధికారులతో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రస్తుత అవసరం మేరకు మాత్రమే రైతులు యూరియా కొనుగోలు చేయాలని,ఈ అంశాన్ని మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లో యూరియాను ముందస్తుగా కొనుగోలు చేసే నిల్వ చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో యూరియా నిలువలు బాగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల పర్యటన సందర్భంగా రైతులకు తెలియజేయాలని, రైతులు భయభ్రాంతులకు గురై పెద్ద ఎత్తున బస్తాలు కొనకుండా రైతులను చైతన్య పర్చాలని అన్నారు. గ్రామాలలో ఒకే వ్యక్తి తరచుగా యూరియా కొనే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఇప్పటివరకు యూరియా అందని రైతుల వివరాలు సేకరించి వారికి యూరియా అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో కొంతమంది ఎరువుల డీలర్లు వారి బంధుమిత్రులకు యూరియాను ఎక్కువ మొత్తంలో అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, యూరియా విక్రయాలలో అక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీనివాస్, మంథని వ్యవసాయ అధికారి బి.అంజని, ఏడీఏ కాంతారావు, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- సదాశివ నగర్‌లో శాంతి కమిటీ సమావేశం : డిఎస్‌పి సూచన




**సదాశివనగర్ ఆగస్టు 16 (జనం సాక్షి) :** వినాయక చవితి పండగ సందర్భంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో నమోదు చేసుకోవాలని ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా సదాశివనగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వినాయక మండపాల నిర్వాహకులు వివిధ శాఖల అధికారులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల ఏర్పాటు మరియు గణనాథుడు కొలువుదీరిన నుండి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనల గురించి నిర్వాహకులకు ఆయన వివరించారు. మండపాల వద్ద నిర్వహించే ప్రత్యేక పూజలు, డిజె సౌండ్ , విద్యుత్ వినియోగం తదితర అంశాలపై ఆయన అధికారులకు నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు. సదాశివ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ గణేష్ పండగ సందర్భంగా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా పండగ జరుపుకోవాలని కోరారు. ఎన్ని గ్రామాల్లో ఎన్ని వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నారనే వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయం పోలీస్ స్టేషన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్ ,ఎస్సై పుష్పరాజ్, సిద్ధిక్, పోలీస్ సిబ్బంది, విద్యుత్ శాఖ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 21న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మహాగర్జన

- ఎస్సీ/ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయుల రిజర్వేషన్ ఫలాలను జిఓ 2 ద్వారా లాక్కుంటున్న ప్రభుత్వాలు
- ఎస్సీ/ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి



నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 16 (జనం సాక్షి)
తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ (టిజి టిటిఎఫ్), రామచందర్ టీఈజీఏ, ఎన్.యాదగిరి (బిటిఎఫ్), కొంగల వెంకట్, (ఎస్సీ, ఎస్సీ, ఎస్టీ యూఎస్), వి.సురేష్ (టీ ఈ జి ఏ) ఎస్.హరి కిషన్ (టిటిఏ), డాక్టర్ బాబూరావు (ఎస్సీ,ఎస్టీ డాక్టర్ అసోసియేషన్ ), తులసీదాస్ గైక్వాడ్ (ఎస్సీ, ఎస్టీ సెక్రెట్రియేట్ సంఘం) వాసం నాగేశ్వరరావు (ఎటిఎఫ్) డాక్టర్.నరసింహ, బబిత కుమారి (పీటీఏ) మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పదోన్నతులలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఎడెక్వేసీ లెక్కింపులో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి జనరల్ రోస్టర్ లో వెళ్లిపోయిన ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయ సంఖ్యను ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్ కింద లెక్కించ కూడదు. కానీ రిజర్వేషన్ రోస్టర్ కింద లెక్కించి కళ్ళ ముందు ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ ఫలాలను రెండు దశాబ్దాలు గా అందకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. జిఓ 2 ద్వారా జనరల్ రోస్టర్ లో ఉన్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయులను రిజర్వేషన్ రోస్టర్ లో లెక్కించి రెండు దశబ్దాలుగా వందల మందికి పదోన్నతులు రాకుండా ప్రభుత్వాలు మోసం చేస్తు వస్తున్నాయని ఆరోపించారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల పట్ల చట్టశుద్ధి ఉంటే జనరల్ రోస్టర్ ఉన్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయులను ఎడెక్వేసీ కింద లెక్కించకూడదని,రిజర్వేషన్ రోస్టర్ లోనే ఎడక్వసీని చూసి ఎవరి వాటా వారికి ఇవ్వాలని అన్నారు. ఎస్సీ,ఎస్టీ పదోన్నతులలో కన్సిక్వాన్షియల్ సీనియారిటీని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాలకు ఆర్టికల్ 14,15,16 ఇంద్ర సహాని కేస్ తో ముడిపెట్టి ఏజెన్సీ గిరిజన హక్కులు లాక్కోవద్దని అన్నారు.ఏజెన్సీ చట్టాలకు లోబడి ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్, అజ్మీరా వీరు నాయక్, రవీందర్, కృష్ణ మహారాజ్, ప్రేమకుమార్, రవీందర్, కేశపురం రమేష్ నాయక్, జాకబ్, విష్ణుమూర్తి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించిన సబ్ కలెక్టర్

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సబ్ కలెక్టర్

**పెద్ద కొడప్గల్ ఆగస్టు 16 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని శిథిలావస్థకు చేరిన ఇండ్లను శనివారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. తదనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండకూడదని, ఏమైనా ఇబ్బందులు వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అధికారులకు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దశరథ్, ఇన్చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# ఆసియా కప్‌కు టీమిండియా



**ఆసియా కప్‌కు టీమిండియా సిద్ధం**

**సూర్యకుమార్ ఫిట్‌నెస్ శుభవార్త**

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణుడైనట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ శుభవార్త ఆసియా కప్ 2025కు ముందు టీమిండియాకు ఊరటనిచ్చింది. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నమెంట్ కోసం బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఆగస్టు 19 లేదా 20న జట్టును ప్రకటించనుంది. భారత్ తన తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆడనుంది. సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో హైవోల్టేజ్ మ్యాచ్, సెప్టెంబర్ 19న అబుదాబిలోని షేక్ జాయెద్ స్టేడియంలో ఒమన్‌తో మూడో మ్యాచ్ ఆడనుంది.

సూర్యకుమార్ 2025 ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ తరఫున 717 పరుగులతో అద్భుతంగా రాణించాడు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఒక సీజన్‌లో 600ం పరుగులు చేసిన రెండో ముంబయి బ్యాటర్‌గా నిలిచాడు. గుజరాత్ టైటాన్స్ ఆటగాడు సాయి సుదర్శన్ (759) తర్వాత అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ముంబయి ఎలిమినేటర్‌లో గుజరాత్‌ను ఓడించినప్పటికీ, క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓడిపోయింది. ఐపీఎల్ తర్వాత సూర్య టీ20 ముంబయి లీగ్‌లో 5 ఇన్నింగ్స్‌లలో 122 పరుగులు చేశాడు. ఈ సమయంలో స్పోర్ట్స్ హెర్నియా నొప్పితో బాధపడ్డ సూర్య, జూన్‌లో జర్మనీలోని మ్యూనిచ్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. 2023లో చీలమండ గాయం కారణంగా కూడా ఆపరేషన్ చేయించుకున్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంతో ఆసియా కప్‌లో సూర్య సారథ్యం వహించడం ఖాయమైంది.

అయితే, యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు ఆసియా కప్ జట్టులో స్థానం దక్కకపోవచ్చని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల అండర్సన్-టెండూల్కర్ సిరీస్‌లో ఇంగ్లాండ్‌పై 4 సెంచరీలతో 754 పరుగులు చేసిన గిల్, రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత కెప్టెన్‌గా ఆకట్టుకున్నాడు. అయినప్పటికీ, సూర్య సారథ్యంలో టీ20 జట్టు రాణిస్తుండటం, అభిషేక్ శర్మ, సంజు శాంసన్ ఓపెనింగ్ జోడీ అద్భుత ఆరంభాలు అందించడంతో సెలక్టర్లు ప్రయోగాలకు వెనుకాడుతున్నారు. మిడిల్ ఆర్డర్‌లో సూర్యకుమార్, తిలక్ వర్మ, రింకు సింగ్ ఉండటంతో పోటీ తీవ్రంగా ఉంది. గిల్‌తో పాటు యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లకు కూడా స్థానం దక్కకపోవచ్చు. జట్టు కూర్పుపై స్పష్టత కోసం కొన్ని రోజులు ఆగాల్సి ఉంది. 2026 టీ20 ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరుగుతుంది.

# మ్యాక్స్‌వెల్ విధ్వంసం

## ఆసీస్ సిరీస్ కైవసం



- **సౌతాఫ్రికా పోరాటం: బ్రెవిస్ హాఫ్ సెంచరీ**
- **ఆసీస్ బౌలింగ్ దెబ్బ: ఎల్లిస్, జంపా ధాటి**

సౌతాఫ్రికాతో సొంతగడ్డపై జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1 తేడాతో కైవసం చేసు కుంది. శనివారం జరిగిన చివరి టీ20లో గ్లేన్ మ్యాక్స్‌వెల్ (36 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆసీస్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్లకు 172 పరుగులు చేసిం ది. బ్రెవిస్ (26 బంతుల్లో ఫోర్, 6 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీతో రాణించ గా, రాసీ వాన్ డెర్ డస్సెన్ (26 బంతుల్లో 3 ఫోర్లతో 38 నాటౌ ట్), రిస్టన్ స్టబ్స్ (23 బంతు ల్లో 2 ఫోర్లతో 25) మెరిశా రు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎల్లిస్ (3/31) మూడు వికెట్లు, జోష్ హాజె ల్‌వుడ్ (2/30), ఆడమ్ జంపా (2/24) రెండేసి వికెట్లు పడగొట్టారు. లక్ష్య ఛేదన లో ఆసీస్ 19.5 ఓవర్లలో 8 వికెట్లకు 173 పరుగులతో గెలిచింది. మ్యాక్స్‌వెల్ తో పాటు మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీ సాధించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో కోర్బిన్ బోచ్ (3/26) మూడు వికెట్లు, కగిసో రబడా (2/32), క్వేన్ మఫకా (2/36) రెండేసి వికెట్లు తీశారు. చివరి 12 బంతుల్లో 12 పరుగులు అవసరమైన సమయంలో బోచ్ 19వ ఓవర్‌లో బెన్ ద్వార్షుయిస్ (1), నాథన్ ఎల్లిస్ (0)లను ఔట్ చేసి కేవలం 2 పరుగులు ఇచ్చాడు. ఆఖరి ఓవర్‌లో 10 పరుగులు కావాల్సిన ఉత్కంఠ సమయంలో లుంగి ఎంగిడి వేసిన ఓవర్‌లో మ్యాక్స్‌వెల్ తొలి రెండు బంతుల్లో (2, 4) 6 పరుగులు, చివరి బంతిలో బౌండరీ బాది విజయాన్ని అందించాడు.

సౌతాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రేవస్ క్రికెట్ ప్రపంచాన్ని ఒక ఊపు ఊపేస్తున్నాడు. ఈ 22 ఏళ్ల యువ ఆటగాడు ఇప్పుడు ఆస్ట్రేలియాపై మూడో టీ20 మ్యాచ్‌లో మరో విధ్వంసక హాఫ్ సెంచరీ సాధించాడు. కేవలం 26 బంతుల్లోనే 53 పరుగులు చేసి, తనదైన స్టైల్లో ఆస్ట్రేలియా బౌలర్లను ఉతికి ఆరేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఏకంగా 6 భారీ సిక్సులు కొట్టడం విశేషం. జూనియర్ ఏబీ డివిలియర్స్ అని పిలుచుకునే బ్రేవస్, ఇదే సిరీస్‌లో ఇంతకుముందు ఓ సెంచరీ కూడా సాధించాడు. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య మూడో, చివరి టీ20 మ్యాచ్ కైర్న్స్ మైదానంలో జరిగింది. ఈ సిరీస్ 1-1తో సమంగా ఉండటంతో, ఈ మ్యాచ్ ఇరు జట్లకు కీలకంగా మారింది. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు కేవలం 49 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అలాంటి క్లిష్ట సమయంలో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన బ్రేవస్ మొదట నెమ్మదిగా ఆడాడు. తన మొదటి 10 బంతుల్లో కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. కానీ ఆ తర్వాత గేర్ మార్చి, తర్వాతి 16 బంతుల్లోనే 42 పరుగులు సాధించి తన తుఫాన్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. అతను కేవలం 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి, ఆస్ట్రేలియాపై అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ చేసిన సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌గా తన రికార్డును తానే అధిగమించాడు. ఈ సిరీస్‌లో ఇంతకుముందు అతను 25 బంతుల్లోనే ఫస్ట్ హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో బ్రేవస్ బ్యాటింగ్ స్ట్రోక్స్‌లో హైలైట్ 10వ ఓవర్. ఆస్ట్రేలియా బౌలర్ ఆరోన్ హార్డీ వేసిన ఆ ఓవర్లో బ్రేవస్ ఒంటరిగా 26 పరుగులు సాధించాడు. ఆ ఓవర్లో ఒక వైడ్ బాల్ కూడా రావడంతో మొత్తం 27 పరుగులు వచ్చాయి. హార్డీ ఓవర్లో మొదటి రెండు బంతుల్లో కేవలం 2 పరుగులు మాత్రమే వచ్చాయి. ఆ తర్వాత బ్రేవస్ వరుసగా నాలుగు సిక్సులు బాది ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. ఈ ఇన్నింగ్స్‌లో బ్రేవస్ 26 బంతుల్లో 203 స్ట్రైక్ రేట్‌తో 53 పరుగులు చేశాడు. ఇందులో ఒక ఫోర్, ఆరు సిక్సులు ఉన్నాయి. ఒకే సిరీస్‌లో ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో, బ్రేవస్ భవిష్యత్తులో దక్షిణాఫ్రికా క్రికెట్‌కు ఒక గొప్ప ఆశాకిరణంగా మారనున్నాడు. అతని షాట్ సెలక్షన్స్, స్టైల్ చూస్తుంటే క్రికెట్ అభిమానులకు ఏబీ డివిలియర్స్‌ను గుర్తు చేస్తున్నాడు.

# చెన్నై సూపర్ కింగ్స్‌పై అశ్విన్ ఆరోపణలు

స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన ఆరోపణలను 'అసత్యం' అని చెన్నై సూపర్ కింగ్స్ కొట్టిపారేసింది. 2025లో డెవాల్డ్ బ్రెవిస్‌ను సంతకం చేయడానికి ఫ్రాంచైజీ సీక్రెట్‌గా ఎక్కువ డబ్బులు ఇచ్చిందని అశ్విన్ సంచలన ఆరోపణలు చేశాడు. వాస్తవానికి, చెన్నై జట్టుకు గుర్జపనీత్ సింగ్ స్థానంలో ప్లేయర్ కావాలి, అతని స్థానంలో గత సీజన్‌లో డెవాల్డ్ బ్రెవిస్ ను సీఎస్కే తీసుకుంది. చాలా జట్లు ఈ యువ దక్షిణాఫ్రికా బ్యాటర్‌ను తమ ఫ్రాంచైజీలో చేర్చుకోవాలని కోరుకున్నాయి. కానీ చెన్నై సూపర్ కింగ్స్ ఎక్కువ డబ్బులు ఆఫర్ చేసి సఫారీ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌ను తమ ఫ్రాంచైజీలో చేర్చుకుందని అశ్విన్ ఆరోపించాడు. దీనిని సోషల్ మీడియాలో 'మోసపూరిత ఒప్పందం' అని కూడా పేర్కొన్నాడు. అశ్విన్ చేసిన ఆరోపణలను తప్పు అని చెన్నై సూపర్ కింగ్స్ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా తేల్చింది. పోస్ట్ చేస్తూ, ఫ్రాంచైజీ ఇలా రాసుకొచ్చింది. "డెవాల్డ్ బ్రెవిస్ ప్లేయర్ రెగ్యులేషన్స్ 2025-2027, క్లాజ్ 6.6 ప్రకారం రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా అగ్రిమెంట్ చేసుకున్నాడు.

# పాండ్యా సన్‌రైజర్స్‌కు ఆడాల్సింది

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేయాల్సిందని మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తెలిపాడు. ఐపీఎల్ 2012కి ముందు హార్దిక్ పాండ్యా గురించి అప్పటి సన్‌రైజర్స్ హైదరాబాద్ మెంటార్ వీవీఎస్ లక్ష్మణ్‌కు చెప్పానని, కానీ అతను పట్టించుకోలేదన్నాడు. లక్ష్మణ్ తన మాట విని హార్దిక్ పాండ్యాకు అవకాశం ఇచ్చి ఉంటే హార్దిక్ పాండ్యా సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోనే కొనసాగేవాడని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ కామెంట్రీ ప్యానెల్ నుంచి ఇర్ఫాన్ పఠాన్‌ను బీసీసీఐ తప్పించిన విషయం తెలిసిందే. స్టార్ క్రికెటర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోనే ఇర్ఫాన్ పఠాన్‌పై వేటు పడినట్లు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను విమర్శించడంతోనే ఇర్ఫాన్ పఠాన్‌పై వేటు పడిందని ప్రచారం జరిగింది. కానీ హార్దిక్ పాండ్యా ఫిర్యాదుతోనే తనను కామెంట్రీ ప్యానెల్ నుంచి తొలిగించారని ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పఠాన్ స్పష్టం చేశాడు. తనకు హార్దిక్ పాండ్యాకు ఎలాంటి గొడవలు లేవని, కెరీర్ ప్రారంభంలో అతనికి చాలా అండగా నిలిచానని చెప్పాడు.'క్రికెట్ వ్యాఖ్యాతగా విమర్శించడం మా పని. బాగా ఆడితే కొనియాడటం.. ఆడకపోతే విమర్శించడం కామెంటేటర్లుగా మా బాధ్యత.

# 10 ఫోర్లు, 4 సిక్సర్లతో విధ్వంసం

కరేబియన్ గడ్డపై పాకిస్తాన్ బౌలర్లను ఉతికి ఆరేశాడు ఓ ఆస్ట్రేలియా వికెట్ కీపర్, బ్యాటర్. అదిరిపోయే హాఫ్ సెంచరీ చేయడమే కాదు.. తన జట్టుకు అద్భుతమైన విజయాన్ని అందించాడు. ఈ ఆటగాడు వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్‌తో కలిసి సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పడమే కాదు.. ఇంకా 16 బంతులు మిగిలి ఉండగానే టోర్నమెంట్‌లో తన జట్టుకు తొలి విజయాన్ని అందించాడు. ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్లు సీపీఎల్ 2025లో రెండో మ్యాచ్‌ను కేవలం 59 బంతుల్లో 114 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. ఈ సమయంలో ఆస్ట్రేలియా వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ బెన్ మెక్‌డెర్మాట్ 10 ఫోర్లు, 4 సిక్సర్లతో అద్భుతమైన అర్ధ సెంచరీ సాధించాడు. వెస్టిండీస్ కెప్టెన్ కూడా అజేయంగా అర్ధ సెంచరీ సాధించడం విశేషం. రెండవ మ్యాచ్ సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్, గయానా అమెజాన్ వారియర్స్ మధ్య జరిగింది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. ఆండ్రీ ఫ్లెచర్ జట్టు తరఫున అద్భుతంగా బ్యాటింగ్ చేసి 41 బంతుల్లో 60 పరుగులు చేశాడు. ఫ్లెచర్ తన ఇన్నింగ్స్‌లో ఒక ఫోర్, ఐదు సిక్సర్లు బాదాడు. అతడితో పాటు యువ ఆటగాడు జైద్ గల్లీ 24 పరుగులు సాధించాడు. అమెజాన్ వారియర్స్ తరఫున ఆల్ రౌండర్ డ్వేన్ ప్రిటోరియస్ నాలుగు ఓవర్లలో 43 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టగా.. ఇమ్రాన్ తాహిర్ రెండు వికెట్లు తీశాడు. బెన్ మెక్‌డెర్మాట్ ఈ 153 పరుగుల లక్ష్యాన్ని అత్యంత ఈజీగా కానిచ్చేశాడు. ఐదు వికెట్ల తేడాతో తన జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అమెజాన్ వారియర్స్ తొలి వికెట్‌ను ముందుగానే కోల్పోయింది. కానీ ఆ తర్వాత బెన్ మెక్‌డెర్మాట్, షాయ్ హోప్‌తో కలిసి రెండో వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ భాగస్వామ్యంలో మెక్‌డెర్మాట్ 39 బంతుల్లో 75 పరుగులు చేసి భీకర ఇన్నింగ్స్ ఆడాడు. తన ఇన్నింగ్స్‌లో అమెజాన్ వారియర్స్ బౌలర్లలో ఎవరినీ వదిలిపెట్టలేదు. అలాగే ఈ ఇన్నింగ్స్‌లో డాషింగ్ బ్యాట్స్‌మెన్.. పాకిస్తాన్‌కు చెందిన అబ్బాస్ అఫ్రిది వేసిన ఒకే ఓవర్‌లో 21 పరుగులు చేశాడు. దీనితో పాటు అతడు నసీమ్ షాను బౌండరీలతో వెల్‌కమ్ చెప్పాడు. బెన్ మెక్‌డెర్మాట్ మాత్రమే కాదు.. షాయ్ హోప్ 56 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. అతడు తన ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదాడు. మెక్‌డెర్మాట్ వికెట్ పడిన తర్వాత కూడా.. ఓ ఎండ్‌లో హోప్ వేగంగా పరుగులు రాబట్టాడు. తన జట్టును 16 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందించాడు. ఆపై ఆల్ రౌండర్ మొయిన్ అలీ 19 పరుగులు చేసి అవుటయ్యాడు.



# సీనియర్ ఆటగాళ్ల జీతాల కోత

- **ఫిట్‌నెస్ టెస్టులపై దృష్టి**
- **విఫలమైతే కాంట్రాక్ట్ రద్దు హెచ్చరిక.**

పాకిస్థాన్ క్రికెట్ జట్టు ఆటతీరు రోజురోజుకూ క్షీణిస్తోంది. గత కొన్ని సిరీస్‌లలో వైఫల్యాలు, ముఖ్యంగా వెస్టిండీస్‌తో ఇటీవలి వన్డే సిరీస్ ఓటమి, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుని కఠిన చర్యలకు పురిగొల్పింది. సీనియర్ ఆటగాళ్ల జీతాలను తగ్గించేందుకు పీసీబీ యోచిస్తోం దని సమాచారం. గత రెండేళ్లలో ప్రపంచ వేదికలపై పాక్ జట్టు పేలవ ప్రదర్శన చూపడం, టెస్టులు, వన్డేలు, టీ20లలో వరుస ఓటములతో పీసీబీ నిర్ణయం తీసుకుంది.

సెంట్రల్ కాంట్రాక్ట్‌లోని ఆటగాళ్లకు మ్యాచ్ రెవెన్యూలో 3% వాటాను గతంలో అందించిన పీసీబీజి, ఈ రెవెన్యూ షేర్‌ను రద్దు చేయాలని భావిస్తోంది. దీనివల్ల బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్ వంటి స్టార్ ఆటగాళ్ల జీతాలు గణనీయంగా తగ్గనున్నాయి. ప్రస్తుతం కేటగిరీ మ్యాచ్‌కు ఆటగాళ్లకు నెలకు 6.57 మిలియన్ మ్యాచ్‌కు (రూ.19.5 లక్షలు) లభిస్తుండగా, రెవెన్యూ షేర్ రద్దయితే ఇది 4.5 మిలియన్ మ్యాచ్‌కు (రూ.13.4 లక్షలు) తగ్గుతుంది.

2025లో పాక్ జట్టు 3 టెస్టుల్లో ఒక్కటే గెలిచింది, 11 వన్డేల్లో 2 విజయాలు, 14 టీ20ల్లో 7 విజయాలు మాత్రమే సాధించింది. వెస్టిండీస్‌పై 34 ఏళ్లలో మొదటిసారి వన్డే సిరీస్ ఓడిపోవడం, బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ కావడం పీసీబీ కోపానికి కారణమైంది. ఛాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ మోడల్ వల్ల ఆదాయం కోల్పోయిన పీసీబీ, రిటైనర్‌షిప్ బడ్జెట్‌ను 37% పెంచినప్పటికీ, మ్యాచ్ ఫీజులు స్థిరంగా ఉంచింది. ఈ నేపథ్యంలో సీనియర్ ఆటగాళ్లు తమ కాంట్రాక్ట్‌లను తిరస్కరించే అవకాశం ఉందని, ఫిట్‌నెస్ టెస్టుల్లో విఫలమైతే ఒప్పందాలు రద్దు చేస్తామని పీసీబీ హెచ్చరించింది. ఆగస్టు 16, 2025 నాటికి, జీతాల కోతపై తుది నిర్ణయం తీసుకోలేదని, కానీ ఆటగాళ్లలో అసంతృప్తి నెలకొందని వార్తలు వస్తున్నాయి.

# సంజు శాంసన్ కోసం కేకేఆర్ భారీ ఆఫర్



2026 ఐపీఎల్ ట్రేడ్ విండో ఇప్పటి నుంచే హోరెత్తుతోంది. రాజస్థాన్ రాయల్స్ స్టార్ కెప్టెన్ సంజు శాంసన్ జట్టును వీడేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) శాంసన్‌ను ట్రేడ్ చేసుకునేందుకు ఆసక్తి చూపుతుండగా, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కూడా ఈ రేసులో చేరింది. కేకేఆర్ శాంసన్ కోసం రాజస్థాన్‌కు భారీ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం.

2024లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో ఛాంపియన్‌గా నిలిచిన కేకేఆర్, 2025లో ఆజింక్యా రహానే కెప్టెన్సీలో 7వ స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో జట్టుకు సమర్థ కెప్టెన్, వికెట్ కీపర్-బ్యాటర్ అవసరం ఉంది. శాంసన్ ఈ లోటును భర్తీ చేస్తాడని కేకేఆర్ భావిస్తోంది. శాంసన్ (రూ.18 కోట్లు) కోసం కేకేఆర్ యువ ఆటగాళ్లు అంగ్‌క్రిష్ రఘువంశీ (రూ.3 కోట్లు), రమణ్‌దీప్ సింగ్ (రూ.4 కోట్లు)లను ట్రేడ్‌లో ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఈ ఇద్దరి విలువ రూ.7 కోట్లు కాగా, మిగిలిన రూ.11 కోట్లను క్యాష్‌గా చెల్లించాల్సి ఉంటుంది. రాజస్థాన్‌కు ఈ డీల్ లాభదాయకం. రమణ్‌దీప్ సింగ్ ఫినిషర్‌గా, బౌలర్‌గా, రఘువంశీ యువ బ్యాటర్‌గా జట్టు బలాన్ని పెంచుతారు. రాజస్థాన్ మిడిల్ ఆర్డర్, ఫినిషింగ్ సమస్యలను ఈ ఇద్దరు పరిష్కరించవచ్చు. మరోవైపు, సీఎస్‌కే శాంసన్ కోసం రవీంద్ర జడేజా లేదా శివమ్ దూబెను ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆ ఆఫర్‌ను రాజస్థాన్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. అలాగే, సీఎస్‌కేలో రవిచంద్రన్ అశ్విన్ తనను విడుదల చేయాలని కోరినట్లు వార్తలు వచ్చాయి. అశ్విన్‌ను ట్రేడ్ చేసి శాంసన్‌ను తీసుకునే అవకాశం సీఎస్‌కే వద్ద ఉంది. ఈ ట్రేడ్‌పై తుది నిర్ణయం కోసం కొన్ని రోజులు ఆగాల్సి ఉంది.





## జలకళను సంతరించుకోనున్న

# మిడ్ మానేరు

- **ఎల్లంపల్లి నుంచి 9450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**
- **మానేరు,మూలవాగు నుంచి 450 క్యూసెక్కులు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జనంసాక్షి) :**

*తెలంగాణకు గుండెకాయ లాంటి నీటి మధ్యమానేరు జలాశయం మొన్నటి వరకు తక్కువ నీటి సామర్థ్యంతో విలవిల పోయింది. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుండి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో జలకలను సంతరించుకుంటుంది. గత మూడు రోజులుగా జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతుం డడంతో మధ్య మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుంది. ఎగువ నుంచి ఎల్లంపల్లి జలాశయానికి ఇన్‌ఫ్లో స్థిరంగా కొనసాగుతుండడం, అప్పర్ మానేరు మత్తడి దూకడానికి సిద్ధంగా ఉండడంతో త్వరలోనే మిడ్ మానేరు జలాశయం పూర్తిస్థాయిలో నిండనుంది.*

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మానువాడ వద్ద 27.5 టిఎంసిల సామర్థ్యంతో మిడ్ మానేరు ప్రాజెక్టును నిర్మించారు. 2.0 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో నిర్మించిన ప్రాజెక్టు కాలక్రమేన తెలంగాణకు గుండెకాయ లాగా మారింది. మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఎస్సారెస్పీ, కాళేశ్వరం,ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా నీరు రానుండగా మరోవైపు మానేరు,మూలవాగు వరద నీరు ఆదారం. ఇక్కడి నుంచి దిగువన ఎల్ఎండి జలాశయం కుడి ఎడమ కాలువకు, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువు, మల్కపేట రిజర్వాయర్, మిషన్ భగీరథతో పాటు అన్నపూర్ణ జలాశయానికి నీటి తరలింపు జరుగుతుంది. ప్రస్తుతం కుడి,ఎడమ కాలువల కింద సుమారు 65 నుంచి 80 వేల ఎకరాల వరకు పంటలు సాగవుతున్నట్లు అంచనా.

**మధ్య మానేరు ప్రాజెక్టులో 9.453 టీఎంసీల నీరు..**

మిడ్ మానేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 9.453 టీఎంసీల నీరు నిలువ ఉంది. మధ్య మానేరు ప్రాజెక్టుకు ఎల్లంపల్లి నుంచి నంది మేడారంలోని నంది పంపు హౌస్,రామడుగు మండలంలోని గాయత్రి పంపు హౌస్ ద్వారా వరద కాలువలో నీటిని ఎత్తిపోస్తున్నారు. 3310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నుంచి 9450 క్యూసెక్కులకు పెంచారు. మొన్నటి వరకు జలాశయంలో నీరు లేకపోవడంతో రైతులు వరినాట్లు ఆలస్యంగా ప్రారంభించారు.సాగునీటి కోసం కుడి కాలువకు చెందిన రైతులు ఇల్లంతకుంట మండలం పోత్తూరు వద్ద ఆందోళన నిర్వహించారు. జలాశయం దిగువన మానువాడ,మల్లాపూర్ గ్రామాల్లో వరి నాట్లు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం మధ్యం ప్రాజెక్టులోకి వరద కాలువ ద్వారా నీరు వస్తుండడం నీటి నిల్వ పెరుగుతుండడంతో సాగునీటి ఇబ్బందులు తొలగానున్నాయని రైతులు తెలిపారు. మరోవైపు గంభీరావుపేట మండలంలోని నర్మాల జలాశయం మత్తడి దూకడానికి సిద్ధంగా ఉంది. కాగా నంది గాయత్రి పంప్ హౌస్ నుంచి ఎత్తిపోతలు ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే కొనసాగుతుంది. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా, ఇతర అంశాలతో నీటిని ఎత్తిపోయడం లేదు. పై అధికారుల ఆదేశాలకు మేరకు మాత్రమే నీటి విడుదల ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

# చిన్న గాయమని.. చంపేశారు



- **ఫ్రూడెన్స్ హాస్పిటల్ ఎదుట బంధువుల ధర్నా**
- **మాఫియాకు ఈ హత్యలు షరమామూలే**

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 16 (జనం సాక్షి) :**



నిజామాబాద్ పట్టణంలో హాస్పిటల్ మాఫియా చేతిలో మరణాలు సంభవి స్తూనే ఉన్నాయి. అదే తరహాలో నగరంలోని ప్రూడెన్స్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంలో శనివారం రాత్రి ఒకరు మృతి చెందడం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు నిజామాబాద్ నగరంలోని శ్రీనగర్‌లో గల ప్రుడేన్స్ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్ ప్రాంతానికి చెందిన మెడికల్ రిప్‌గా పనిచేసే సాయికుమార్ (26) తన బంధువు హైదరాబాద్ నుండి వస్తున్నాడని కారులో అతనిని తీసుకురావడానికి వెళ్లి, తిరుగు ప్రయాణంలో బిక్నూర్ మండలం జంగంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం బారిన పడ్డారు.అతనితో పాటు ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా సాయికుమార్ అనే వ్యక్తిని నిజామాబాద్ ప్రూడేన్స్ హాస్పటల్లో చేర్పించారు. అతని చేతికి కాలుకు గాయమైందని చెప్పి హాస్పిటల్ వర్గాలు చేర్చుకొని ట్రీట్మెంట్ ప్రారంభించారు. వైద్యం చేస్తుండగా సాయికుమార్ మరణించాడని తెలపడంతో బంధువులు ఒక విధంగా దిగ్భ్రాంతి చెంది హాస్పటల్ వర్గాలను నిలదీయగా సమాధానం చెప్పడానికి చాటేసినారు. ఈ విషయంలో మృతుడి బంధువులు, అతనితో పనిచేసే మెడికల్ రిప్రజెంటివ్ సంఘం సభ్యులు ఆసుపత్రి చేరుకొని ధర్నాకు దిగినారు. భాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు నాయకులు నూర్జహన్, కఠారి రాములు మానవ హక్కుల సంఘం అధ్యక్షురాలు రషీదా బేగం, టిడిపి అధికార ప్రతినిధి పురుషోత్తం, తెలంగాణ మెడికల్ రిప్రజెంటీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తో పాటు మెడికల్ రిప్ లు పాల్గొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# యువతకు వల వేసిన బీహార్ సిఎం

- కోటి ఉద్యోగాల ఆశ చూపెడుతూ ప్రకటన
- మరోమారు అధికారమే లక్ష్యంగా కొత్త ఎత్తుగడ



**పాట్నా, ఆగస్ట్ 16 (జనంసాక్షి) :** బీహార్‌లో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈసారి కూడా తానే ముఖ్యమంత్రి అవ్వాలని, తమ పార్టీనే మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నితీష్‌కుమార్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే కొన్ని కీలక హామీని ఆయన ప్రకటించారు. తాజాగా ఆయన శనివారం బీహార్‌లోని కోటి మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రకటించారు. ఆ రాష్ట్రంలోని పరిశ్రమలను ప్రోత్సహించడానికి, యువత భవిష్యత్తు భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని నిర్ణయించినట్లు- నితీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆయన 2020లో ఇచ్చిన ఏడు హామీల్లో.. యువతకు ఉపాధి కల్పించడం కూడా ఉంది. గతంలో 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలు అందిస్తామని ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నెరవేర్చిందని నితీష్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'మేము మరోసారి అధికారంలోకి వస్తే.. కోటి మందికి ఉద్యోగాలు, ఉపాధిని కల్పించాలని లక్ష్యయంగా పెట్టు-కున్నాం. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు-కు, స్వయం ఉపాధి పొందేవారికి ప్రభుత్వం వివిధ సౌకర్యాలను అందించడం ద్వారా ప్రోత్సహిస్తుంది. అలాగే కొత్తగా పరిశ్రమలు స్థాపించడానికి, ప్రైవేట్ రంగాలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని అందివ్వడం జరుగుతుంది. ప్రత్యేకించి పరిశ్రమలను ప్రోత్సహించడానికి వాటికందించే మూలధన సబ్సిడీ, వడ్డీ సబ్సిడీ, జిఎస్‌టి కోసం అందించే ప్రోత్సాహక మొత్తాన్ని రెట్టింపు చేస్తాం. పరిశ్రమల స్థాపనకు అన్ని జిల్లాల్లో భూమిని అందిస్తాం. అలాగే ఎక్కువ మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు భూమిని ఉచితంగా అందిస్తాం అని నితీష్ కుమార్ తెలిపారు. బీహార్ యువత ఎంతో నైపుణ్యం కలిగినవారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం.. వారి భవిష్యత్తు భద్రత కోసం చర్యలు తీసుకోవడం అవసరం అని నితీష్ కుమార్ పేర్కొన్నారు.

# విమానంలో సాంకేతిక లోపం

- వెంటనే ల్యాండ్ చేసిన పైలట్



**బెంగళూరు, ఆగస్ట్16 (జనంసాక్షి) :** విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడిన షాకింగ్ ఘటన శనివారం కర్ణాటకలో వెలుగుచూసింది. బెల్గాం నుంచి ముంబై వెళ్తున్న ఓ విమానంలో ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన విమానాన్ని తిరిగి విమానాశ్రయంలో సేఫ్‌గా ల్యాండ్ చేసి 48 మంది ప్రాణాలను కాపాడారు. శనివారం బెల్గాం నుంచి ముంబైకి ఒక విమానం వెళుతోంది. ఈ సమయంలో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఉందని గుర్తించిన పైలట్ తిరిగి వెంటనే ఆయన సేఫ్‌గా విమానాన్ని విమానాశ్రయంలో ల్యాంగ్ చేశారు. విమానం ఉదయం 7.50 గంటలకు బయలుదేరి 8.50 గంటలకు ముంబై చేరుకోవాల్సి ఉంది. సాంకేతిక లోపం కారణంగా విమానాన్ని నిలిపివేశారు. దీంతో ప్రయాణీకుల కోసం సదురు విమానయాన సంస్థ ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు-చేసింది. ఇంజిన్ వైఫల్యానికి గల కారణాన్ని ఎయిర్‌లైన్స్ పరిశీలిస్తోంది. ఇటీవలి కాలంలో తరుచుగా విమానాలలో సాంకేతిక సమస్యల కేసులు నమోదు కావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురి అవుతున్నారు. గతంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో సుమారుగా 260 మంది మరణించారు. ఈ సంఘటన తర్వాత విమానాల భద్రతా ఏర్పాట్ల గురించి అనేక ప్రశ్నలు తలెత్తాయి. గతంలో విమానంలో ప్రయాణించడం సురక్షితమైనదని, తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేరుకోవచ్చని భావించేవారు. కానీ ఇప్పుడు విమానంలో ప్రయాణించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడం చాలా పెద్ద విషయం అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజల్లో ఏర్పడిన ఈ అభిప్రాయాలను మార్చడం కోసం విమానయాన సంస్థలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# పాక్ వరద మృతులు 321కు చేరిక

**లాహోర్, ఆగస్ట్16 (జనంసాక్షి) :** పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ల్లోని పలు ప్రాంతాల్లో వరదలకు మృతి చెందిన వారి సంఖ్య 321కు చేరుకుంది. ఈ విషయాన్నిఅక్కడి అధికారులు వెల్లడించారు. గల్లంతయిన వారి కోసం గాలిస్తున్నారు. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా రెండు రోజుల్లోనే 321 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే 307 మంది చనిపోయినట్లు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం పేర్కొంది. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని లోయర్ దిర్, బజౌర్, అబోటాబాద్, జబ్రారీతో సహా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో భారీ విధ్వంసం చోటు-చేసుకుంది. వరదల కారణంగా పదుల సంఖ్యలో భవనాలు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కూడా కొట్టు-కుపోయాయి. అనేక రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదల్లో అనేక మంది గల్లంతైనట్లు- అధికారులు వెల్లడించారు. వీరికోసం ముమ్మర గాలింపు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు దాదాపు 2వేల మందితో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు- అధికారులు వెల్లడించారు. మరోవైపు పాక్‌లోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్ష ముప్పు ఉన్నట్లు స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

# హాస్టల్ నిర్వాహకుడిపై మహిళల దాడి

**హైదరాబాద్, ఆగస్ట్16 (జనంసాక్షి) :** మాదాపూర్‌లో ఉమెన్స్ హాస్టల్ నిర్వాహకుడిపై మహిళలు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. మాదాపూర్ ఇమేజ్ గార్డెన్ రోడ్డులో అర్ణవ్ ప్లాజాలో ఉన్న ఎన్‌పీపీ ఎగ్జిక్యూటివ్ ఉమెన్స్ హాస్టల్‌లో 16 ఏళ్ల బాలిక ఉంటోంది. బాలికపై హాస్టల్ నిర్వాహకుడు సత్య ప్రకాష్ లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ కొందరు మహిళలు ఆందోళనకు దిగారు. పూలకుండీలను ధ్వంసం చేసిన మహిళలు, సత్యప్రకాష్‌పై దాడికి దిగారు. హాస్టల్‌లో గొడవ జరుగుతోందని డయల్ 100కు సమాచారం రావడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితి అదుపు చేశారు. దాడికి పాల్పడిన మహిళలతో పాటు-, సత్య ప్రకాష్‌ను మాదాపూర్ పీఎస్‌కు తరలించారు. మైనర్ బాలికపై లైంగిక దాడి జరగలేదని, కావాలనే పథకం ప్రకారం తనపై దాడి చేశారని సత్య ప్రకాష్ ఆరోపించారు. అయితే కేసును విచారి స్తున్నామని పోలీసులు తెలిపారు.

# చందానగర్ ఖజానా దోపిడీని ఛేదించిన పోలీసులు

- నిందితులను అదుపులోకి తీసుకుని సొత్తు స్వాధీనం



**హైదరాబాద్, ఆగస్ట్16 (జనంసాక్షి) :** హైదరాబాద్ చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ప్రత్యేకబృందాలు నిఘా పెట్టి వారిని పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి నాటు తుపాకులు, బులెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ వినీత్ మీడియాకు వెల్లడించారు. నిందితులు ఖజానా జ్యువెలరీ వద్ద 20 రోజులు రెక్కీ నిర్వహించినట్లు- తెలిపారు. దోపిడీకి మొత్తం ఏడుగురు వ్యక్తులు వచ్చినట్లు- పేర్కొన్నారు. బైకులపై వచ్చి దోపిడీ చేసి, మళ్లీ బైకులపైనే పరారయ్యారు. నకిలీ నంబర్ ప్లేట్లతో వచ్చి చోరీకి పాల్పడి.. ఆ తర్వాత వాటిని మార్చుకున్నారు. నగర శివారులో, భద్రతాసిబ్బంది ఎక్కువగా లేని దుకాణాన్ని ఎంచుకొని దోపిడీకి పాల్పడ్డారు. 10 కిలోల వెండి ఆభరణాలు, వస్తువులతో పరారయ్యారు. ఈ ముఠా గతంలో కోల్‌కతా, బిహార్, కర్ణాటకలో దోపిడీలకు పాల్పడినట్లు- గుర్తించాం. రెండేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉన్నారు. ఈ బిహార్ ముఠా హైదరాబాద్‌లో చేసిన తొలి చోరీ ఇది. ఇతర రాష్ట్రాలకూలీలను నియమించుకునేవాళ్లు జాగ్రత్తగా ఉండాలి. కూలీలకు ఏమైనా నేర చరిత్ర ఉందా అని ఆరా తీయాలి. లేబర్ సప్లయ్ ఏజెన్సీలు తమ వద్దకు వస్తున్న వారి వివరాలు మాకు ఇస్తే బాగుంటుందని వినీత్ తెలిపారు.

# శ్రీరాం సాగర్‌కు భారీగా వరదనీరు


- జలకళ సంతరించుకున్న ప్రాజెక్ట్



**నిజామాబాద్, ఆగస్ట్ 16 (జనంసాక్షి) :** ఉత్తర తెలంగాణ వరప్రదాయనిగా పేరుగాంచిన శ్రీ రామసాగర్ ప్రాజెక్టు కు భారీగా వరదనీరు చేరుతోంది. ఎగువన గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మహారాష్ట్ర బాబ్లీ, విష్ణుపురి, మాలేగావ్ ప్రాజెక్టుల నుండి ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 89,466 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 80.501 టిఎంసిలు ఉండగా శనివారం మధ్యాహ్నం వరకు 1082.30 అడుగులు 51.659 టిఎంసిలుగా ఉందని ప్రాజెక్టు ఎ.ఇ.ఇ.రవి తెలిపారు. ప్రధాన కాలువ కాకతీయ ద్వారా 4,625 వేల క్యూసెక్కులు, మంచి నీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 541 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టు నీటిమట్టం 1081.10 అడుగులు 48.071 టిఎంసిలుగా ఉందని.. జూన్ 1 నుండి ఇప్పటివరకు 46.930 టిఎంసిల నీరు వచ్చి చేరిందని వివరించారు. జూన్ 1 నుండి ఇప్పటివరకు 8.937 టిఎంసీ ల నీరు విడుదల చేశామని అధికారులు తెలిపారు. గోదావరి నదిలో భారీగా వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నదీ పరిసర ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే పశువుల కాపర్లు, గొర్ల కాపరులు, చేపలు పట్టేవారు, రైతులు మరియు సామాన్య జనం గోదావరి నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.చక్రపాణి తెలిపారు.

# రజనీకి చంద్రబాబు, మోడీల అభినందనలు

- కృతజ్ఞతలు తెలిపిన తలైవా రజనీ కాంత్



**చెన్నై, ఆగస్ట్16 (జనంసాక్షి) :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ధన్యవాదాలు తెలిపారు. తలైవా ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రెండు రోజుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఆయనకు అభినందనలు తెలిపారు. చంద్రబాబు పోస్ట్‌ను షేర్ చేసిన రజనీ.. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మీ మాటలు నా హృదయాన్ని తాకాయి. మీ అభినందనలు నాకు ఆనందాన్నిచ్చాయి. మీ సందేశం నా మనసుకు హత్తుకుంది. ఈ శుభాకాంక్షలు నాలో స్ఫూర్తి నింపాయి. మీ లాంటి వ్యక్తుల ప్రేమ, స్నేహంతో నేను సినిమా పరిశ్రమలో ఉత్తమంగా రాణించడానికి కృషిచేస్తాను అంటూ చంద్రబాబుకు రజనీకాంత్ థాంక్స్ చెప్పారు. ఆగస్టు 15 నాటికి సూపర్ స్టార్ ఇండస్ట్రీలో ప్రవేశించి 50 ఏళ్లు పూర్తయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న ఫొటోను పంచుకొని ఏపీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ తన సినిమాలతో ప్రేక్షకులను అలరించడమే కాకుండా సందేశాలు కూడా ఇస్తారని కొనియాడారు. సామాజిక సమస్యలపై కూడా పలు చిత్రాలు తీశారని.. అవి ఎంతోమందిని కదిలించాయని తెలిపారు. ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ కూడా రజనీకాంత్‌కు విషెస్ చెప్పారు. ఆయన పోషించిన వైవిధ్యమైన పాత్రలు ప్రేక్షకులపై ఎంతో ప్రభావం చూపాయన్నారు. ఇలాగే మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. మోదీకి సైతం రజనీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. తానెంతగానో గౌరవించే నాయకుడి నుంచి అభినందనలు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ పోస్టు పెట్టారు.

# రజనీకాంత్ స్టైలే వేరు

- నేటి తరంలోనూ రజనీకి అభిమానులు
- అభినందనలు తెలిపిన పవన్ కళ్యాణ్

**అమరావతి, ఆగస్ట్16 (జనంసాక్షి) :** అగ్ర కథానాయకుడు రజనీకాంత్ సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ డిప్యూటీ- సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు చెప్పారు. నటుడిగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుంటున్న రజనీకాంత్ మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలని ఆకాంక్షించారు. వెండితెరపై 'సూపర్ స్టార్ రజని' అని -టైటిల్ కనిపించగానే థియేటర్లు ఏ విధంగా మార్మోగుతాయో పలుమార్లు చెన్నైలో చూశా. తరాలు మారుతున్నా సినీ ప్రియుల్లో ఆ ఆనందోత్సాహాల వన్నె తగ్గలేదు. ఆ స్థాయి అభిమానులను దక్కించుకున్న కథానాయకుడు రజనీకాంత్. నటుడిగా అయిదు దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. సినీ జీవితంలో స్వర్ణోత్సవం చేసుకుంటున్న సూపర్ స్టార్ రజనీకాంత్‌కి హృదయ పూర్వక శుభాకాంక్షలు. ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. ప్రతినాయక పాత్ర పోషించినా, కథానాయకుడిగా మెప్పించినా తనదైన స్టైల్‌ను చూపించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారు. ఆయన నడకలో, సంభాషణలు పలకడంలో, హావభావ విన్యాసంలో ప్రత్యేకతను చూపిస్తారు. రజనీకాంత్‌స్టైల్‌కి నవతరం ప్రేక్షకుల్లోనూ అభిమాను లున్నారు. నటు-డిగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుం టున్న రజనీకాంత్ మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు అందించాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు వాగు

- అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి తుమ్మల



**హైదరాబాద్, ఆగస్టు16 (జనంసాక్షి) :** భారీ వర్షాలతో మున్నేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో జిల్లా ఉన్నతాధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రమత్తం చేశారు. శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. మున్నేటికి ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో మున్నేరుకి వరద ముప్పు పొంచి ఉందని తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం వద్ద మున్నేరు 14.50 అడుగుల మేర ప్రవహిస్తోందని పేర్కొన్నారు. జిల్లా అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ముందస్తు.. సహాయక చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ముంపుకు గురి అయ్యే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో ఉన్న 12 డివిజన్లలోని ప్రజలకు అవసరమైన అత్యవసర తక్షణ సహాయం అందించాలని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులను ఆదేశించారు. మంత్రి తుమ్మల ఆదేశాలతో అధికార యంత్రాంగం చర్యలు మొదలుపెట్టింది. మున్నేరు పరివాహక ప్రాంతంలోని డివిజన్లో పర్యటిస్తూ.. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేస్తున్నారు అధికారులు. ఖమ్మం వద్ద ఉధృతంగా మున్నేరు ప్రవహిస్తుంది. 15 అడుగుల మేర ప్రవాహం కొనసాగుతున్నట్లు- అధికారులు తెలుపుతున్నారు. 16 అడుగులకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ఈ రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు- అధికారులు చెబుతున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను శాటిలైట్ ద్వారా గుర్తించి ఆయా ప్రాంతాల్లో అధికార యంత్రాంగం సహాయక చర్యలు ప్రారంభించింది.

# కంగనా రనౌత్ ద్విపాత్రాభినయం

- అటురాజకీయం ..ఇటు సినిమా రంగం
- ఆడవారి నెలసరి బాధలపై హాట్ కామెంట్స్



**న్యూఢిల్లీ, ఆగస్ట్16 (జనంసాక్షి) :** నటి, ఎంపి కంగనా రనౌత్ ఏ విషయంలో అయినా ముక్కుసూటిగా ఉంటారు. ఎంపిగా ఆమె హిమాచల్ మండి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నెలసరి సమయంలో ఉండే బాధ, ఇబ్బందులు సామాన్య మహిళలకే కాదు.. సెలబ్రిటీలకు తప్పవన్నారు నటి, ఎంపీ కంగనా రనౌత్. వారు కూడా ఈ సమస్యలకు అతీతం కాదన్నారు. సినీరంగం నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేసిన కంగనా తాజాగా ఈ రెండు రంగాలను పోలుస్తూ మహిళగా తాను ఎదుర్కొంటున్న సమస్యను పంచుకున్నారు. ఈ రెండు రంగాలు పూర్తిగా భిన్నమైనవి. ఇండస్ట్రీలో హీరోయిన్స్‌కు కారవాన్‌లు ఉంటాయి. అవుట్‌డోర్ చిత్రీకరణల సమయంలో ప్రత్యేకమైన సదుపాయాలు కూడా చిత్రబృందం ఏర్పాటు చేస్తుంది. దాంతో పీరియడ్స్ సమయంలో మరింత శ్రద్ధ తీసుకునే వీలుంటుంది. వాష్‌రూమ్‌లకు వెళ్లే సదుపాయం ఉంటుంది. విశ్రాంతి కూడా తీసుకోవచ్చు. అవసరం అనుకుంటే టీమ్‌తో చెప్పి మినరల్ వాటర్‌ను కూడా వేడి చేసి ఉపయోగించుకోవచ్చు. కానీ, ఇప్పుడు నేను ఉంటోన్న రంగం పూర్తిగా వేరు. ఒక్కోసారి పర్యటనలో భాగంగా రోజుకు 12 గంటలు ప్రయాణించాల్సి వస్తుంది. కనీసం టాయిలెట్‌కు వెళ్లడానికి కూడా ఉండదు. నాకే కాదు.. ఇతర ఎంపీలకు కూడా ఇదే సమస్య ఉంది. అందరూ అనుకునేంత చిన్న ఇబ్బంది కాదిది. పెద్ద విపత్తుతో పోల్చొచ్చు. దీన్ని వర్ణించడం కూడా అసాధ్యం అని తెలిపారు. తన నటనతో నాలుగు జాతీయ అవార్డులను సొంతం చేసుకున్న ఈ నటి.. 2024లో భాజపా తరఫున హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో ఎంపీగా పోటీ-చేసి విజయం సాధించారు. అమ్మాయిలు వయసులో ఉండి ఏదైనా సాధించాలనే పట్టుదలతో ఉన్నప్పుడు ఒక పెళ్లి అయ్యి పిల్లలు ఉన్న వ్యక్తి మీతో సంబంధం పెట్టుకోవాలని ప్రయత్నిస్తే అది మగవాడి తప్పు కాదు. మీరు పెళ్ళి అయిన వాళ్ళతో సంబంధం పెట్టుకోవడం మీ తప్పు అని జనాలు ఎప్పుడూ మహిళను తప్పుగా చూస్తారు. ఇలాంటి సందర్భాల్లో అమ్మాయి తప్పు చేసినట్లే, మగవాడి తప్పు చేశాడు అని ఎవరు అనుకోరంటూ కంగనా అభిప్రాయపడింది. అలాగే డేటింగ్ యాప్స్ వాడకం గురించి కంగనా మాట్లాడుతూ.. ఇవి సమాజంలో మురికి కాలువ లాంటివని.. ఆత్మవిశ్వాసం లేనివారు, ఎవరో ఒకరి గుర్తింపు కోసం చూసేవాళ్లు మాత్రమే ఇలాంటివి వాడుతారని కంగాన చెప్పుకోచ్చింది. పెద్దలు కుదిర్చిన వివాహం ద్వారా అయిన లేదా చదువుకున్న -టైంలో అయిన అమ్మాయిలు తమ పార్ట్‌నర్‌లను వెతుక్కోవాలని కంగనా సూచించింది. అలాగే లివ్-ఇన్ రిలేషన్‌లు అమ్మాయిలకు సురక్షితం కాదని కంగనా చెప్పుకోచ్చింది. ఇలాంటి రిలేషన్‌లో అమ్మాయిలకు గర్భం వస్తే కుటుంబం నుంచి సరైన తోడు ఉండదని చెప్పుకోచ్చింది. ఇకపోతే నెలసరి బాధలపై ఇటీవల నటి జాన్వీ కపూర్ కూడా స్పందించింది. అబ్బాయిలకు ఈసమస్య ఉంటే తెలిసేదని వ్యాఖ్యానించింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370